ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 21.09.2026 | సంపుటి :13 సంచిక : 62 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

# రష్యాపై ఉక్రెయిన్ విశ్వరూపం

## వెయ్యిడ్రోన్లతో కీవ్ సేనల దాడి

### రాజధాని మాస్కో లక్ష్యంగా వందల సంఖ్యలో ప్రయోగం
### యుద్ధం మొదలైన అనంతరం చోటుచేసుకున్న అతిపెద్ద దాడి

- పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వేళ అటాక్
- ఘటనల్లో ఇద్దరు మృతి, 20 మందికిపైగా గాయాలు
- మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున చెలరేగిన మంటలు
- రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే లక్ష్యం

మాస్కో(జనంసాక్షి): రష్యా- ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ విరుచుకుపడింది. మునుపెన్నడూ లేని స్థాయిలో రాత్రికి రాత్రే వందలాది డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. పలు భవనాలు, చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ ప్రయోగించిన చాలా డ్రోన్లను తమ బలగాలు మార్గమధ్యంలోనే అడ్డుకున్నాయని రష్యా ప్రకటించింది. అయితే, ఉక్రెయిన్ దాడుల కారణంగా మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. మిగతా 2లో..



### రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే లక్ష్యం

రష్యా చమురు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేశాం. ఈ దాడుల్లో రష్యా చమురు కర్మాగారం దెబ్బతిన్నంది. ఇందుకు గానూ, తమ సైనిక సిబ్బంది, గూఢచర్య విభాగానికి కృతజ్ఞతలు..అదే సమయంలో రష్యా యుద్ధ యంత్రాంగాన్ని నడిపిస్తున్న బిలియన్ల కొద్దీ డాలర్ల ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే మా లక్ష్యం ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి, శాంతి దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నా.. - జెలెన్స్కీ




## జైశంకర్‌కు సర్ నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల సంఘం నోటీసులిస్తోంది. ఇప్పటికే దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై ప్రతిపక్షాల నుంచి మిగతా 2లో..

## ఇద్దరి ఆస్తులపై విచారణకు సిద్ధమా..!

- కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వల్ల ఎవరికీ లాభం లేదు
- బూటకపు హామీలతో ప్రజలను మోసం చేశారు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆపేశారు: హరీశ్‌రావు



2లో..

## ఓడిపోతేనేం..!

# మాజీ ఎమ్మెల్యే చేతే ప్రాజెక్టు ప్రారంభోత్సవం

### అహాన్ని పక్కన పెట్టి అభివృద్ధి చేసిన ప్రజాప్రతినిధికి ఆహ్వానించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎంజే. సెబాస్టియన్

- ఇదే నిజమైన కేరళం కథ..
- రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కంటే అభివృద్ధికే ప్రాధాన్యత ఉందని చెప్పేందుకు ఇదే ఉదాహరణ:సీఎం సతీశన్
- సెబాస్టియన్ చర్యపై హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి



కేరళలోని పూజార్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేతో ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరిపిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం.జే. సెబాస్టియన్

తిరువనంతపురం(జనంసాక్షి): మాజీ ఎమ్మెల్యేతో ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరిపించిన పూజార్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం.జే. సెబాస్టియన్‌ను కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ అభినందించారు. దీనిని 'అసలైన కేరళం కథ'గా అభివర్ణించిన ఆయన.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పేందుకు ఈ సంఘటనే ఉదాహరణ అని చెప్పారు. "స్థానిక ఎమ్మెల్యేగా వంతెనను తానే ప్రారంభించేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. సెబాస్టియన్ స్వచ్ఛందంగా తప్పుకొని.. ప్రాజెక్టు కార్యరూపం దాల్చడానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసేలా అధికారులను ఒప్పించారు. రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కంటే.. అభివృద్ధికే ప్రాధాన్యత ఉందని చెప్పేందుకు ఇదే ఉదాహరణ. ఇదే నిజమైన కేరళం కథ" అని సతీశన్ పేర్కొన్నారు. సెబాస్టియన్‌కు హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ... " అహం కన్నా అభివృద్ధి ముఖ్యం, రాజకీయాల కన్నా ప్రజలే ముఖ్యం. మేం రాజకీయాల్లో కొత్త ఒరవడి తీసుకొస్తున్నాం. కేరళంలో కొత్త శకం ప్రారంభమైంది" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన సెబాస్టియన్ కులథుంకాల్‌ను కాంగ్రెస్ అభ్యర్థి ఎం.జె. సెబాస్టియన్ ఓడించారు. అయితే, ఓ వంతెన నిర్మాణానికి రూ.80 లక్షల నిధులను నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి కులథుంకాల్ ఇది వరకే మంజూరు చేశారు. ప్రారంభానికి సెబాస్టియన్ స్థానిక అధికారుల్ని ఒప్పించి.. మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించేలా చూశారు. వంతెన పనికి పూర్తి ఖ్యాతి ఆయనదేనని సభాముఖంగా చెప్పారు. తర్వాత వంతెనను కులథుంకాల్ లాంఛనంగా ప్రారంభించారు.

## ఇందిరమ్మ ఫ్లాట్ల లబ్ధిదారులకు

# శుభవార్త

### నేటి నుంచి అలాట్‌మెంట్ లెటర్స్ జారీ



"డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనర్హులు ఉంటే అధికారులు వెంటనే వారిని తొలగించాలి. కేటాయించిన ఇళ్లలో నివసించని వారికి తుది నోటీసులు జారీ చేయాలి. స్పందించని వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ యూనిట్లను అర్హులైన వారికి తిరిగి కేటాయించాలి. క్యూర్ పరిధిలో ఇప్పటికే ఇంటి స్థలాలు ఉన్న సుమారు 9 వేల మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాము. ఇన్‌ఛార్జ్ మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి మంజూరు పత్రాలను అందజేయాలి" మంత్రి పొంగులేటి

- ఈ మేరకు లబ్ధిదారుల మొబైళ్లకు నేరుగా పత్రాలను పంపనున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- అధికారిక వెబ్‌సైట్ నుంచీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటన

హైదరాబాద్(జనంసాక్షి): ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం నుంచి అలాట‌్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సప్, ఎస్సెమ్మెస్ ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక మిగతా 2లో..

## అసైన్డ్ భూములను కేసీఆర్ ఎందుకు పంచలేదు?

### నిజాం ఆస్తుల కంటే మాజీ సీఎం కుటుంబ ఆస్తులే ఎక్కువ
### మూడో రోజు క్షేత్రస్థాయి పరిశీలనలో మల్లు రవి, చామల

హైదరాబాద్(జనంసాక్షి): నిజాం ఆస్తుల కంటే మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ ఆస్తులు ఎక్కువని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆ ఆస్తులన్నీ ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మూడోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా నగరంలోని అజీజ్‌నగర్‌లో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు. అనంతరం చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ భూముల పరిశీలనకు వచ్చాం. కేటీఆర్‌కు మిగతా 2లో..



## గ్రామీణ ఉపాధి కల్పనలో కోదాడ మెగా జాబ్ మేళా మైలురాయి


### 350 కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన మంత్రి ఉత్తమ్
### 30 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు.. 5,725 మంది అభ్యర్థుల షార్ట్‌లిస్ట్
### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

హైదరాబాద్(జనంసాక్షి): విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు ఒకే వేదికపైకి రాగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు నమోదు చేసుకున్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి నేతృత్వంలో సెప్టెంబర్ 19న నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం గ్రామీణ నిరుద్యోగ సమస్యను ప్రధానాంశంగా తీసుకుంది. భౌగోళిక దూరం, ఉద్యోగ సమాచార లోపం, ఆర్థిక పరిమితుల కారణంగా ప్రముఖ సంస్థలను చేరుకోలేకపోతున్న గ్రామీణ యువతకు స్థానికంగానే అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన యువత ఈ మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, వైద్య ఆరోగ్య రంగం, బ్యాంకింగ్, రిటైల్‌తోపాటు వివిధ మిగతా 2లో..

# 'ఓఆర్ఆర్'పై మృత్యుఘోష

### రహదారి ఎక్కితే దిగుతామన్న గ్యారెంటీ లేదు! • '120' స్పీడ్‌తో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

*అజాగ్రత్త, అతివేగం, నిర్లక్ష్యం ఔటర్ రింగ్ రోడ్డుపై వరస ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అజాగ్రత్త, అతివేగం కారణంగా ఈ ఏడాది 9 నెలల వ్యవధిలోనే ఓఆర్ఆర్‌పై 28 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలోనే రోడ్డెక్కితే తిరిగొస్తామో లేదో అనే భయం వాహన దారుల్లో నెలకొంది. ఓఆర్ఆర్‌పై భద్రతా చర్యలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంకో వైపు డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో నిద్ర మత్తులోకి జారుకోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి*





- వేగానికి తోడు నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు
- 9 నెలల వ్యవధిలోనే 28 దుర్ఘటనలు
- ప్రాణాలు కోల్పోయిన 20 మంది.. పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- ఓఆర్ఆర్‌పై భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి

2లో..

## మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న ఎలుకలు

- వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుషం
- ఫ్రీజర్ లేకపోవడంతోనే ఘోరం



వరంగల్ బ్యూరో(జనంసాక్షి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ తీరుకు అద్దం పడుతూ వర్ధన్నపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో గ్భాంతికర ఘటన చోటుచేసుకుంది. మార్చురీలో భద్రపరిచిన మృతదేహాన్ని ఎలుకలు కొరికి తినడం తీవ్ర కలకలం రేపింది. వరంగల్ జిల్లాకు రాయపర్తి మండలం కు చెందిన గారె వీరయ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శవపంచనామా పోస్టుమార్టం నిమిత్తం శనివారం రాత్రి ఆయన మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా 2లో..

## డిమాండ్లకు అంగీకరించకపోతే నిర్ణయాత్మక యుద్ధానికీ సిద్ధం

### అధ్యక్షుడు ట్రంప్ స్పందన కోసం ఇరాన్ ఎదురు చూస్తున్నాం:ఇరాన్



టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా నుంచి తమకు ఎటువంటి సందేశం లేదా ప్రతిపాదనలు రాలేదని ఇరాన్ విదేశాంగశాఖ స్పష్టతనిచ్చింది. పాకిస్థాన్ ఇంటీరియర్ మంత్రి మోహసీన్ నఖ్వీ ఇరాన్ రాజధాని టెహ్రాన్ చేరుకొన్న వేళ ఈ వివరణ రావడం గమనార్హం. నఖ్వీ కేవలం ద్వైపాక్షిక సంబంధాలపై చర్చల నిమిత్తమే వచ్చినట్లు వెల్లడించింది. మరోవైపు ఇరాన్ నుంచి అమెరికాకు మొత్తం ఏడు షరతులు వెళ్లాయి. ఇందుకోసం ఖతార్ మధ్యవర్తులను మిగతా 2లో..



## సన్నగిల్లిన ఆశలు

### నాలుగు వారాలు దాటినా ఇంకా దొరకని 6వేల మంది ఆచూకీ

- అప్పర్ త్రిశూలి-1 ప్రాజెక్టు నుంచి 17 మృతదేహాల వెలికితీత
- శిథిలాల తొలగింపునకు 4 నెలలు పట్టొచ్చన్న నేపాల్ ఆర్మీ
- సవాల్‌గా మారిన మృతదేహాల గుర్తింపు.. డీఎన్ఏ పరీక్షల పైనే ఆధారం

2లో..

## డిమాండ్లకు అంగీకరించకపోతే నిర్ణయాత్మక యుద్ధానికీ సిద్ధం

వాడుకుంది. డిమాండ్లను తిరస్కరిస్తే తాము నిర్ణయాత్మక యుద్ధానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు దీనిలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ సుప్రీం నేషనల్ కౌన్సిల్ చీఫ్ మోహసీన్ రెజాయి స్పందిస్తూ ఖతార్ ఇప్పటికే అమెరికాకు వీటిని చేరవేసిందని.. అధ్యక్షుడు ట్రంప్ స్పందన కోసం ఇరాన్ ఎదురు చూస్తున్నామని తెలిపారు. యుద్ధాన్ని ముగించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడం వంటివి ఈ డిమాండ్‌ల్లో ఉన్నాయి. మరోవైపు క్యాంప్ డేవిడ్‌లో తన వారాంతపు విడిదిని కుదించుకొని ట్రంప్ శ్వేతసౌధానికి హడావుడిగా తిరిగి వచ్చారు. శాంతి చర్చల పునః ప్రారంభానికి ఇరాన్ ఏడు నిబంధనలు విధించిన తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకొన్నాయి. ఇక యెమెన్‌లో హూతీ రెబల్స్ కూడా సౌదీ రాజధాని రియాద్‌పై దాడి చేయడంతో అమెరికా కూడా పరిమిత స్థాయి సైనిక చర్యకు సిద్ధమవుతున్నట్లు వార్తొలొస్తున్నాయి

## జైశంకర్‌కు 'సర్' నోటీసులు

తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్‌ఐఆర్' కింద ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్‌ఐఆర్-2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్‌బాగ్‌లో ఓటు హక్కు ఉంది.మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్‌కు కూడా 'సర్' నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్‌ఐఆర్' కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది.

## మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న ఎలుకలు

ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం కుటుంబ సభ్యులు వెళ్లగా, మృతదేహంపై కంటి భాగాలను ఎలుకలు పీక్కుతిన్న ఆనవాళ్లు కనిపించాయి. మార్చురీ గదిలో మృతదేహాలను భద్రపరిచేందుకు కనీస వసతులు, ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య లోపం, సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికులు, ప్రజా సంఘాలు మండిపడ్డారు.తక్షణమే ఆసుపత్రిలో ఆధునిక వసతులు, ఫ్రీజర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం నుంచి సోషల్ మీడియా లో వైరల్ అవడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత ఆసుపత్రి వర్గాలు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు బంధువులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆసుపత్రి వర్గాలు మాత్రం అలా జరిగి ఉండకపోవచ్చు అని అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం

# రష్యాపై ఉక్రెయిన్ విశ్వరూపం



దీంతో సమీప ప్రాంతాల్లో భారీగా పొగ వ్యాపించింది. పలు నివాసాలు దెబ్బతిన్నాయి. మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని అధికారులు తెలిపారు.

మాస్కో వైపు దూసుకొచ్చిన 450కుపైగా డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అటు రష్యా ఆక్రమిత క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దుకాగా మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి.

**యుద్ధం అనంతరం తొలిసారిగా ఎన్నికలు**

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో తొలిసారిగా పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్నాయి. అధ్యక్షుడు పుతిన్ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్షం దాదాపుగా లేకుండా సాగుతున్న ఈ ఎన్నికల ద్వారా క్రెమ్లిన్ ఆధిపత్యం మరింత సుస్థిరం కానుంది. అయితే రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో కూడా పోలింగ్ నిర్వహించడాన్ని కీవ్ తీవ్రంగా తప్పుబట్టింది. రష్యా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించేందుకే ఉక్రెయిన్ తాజా దాడులకు పాల్పడిందని, అయితే ఆ కుట్రలో శత్రువులు విఫలమయ్యారని రష్యా పేర్కొంది. ఉక్రెయిన్ డ్రోన్‌లను సమర్థవంతంగా కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రష్యా రాజధాని వైపు వస్తున్న 450 డ్రోన్‌లను మార్గమధ్యంలో ధ్వంసం చేశారని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు.

**అత్యాధునిక డ్రోన్ సాంకేతికత**

ఇదిలా ఉండగా, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై దాదాపు నాలుగేళ్లు గడుస్తుంది. అయినప్పటికీ ఇరుపక్షాలు సైనికులు ప్రతిదాడులతో విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో కీలక పరిణామం జరిగింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ సైనిక డ్రోన్ సాంకేతికతలో ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. రష్యా లోపలికి చొచ్చుకెళ్లి దాడులు చేయడానికి, దేశీయంగా ఉత్పత్తి చేసిన సుదూర డ్రోన్‌లతో పాటు క్షిపణులను కూడా మోహరిస్తోంది. అయితే, ఉక్రెయిన్ డ్రోన్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలను, రక్షణ పరికరాల తయారీదారులను ఆకట్టుకుంది. శాంతి ఒప్పందం కోసం చర్చలు జరపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తేవాలని కీవ్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, యుద్ధాన్ని ఆపే ఉద్దేశం ఉన్నట్లు పుతిన్ ఇప్పటివరకు ఎలాంటి సంకేతాలు చూపలేదు. దీంతో యుద్ధ ముగింపుపై తీవ్ర సందిగ్ధత నెలకొంది.

## ఇద్దరి ఆస్తులపై విచారణకు సిద్ధమా..!

యాదాద్రిభువనగిరి(జనంసాక్షి): కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా? 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?" అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆపేశారని విమర్శించారు. యాదాద్రి జిల్లా మోటకొండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. సాధారణ యువతకు లబ్ధి చేకూరలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కాల్వ కూడా తవ్వలేదని ఆక్షేపించారు. " కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూ కబ్జాపై మాట్లాడినందుకే మాపై దాడి చేశారు. మీ ఆస్తులు, మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? ఇక్కడ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎంపీలు దిల్లీలో కొట్లాడాలి. మీ యాత్రలు రేవంత్‌రెడ్డి ఇంటికి చేయండి" అని హరీశ్‌రావు అన్నారు.కాంగ్రెస్ నేతలు ప్రైవేటు ఆస్తులపై దాడులు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?అని ప్రశ్నించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూముల పరిశీలనకు వెళ్లడంపై ఆయన మండిపడ్డారు. దాడులు చేస్తామన్నవారిని బందోబస్తుతో పంపిస్తున్నారని, తాము నిరసన చేస్తామంటే ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని ఆక్షేపించారు. ఫాంహౌస్‌ల చుట్టూ తిరుగుతున్న వారిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదని ప్రశ్నించారు.

## అసైన్డ్ భూములను కేసీఆర్ ఎందుకు పంచలేదు?

2009లో లేని ఆస్తులు ఇప్పుడెలా వచ్చాయి?హరీశ్‌రావుకు ఉద్యమ సమయంలో లేని ఫామ్‌హౌస్ ఇప్పుడు ఎలా వచ్చింది?కేసీఆర్ ఫామ్‌హౌస్ పక్కన ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూములను దళితులకు ఎందుకు పంచలేదు?ఆ భూమిని కబ్జా చేయాలని కేసీఆర్ చూశారు" అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.



## గ్రామీణ ఉపాధి కల్పనలో కోదాడ మెగా జాబ్ మేళా మైలురాయి

- 350 కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన మంత్రి ఉత్తమ్
- 30 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు.. 5,725 మంది అభ్యర్థుల షార్ట్‌లిస్ట్
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి.గ్రామీణ కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నప్పటికీ, వారికి సరైన సమయంలో ఉద్యోగ సమాచారం అందడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, సంస్థలను సంప్రదించడం, ఇంటర్వ్యూల కోసం పదేపదే నగరాలకు వెళ్లడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక యువకుడి గ్రామ చిరునామా లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితి అతని ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.అర్హులైన ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు, తొలి అవకాశం కోసం నిరీక్షిస్తున్న గ్రామీణ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వారి మధ్య ఉన్న అంతరాన్ని ఈ మేళా తగ్గించిందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలను నేరుగా సంస్థల ప్రతినిధుల ముందు ప్రదర్శించడంతోపాటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు.గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళా అనుభవానికి కొనసాగింపుగా కోదాడలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేపట్టారు. పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఐదు జిల్లాల అధికార యంత్రాంగంతో ముందస్తుగా సమన్వయం చేసుకుని యువతను పెద్ద ఎత్తున సమీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ కార్యక్రమానికి సహకారం అందించాయి.జాబ్ మేళాలో పాల్గొన్న యువతను ఉద్దేశించి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఒకే వేదికపైకి సుమారు 350 కంపెనీలను తీసుకురావడం అసాధారణమైన ప్రయత్నమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి భారీ ఉద్యోగ మేళాలను నిర్వహించి యువత నివసిస్తున్న ప్రాంతాలకు చేరువలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఐటీ?పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు?భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులతో వారు మాట్లాడి, ఉద్యోగ అవకాశాలు పొందిన అభ్యర్థులను అభినందించారు.ఐదు జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాలకు చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంతోపాటు పరిశ్రమలు?ఉద్యోగార్థుల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి కోదాడ మెగా జాబ్ మేళా బలమైన వేదికగా నిలిచింది. అర్హత, ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశం కోసం ఎదురుచూస్తున్న యువతకు కొత్త ఆశలు కల్పిస్తూ గ్రామీణ ఉపాధి కల్పనలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# 'ఓఆర్ఆర్‌పై' మృత్యుఘోష



**హైదరాబాద్(జనంసాక్షి):** అజాగ్రత్త, అతి వేగం, నిర్లక్ష్యం ఔటర్ రింగ్ రోడ్డుపై వరస ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అజాగ్రత్త, అతివేగం కారణంగా ఈ ఏడాది 9 నెలల వ్యవధిలోనే ఓఆర్ఆర్‌పై 28 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఓఆర్ఆర్‌పై భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఓఆర్ఆర్ 35 కిలోమీటర్లు విస్తరించి ఉంది. వీటిలో ముఖ్యంగా 9, 7, 6 ఎగ్జిట్ల పరిధిలో ఓఆర్ఆర్‌పైకి వచ్చే వాహనాలు ఎప్పటికప్పుడు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డెక్కితే తిరిగొస్తామో లేదో అనే భయం వాహనదారుల్లో నెలకొంది.

**వేగానికి తోడు నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు**

ఈ సంవత్సరం ప్రారంభమయినప్పటి నుంచి నేటి వరకు 9 నెలల వ్యవధిలో ఓఆర్?ఆర్?పై 28 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల సంఘటనలను పరిశీలిస్తే మరమ్మతులకు గురైన వాహనాలు రహదారి పక్కన నిలపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వెనక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు నిలిచి ఉన్న వాహనాలను ఢీ కొనడంతోనే అనేక మంది మరణిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకో వైపు డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో నిద్రమత్తులోకి జారుకోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఓఆర్ఆర్‌పై వేగాన్ని 120 కి.మీలకు పెంచడంతో అంతే వేగంగా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా వాహనాలను రహదారి పక్కన నిలిపే విషయంలో భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**వాహనాలను వేగంగా నడపటంతో ప్రమాదాలు**

ఓఆర్ఆర్‌పై కొన్నిసార్లు వేగంగా నడుపుతున్న లారీలను అకస్మాత్తుగా నిలపడం వల్ల కూడా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు గచ్చిబౌలి నుంచి శంషాబాద్? విమానాశ్రయానికి ఓఆర్?ఆర్?లో వెళ్తున్న కొందరు, వేగంగా కార్లను, వాహనాలను నడపడంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్నిచోట్ల సర్వీస్? రోడ్డు నుంచి ఔటర్? రింగ్? రోడ్డులోకి వచ్చేటప్పుడు వాహదారులు సిగ్నల్? వ్యవస్థను ఉపయోగించకుండా దూసుకురావడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ ప్రాంతంలో చెట్ల నరికివేత సమయంలో సంబంధిత హెచ్చరిక వ్యవస్థలను కూడా వినియోగించడం లేనట్లు వాహనదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైవే సిబ్బంది రోడ్డు పక్కన వాహనాలను నిలిపి ఉంచడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

**ఎక్కువ ప్రమాదాలు అక్కడే**

ఈ సంవత్సరం మార్చి నెలలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఓఆర్ఆర్ ఎగ్జిట్-7 దగ్గర కొందరు రోడ్డు పక్కన తమ వాహనాలను నిలిపి భోజనం చేస్తున్నారు. అయితే వెనక నుంచి వచ్చిన కంటైనర్ లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ మార్గంలోని ట్రామా కేర్ సెంటర్ల పరిధిలోనే నిత్యం ప్రమాదాలు జరుగుతాయని అక్కడి సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదకర మలుపులు ఉండటంతో

శంషాబాద్ కాల్ సెంటర్‌కు సమాచారం అందిన పది నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకొని సేవలందిస్తామని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఒక్కో షిఫ్టులో ఇద్దరు ఎమర్జెన్సీ పారామెడికల్ సిబ్బంది, ఒక హెల్పర్, డ్రైవర్ పని చేస్తున్నారు. ఈ రహదారిపై ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో భారీ వాహనాలు, ట్రక్కులు బోల్తా పడుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. మేడ్చల్ ఎగ్జిట్ గేట్ వద్ద ఈ పరిస్థితిని గమనించిన అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ఇక్కడి ప్రమాదాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. మిగతా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని వాహనదారులు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఫ్లాట్ల లబ్ధిదారులకు శుభవార్త

భాగంలో సుమారు రూ.750 కోట్లకు పైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మిస్తారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో, మార్కెట్లో దాదాపు రూ.50 లక్షల విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను... కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందిస్తోంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్.. ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని ఇస్తోంది. కాగా, రేపు మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

**రూ.50 లక్షల విలువచేసే ఫ్లాట్ రూ.5 లక్షలకే**

మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకుపైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మించనున్నారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో మార్కెట్లో దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందించనుంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్, ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని అందిస్తోంది. కాగా రేపు మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

**డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న 26 ప్రాంతాల్లో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు.

**డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు**


హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న 26 ప్రాంతాల్లో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు.

**వారికే ఇళ్లు కేటాయించాలి**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 30వ తేదీలోపు అత్యవసర ప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా చేపట్టాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. డబుల్? బెడ్?రూం ఇళ్ల సముదాయాలకు 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న వారిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జలమండలి, గ్రామీణ నీటి సరఫరా విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ చివరి నాటికి మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి కావాలని ఆదేశించారు.

## తెలంగాణ బహుజనుల బాణాన్ని

- కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా..
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**కొడంగల్(జనంసాక్షి):** "కాంగ్రెస్ విడిచిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు.. కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు.. భాజపా బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న తెలంగాణ బహుజనుల బాణాన్ని నేను. తెలంగాణ యువజనుల యుద్ధ నినాదాన్ని.. అంబేడ్కర్ వాదాన్ని.. మహాత్మ జ్యోతిబా పూలే ఆత్మగౌరవ నినాదాన్ని నేను. మీరు ధైర్యమిస్తే.. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడుతుందని నిరూపించడానికే ఇక్కడికి వచ్చా" అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత మాట్లాడారు. "దేశంలో పరిస్థితి ఎలా ఉందంటే.. మహిళలు మహారాణులు అంటారు. కానీ, వంటింట్లో గిన్నెల మీద మగవాళ్ల పేర్లే ఉంటాయి. 29 రాష్ట్రాలున్న ఈ దేశంలో ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉంది. చరిత్ర తిరగరాద్దామా? తెలంగాణలో మాతృస్వామ్య వ్యవస్థ తెచ్చుకుందామా? ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్థాన్‌తో సమానంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. ప్రజలకు ఏం సమాధానం చెబుతారు" అని కవిత ప్రశ్నించారు. అంతకు ముందు కార్యకర్తలతో భారీ ర్యాలీగా కొడంగల్ సభా స్థలికి చేరుకున్నారు.

# సన్నగిల్లుతున్న ఆశలు

**ఖాట్మండు(జనంసాక్షి):** ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో పరిస్థితులు ఇంకా పూర్తిగా చక్కబడలేదు. వరదలు సంభవించి నాలుగు వారాలు దాటినా సుమారు 6 వేల మంది ఆచూకీ ఇంకా తెలియలేదు. దీంతో గల్లంతైన వారి కోసం నేపాల్‌లో ఆదివారం కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. నదీ తీర ప్రాంతాలు, శిథిలాల క్షేత్రాలు, దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద సహాయక బృందాలు గాలిస్తున్నాయి. ఆగస్టు 26న నేపాల్-టిబెట్ సరిహద్దు సమీపంలో ప్రారంభమైన ఆకస్మిక వరదలు ఉత్తర, మధ్య నేపాల్‌లోని పట్టణాలు, గ్రామాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. హిమాలయ ప్రాంతం నుంచి దక్షిణంగా ప్రవహించే భోటేకోశి నది వరద నీటితో ఉప్పొంగడంతో ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా దెబ్బతిన్నాయి.

**సొరంగం నుంచి 17 మృతదేహాలు**

వరదలతో దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద నేపాల్ ఆర్మీ సహాయక చర్యలను కొనసాగిస్తోంది. రసువాలోని అప్పర్ త్రిశూలి-1 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఓ సొరంగంలో సహాయక సిబ్బంది 17 మృతదేహాలను వెలికితీశారు. రీన్‌ఫోర్స్‌మెంట్ మెష్‌లో చిక్కుకుని, బురదలో కూరుకుపోయిన మృతదేహాలను గుర్తించారు. మృతదేహాలను బయటకు తీసేందుకు సహాయక సిబ్బంది గ్రైండర్లు, గ్యాస్ కట్టర్లు, రోటరీ పరికరాలను ఉపయోగించినట్లు నేపాల్ సైన్యం తెలిపింది. సొరంగాల్లో భారీగా పేరుకుపోయిన శిథిలాలు సహాయక చర్యలకు అడ్డంకిగా మారాయి. ప్రభావితమైన కొన్ని సొరంగాల నుంచి శిథిలాలను పూర్తిగా తొలగించడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పట్టవచ్చని ఈ నెల ప్రారంభంలో నేపాల్ ఆర్మీకి చెందిన ఓ ఫీల్డ్ కమాండర్ తెలిపారు.

**రోడ్లు, వంతెనలు ధ్వంసం**

వరదల ప్రభావంతో పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లోని కమ్యూనిటీలను కలిపే వంతెనలు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నేపాల్ ప్రభుత్వం త్రిశూలి కారిడార్ వెంబడి ఉన్న సస్పెన్షన్ వంతెనల మరమ్మతులను ప్రారంభించింది. మొత్తం 12 సస్పెన్షన్ వంతెనలపై ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వీటిని అక్టోబర్ 6 నాటికి తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.మరో 33 వంతెనలు మరమ్మతు చేయలేనంతగా దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిగా పునర్నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వంతెనల పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. వంతెనలు దెబ్బతినడంతో మార్కెట్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర నిత్యావసర సేవలకు రాకపోకలు కష్టంగా మారాయి. కొన్ని ప్రాంతాల ప్రజలు నదిని దాటేందుకు సుదీర్ఘ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. మరికొందరు తాత్కాలిక ఏర్పాట్లపై ఆధారపడుతున్నారు.

**మృతదేహాల గుర్తింపు సవాల్**

ఈ విపత్తులో మృతిచెందిన వారిని గుర్తించడం అధికారులకు మరో పెద్ద సవాల్‌గా మారింది. మెరుపు వరదల్లో 1,450 మందికిపైగా మృతిచెందినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు కేవలం 110 మృతదేహాలను మాత్రమే గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడం, ఎక్కువ కాలం నీటిలో ఉండటంతో కుళ్లిపోవడం, కొన్ని సందర్భాల్లో శరీర భాగాలు మాత్రమే లభించడం వంటి కారణాలతో గుర్తింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. ముఖం, దుస్తులు లేదా వ్యక్తిగత వస్తువుల ఆధారంగా మృతులను గుర్తించడం అనేక సందర్భాల్లో సాధ్యం కావడం లేదు. చాలాసేపు నీటిలో మునిగి ఉండటం, బురద, శిథిలాలకు గురికావడం వల్ల గుర్తించే శారీరక లక్షణాలు నశించిపోతున్నాయి. కొన్ని అవశేషాలు ముక్కలైపోవడం లేదా ఇతర అవశేషాలతో కలిసిపోవడం కూడా గుర్తింపు ప్రక్రియను మరింత కష్టతరం చేస్తోంది.

**డీఎన్ఏ పరీక్షలపై ఆధారం**

ఈ పరిస్థితుల్లో మృతులను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి. అయితే ఇది సమయం తీసుకునే ప్రక్రియ. మృతదేహాల అవశేషాలతో పాటు, వాటిని సరిపోల్చేందుకు జీవించి ఉన్న కుటుంబ సభ్యుల నుంచి కూడా నమూనాలు అవసరమవుతాయి. ఇప్పటివరకు దాదాపు 1,300 మృతదేహాల డీఎన్ఏ నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. నమూనాలు సేకరించిన అనంతరం మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేశారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించి వారి కుటుంబాలకు సమాచారం అందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నేపాల్‌తో పాటు చైనా వైపున కూడా ఈ ఆకస్మిక వరదల ప్రభావం కనిపించింది. చైనా మీడియా ప్రకారం, అక్కడ 43 మంది మృతిచెందగా, 500 మందికిపైగా ఆచూకీ తెలియకుండా పోయింది. నేపాల్‌లో మాత్రం రసువా, పొరుగు జిల్లాల్లోని నదీ తీర ప్రాంతాలు, శిథిలాల క్షేత్రాలు, దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.




# లిఫ్ట్‌కు, గోడకు మధ్య వేలాడుతూ..

- లిఫ్ట్‌లో ఇరుక్కున్న వ్యక్తిని కాపాడిన హైడ్రా


**హైదరాబాద్, సెప్టెంబరు 20 (జనంసాక్షి) :** లిఫ్టుకు – గోడకు మధ్య ఇరుక్కుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని హైడ్రా ఆదివారం కాపాడింది. మూసాపేట, ఆంజనేయనగర్‌లోని 3 అంతస్తుల భవనంలో గ్రిల్స్‌తో కూడిన పాత లిఫ్ట్ ఈ దుర్ఘటనకు కారణమైంది. సెన్సార్లు సరిగా పని చేయకపోవడంతో రెండో అంతస్తులో దిగాల్సిన వ్యక్తి.. బయటకు వచ్చేలోపే లిఫ్ట్ పైకి వెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించింది. హైడ్రా కంట్రోల్ రూమ్‌కు ఉదయం 9.15 గంటలకు ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందింది . వెనువెంటనే ఉదయం 9.30 గంటలకే హైడ్రా మార్షల్ జేడీవీ ప్రసాద్ నేతృత్వంలోని బృందం అక్కడకు చేరుకుంది. మూడవ అంతస్తుకు – రెండో అంతస్తుకు మధ్య గ్రిల్స్‌లో కాలు ఇరుక్కొని వేళాడుతున్న మురళి(40)ని దాదాపు గంటన్నర పాటు కష్టపడి బయటకు తీశారు. లిఫ్ట్ గోడను బద్దలు కొట్టి తీయాల్సి వచ్చిందని జేడీవీ ప్రసాద్ తెలిపారు. సనత్‌నగర్ ఫైర్ సిబ్బందికి కూడా సమాచారం అందజేయడంతో వారి వద్ద ఉన్న హైడ్రాలిక్ కట్టర్ ద్వారా ఈ ఆపరేషన్‌ను పూర్తి చేశామని తెలిపారు. సతీమణితో కలిసి మురళి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు లిఫ్ట్ ఎక్కాడు. రెండో అంతస్తు చేరగానే మురళి బయటకు వెళ్లడానికి ప్రయత్నించాడు. ఇంతలోనే 3వ అంతస్తులో లిఫ్ట్ బటన్ వేరే వాళ్లు ప్రెస్ చేయగా క్షణాల్లో పైకి వెళ్లిపోయింది. మురళి కాలు ఒకటి లిఫ్ట్‌లో – మరొకటి రెండో అంతస్తులో ఉండగా లిఫ్ట్ పైకి వెళ్లింది. లిఫ్ట్ గ్రిల్స్‌లో కాలు ఇరుక్కుంది. అప్పటికే లిఫ్ట్‌లో ఉన్న ఆయన సతీమణి కేకలు వేయగా అపార్టుమెంటులో నివసిస్తున్న వారు కాపాడేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్‌కు ఫోను చేసి విషయాన్ని చెప్పారు. ఆ దగ్గర్లోని కూకట్‌పల్లిలో ఉన్న హైడ్రా డీఆర్ ఎఫ్ బృందం అక్కడకు చేరుకుని ఆపరేషన్‌ను ప్రారంభించింది. సరిగ్గా 10.50 గంటలకు బయటకు తీసి దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. మురళి కాలు లిఫ్ట్‌కు – గోడకు మధ్యలో నలిగిపోవడంతో ఫ్యాక్చర్ అయ్యింది. సమాచారం అందగానే వచ్చి లిఫ్ట్‌లో ఇరుక్కుని వేలాడుతున్న మురళిని కింద నుంచి పట్టుకుని సురక్షితంగా బయటకు తీయడం పట్ల స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ సిబ్బందితో పాటు హైడ్రా డీఆర్ ఎఫ్ సభ్యులు మార్షల్ జేడీవీ ప్రసాద్, ఎర్రసాని అనిల్‌కుమార్, జమ్మ రమేష్, వీత రమేష్, పల్లికామిటి గోపి, పోలీసు కానిస్టేబుల్ నరేష్ ఈ ఆపరేషన్లో భాగస్వామ్యులయ్యారు.

# ఖరీజ్ ఖాతా భూముల రిజిస్ట్రేషన్ల కలకలం!

- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి!
- మంత్రికి ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తుల సన్నద్ధం



**తాండూర్, సెప్టెంబర్ 20(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 652 లో గల 20 ఎకరాల ఖరీజ్ ఖాతా (ప్రభుత్వ/నిషేధిత) భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ అవుతుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఖరీజ్ ఖాతాలో ఉన్న భూములకు ఎలాంటి కొనుగోలు, అమ్మకాలు జరపడానికి వీల్లేదు. కానీ, కొందరు స్వార్థపరులు మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా ఈ 20 ఎకరాల భూమిని యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న కార్యదర్శి:ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన తాండూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ (కార్యదర్శి) ఈ వ్యవహారంలో పూర్తిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా, స్థానిక పంచాయ తీ




అధికారులు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఉన్న తాధికారులు స్పందించి ఈ రిజిస్ట్రేషన్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**మంత్రికి పిర్యాదు చేస్తాం : గ్రామస్తుల హెచ్చరిక**

పంచాయతీ అధికారులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో ఈ వ్యవహారంపై ఆధారాలతో సహా సంబంధిత శాఖ మంత్రి కి నేరుగా ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు గుర్తు చేస్తున్నారు.


# రైలులో 26.3 కిలోల గంజాయి పట్టివేత




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** రైలులో అక్రమంగా తరలిస్తున్న 26.3 కిలోల ఎండు గంజాయి నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టుబడింది. రైలు నంబర్ 20811 ఎక్స్‌ప్రెస్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా జనరల్ కోచ్‌లో సీటు కింద కార్టన్ బాక్స్‌లో దాచిన 12 ప్యాకెట్ల గంజాయి లభించింది.దీని విలువ సుమారు రూ. 13.15 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఆర్పీఎఫ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఐపీఎఫ్ ఎస్.కల్పన పర్యవేక్షణలో ఎస్ఐపీఎఫ్ పి.హరిబాబు, హెడ్ కానిస్టేబుళ్లు కలిసి రైలు నంబర్ 20811 ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టారు.రైలు వెనుక భాగంలోని జనరల్ కోచ్‌లో తనిఖీలు చేస్తుండగా ఓ సీటు కింద కార్టన్ బాక్స్ కనిపించింది. దానిని పరిశీలించగా 12 ప్యాకెట్లలో ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. తూకం వేయగా మొత్తం 26.3 కిలోలు ఉన్నట్లు తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది తమ పోస్ట్‌కు తరలించారు.అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల కోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై నిజామాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు ఈసీఆర్ నంబర్ 232/2026 నమోదు చేశారు.ఎండీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి) రెడ్ విత్ 20(బి)(ii)(సి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి ఎక్కడి నుంచి రైలులోకి తీసుకొచ్చారు ఎక్కడికి తరలిస్తున్నారు? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.

# మహబూబ్ నగర్ జిల్లాకు మహర్దశ

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: మంత్రి వాకిటి శ్రీహరి



**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 20(జనం సాక్షి):** మహబూబ్ నగర్ జిల్లాను దేవరకద్ర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యంతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దేవరకద్ర మండలం మీనుగోనిపల్లి గ్రామంలో రూ.134.98 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న హామ్ రోడ్డు అభివృద్ధి పనులకు, కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో రూ.40 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కురుమూర్తి ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య, విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రూ.48 కోట్లతో మూడు కౌకుంట్ల, మూసాపేట, మదనాపూర్ మండలాల్లో ఒక్కో మండలానికి రూ.16 కోట్ల చొప్పున మొత్తం రూ.48 కోట్లతో నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. నవంబర్ మొదటి వారంలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. దేవరకద్ర మున్సిపల్ కార్యాలయం నిర్మాణానికి అవసరమైన స్థలానికి సేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రత్యామ్నాయ స్థలం కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు. కురుమూర్తి స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు నిర్మిస్తున్న ఘాట్ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం గెస్ట్‌హౌస్‌లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ఏర్పాటు దేవరకద్ర ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురానుందని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇస్తున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. దేవరకద్రలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, కోర్టు భవనాలు, డిగ్రీ కళాశాల, మదనాపురం వద్ద రూ.6 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు మంత్రి వివరించారు. 25 వేల కోట్లతో పాలమూరు రంగా రెడ్డి ప్రాజెక్ట్ 90 శాతం పనులు పూర్తి చేసినట్లు గత పాలకులు చెప్పడం అబద్ధం అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవరకద్ర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: మంత్రి వాకిటి శ్రీహరి**

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గిందని, జూరాల నుంచి వచ్చే నీరు రామన్‌పాడు, కోయిల్‌సాగర్, మక్తల్, పాలమూరు, కొల్లాపూర్ ప్రాంతాలకు కీలకమని అన్నారు. రానున్న నెలల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక పంటకు ఇబ్బంది కలగడం బాధాకరమే అయినప్పటికీ, తాగునీటి కోసం ఉన్న నీటిని కాపాడుకోకపోతే రానున్న ఎనిమిది, తొమ్మిది నెలల్లో మనుషులతో పాటు పశువులు, పక్షులు, ఇతర జంతువులకు కూడా నీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. నీటి సమస్యపై రాజకీయాలకు తావివ్వకుండా అందరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు. రైతులు బాగుంటేనే సమాజం బాగుంటుందని, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, దేవరకద్రలో రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, కోర్టు భవనాలు, మండల సమీకృత కార్యాలయ సముదాయాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేదలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు.

దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాలు అన్నదమ్ముల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

**అభివృద్ధి పనులకు మరింత ప్రాధాన్యం: ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి.**

దేవరకద్ర నియోజకవర్గంలో గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. కురుమూర్తి ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు సుమారు రూ.110 కోట్లతో కొనసాగుతున్నట్లు తెలిపారు. మదనాపురం హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.6 కోట్లతో పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పనులతో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పి డి. జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి, ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# కారు డోర్ లాకై.. ఊపిరాడక

- నాలుగేళ్ల చిన్నారి మృతి






**జూలూరుపాడు (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోబా నగర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వినోబానగర్ గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్, ఐశ్వర్య దంపతుల పెద్ద కుమార్తె తన్వితశ్రీ (4) ఆదివారం ఆడుకుం టూ ఇంటి వద్ద నిలిచిన కారులో ఎక్కింది. ప్రమాదవశాత్తు కారు డోర్ లాక్ కావడంతో ఊపిరాడక చనిపోయింది. ఆ సమయంలో తండ్రి నవీన్ వైరా ఎమ్మెల్యేను కలిసేందుకు సర్పంచులతో కలిసి ఉదయం కొత్తగూడెం వెళ్లారు. తల్లి ఐశ్వర్య ఇంటి పనుల్లో నిమగ్నమయ్యారు. చిన్నారి కనిపించక పోవడంతో తల్లి ఐశ్వర్య ఆందోళనకు గురయై కుటుంబ సభ్యులతో కలిసి ఇల్లు, పరిసర ప్రాంతాలతో పాటు గ్రామంలో వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో కారులో తన్వితశ్రీ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారిని తొలుత జూలూరుపాడులోని ఓ గ్రామీణ వైద్యుడి వద్దకు అక్కడి నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. పాపను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు లేళ్ల వెంకటరెడ్డితో పాటు పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నవీన్ దంపతులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# ఐదు భారీ వాహనాలు ఢీ

- తప్పిన పెను ప్రమాదం

**భద్రాచలం, సెప్టెంబరు 20 (జనంసాక్షి) :** ఆంధ్ర--తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన భద్రాచలం కూనవరం రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇసుక క్వారీ సమీపంలోని హైవేపై ఒకేసారి ఐదు భారీ వాహనాలు ఢీకొనడంతో వాహనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రమాద తీవ్రతకు కొన్ని వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారుజామున హైవేపై వరుసగా భారీ వాహనాలు ఢీకొనడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో ఒకేసారి ఐదు భారీ వాహనాలు ఢీకొన్న ఘటన ఇదే తొలిసారి అని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.


# ఇందిరమ్మ బిల్లులు రాక అప్పల పాలు

- అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం ధక్కడం లేదు
- తెచ్చిన డబ్బులకు అప్పులు పెరుగుతున్నాయి
- ఇల్లు రాకుంటే అప్పు చేసే వాళ్ళం కాదు

**కౌటాల సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణం పూర్తి చేసిన వారికీ 5లక్షలు ఇస్తామని చెప్పి 3లక్షలు కూడా అందక అప్పుల పాలు అవుతు న్నామని మొర పెట్టుకుంటున్నారు. ఇందిరమ్మ మంజూ రుతోపాటు బిల్లుల మంజూరులో ఏండ్లు గడిచిన ఇప్పటి వరకు మొదటి బిల్లు రాకపోగా లబ్దిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు అధికారులు లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీలను కూడా అందించారు. కొత్త ఇళ్లు వచ్చిందనే సంతోషంలో కొత్త ఇళ్లు కట్టుకునేందుకు అప్పు సప్పు చేసి బేస్మెంట్ లెవల్ వరకు కట్టుకున్నారు. కట్టుకుని ఏడాది గడిచిపోయిన ఇప్పటి వరకు లబ్దిదారులకు ఒక్క బిల్లు కూడా రాకపోగా మండల కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయం చుట్టు తిరుగుతూనే ఉన్నారు.



**ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న**



నాకు పోయిన ఏడాది 8 సెప్టెంబర్ 2025లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు అధికారులు ప్రొసిడింగ్ కాపీ ఇచ్చారు. దానితోని మేము అప్పు చేసి ఇళ్లు కట్టుకునేందుకు పనులు మొదలు పెట్టి బేస్మెంట్ వరకు కట్టుకున్నాం. పోయిన ఏడాదిలోనే మేము బేస్మెంట్ పూర్తి చేసినం. ఈ బేస్మెంట్ వరకు కట్టుకోడానికి మాకు లక్షా 10వేల వరకు ఖర్చు అయింది. ఇందిరమ్మ ఇంటి డబ్బులు బేస్మెంట్ అయిన వెంటనే వస్తాయని చెప్పారు. కానీ ఇప్పటి వరకు బిల్లు లేకపోగా ఆఫీసుల చుట్ట తిరుగుడు అవుతుంది. మండల ఆఫీస్ల చుట్టు, కలెక్టర్ ఆఫీస్ల చుట్టు చాల సార్లు తిరిగిన. ఈ ఇల్లు రాకుంటే మేము అప్పు చేసే వాళ్లం కాదు. ఆ ఇళ్లు రాకున్న మంచిదే కట్టిన వరకైన డబ్బులు వస్తే చాలు.

**నేర్పెల్లి పుష్పలత, లబ్దిదారురాలు, సాండ్గాం.**

**ఉన్న కొంత పొలం తాకట్టు పెట్టిన**



నాకు పోయిన సంవత్సరం 3 జూన్ 2025 నాడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యింది. ఇళ్లు మంజూరు అయ్యిందని అధికారులు నాకు ప్రొసిడింగ్ కాపీ కూడ ఇచ్చారు. అయితే బేస్మెంట్ కట్టుకుంటే వెంటనే వారంలో మొదటి బిల్లు ఇస్తామన్నారు. నాకున్న 1.20 ఎకరాల భూమిని 3 ఏండ్లు కౌలుకు పెట్టిన, ఇంక డబ్బులు సరిపోకపోతే నాకున బంగారం బ్యాంకులో కుదవ పెట్టి డబ్బులు తెచ్చి బేస్మెంట్ వరకు పూర్తి చేసిన. సర్కార్ నుండి డబ్బులు రాక అప్పు తెచ్చిన కాడ వడ్డీలు కట్టలేక చెప్పలేని బాదలు పడుతున్న. కలెక్టర్ దగ్గరకు, ఎంపిడిఓ ఆఫీస్ దగ్గరకు తిరిగి తిరిగి విసుగు వచ్చింది కానీ బిల్లు మాత్రం రాలేదు. మాది రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబం. ఏదో ఇళ్లు వచ్చింది కనీసం ఉండడానికి అయిన అయితది అనుకుంటే లేని అప్పులు మీద పడ్డాయి. దయచేసి బేస్మెంట్ వరకు బిల్లు ఇచ్చి ఆదుకోవాలి.

**ఎడ్ల పంచపూల, పార్డి గ్రామం**

# పిడుగుపాటుకు యువకుడు మృతి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మం డలం దేవీతండా పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. పొలం లో నీళ్లు కట్టేందుకు వెళ్లిన బధావత్ చరణ్ (18) అనే యువకుడిపై పిడుగు పడింది.దీంతో తీవ్రంగా గాయపడిన చరణ్‌ను స్థానికులు,కుటుంబ సభ్యులు హుటాహుటిన నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు సర్పంచ్ గణేశ్ నాయక్ తెలిపారు. యువకుడి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి.

## పిడుగుపాటుకు పేలిన రెండు సెల్‌ఫోన్లు

**గాంధారి (జనంసాక్షి) :** మండలంలోని బొప్పాజీవాడి గ్రామానికి చెందిన సూర్య కాంత్, బుర్గుల్ గ్రామానికి చెందిన గైని శంకర్‌లకు చెందిన సెల్‌ఫోన్లు పిడుగు పాటుకు గురై వారి జేబులోనే పేలిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం వీరిద్దరూ కలిసి వర్షం కురుస్తున్న సమయంలో ఒక గొడుగు కింద ఉన్నారు. ఈ క్రమంలో వారికి సమీపంలో పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో వారి జేబులో ఉన్న సెల్‌ఫోన్లు ఒక్కసారిగా పేలిపోవడంతో వారిద్దరూ గాయాలపా లయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

సంపాదకీయం

## విద్యా రంగంలో భారత్ స్థానం..
# ప్రపంచంలో వెనుకబాటుకు కారణమెవరు?

*ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం, యువత అత్యధికంగా ఉన్న దేశం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా ఎదుగుతున్న దేశం- కానీ ప్రపంచస్థాయి విద్యా సంస్థల విషయానికి వస్తే భారత్ స్థానం మాత్రం ఇంకా ఆశించిన స్థాయిలో లేదు. ఇది కేవలం ర్యాంకుల సమస్య కాదు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్న.*

ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి నూట ఇరవై ఎనిమిది సంస్థలు చోటు సంపాదించినప్పటికీ, దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న మన ప్రతిష్టాత్మక విజ్ఞాన సంస్థ కూడా రెండు వందల నుంచి రెండు వందల యాభై స్థానాల మధ్యనే ఉంది. అదే ర్యాంకింగ్స్‌లో చైనాకు చెందిన విశ్వవిద్యాలయం పన్నెండో స్థానంలో ఉంది. జపాన్‌కు చెందిన విశ్వవిద్యాలయం ఇరవై ఆరో స్థానంలో, సింగపూర్‌కు చెందిన జాతీయ విశ్వవిద్యాలయం మూడో స్థానంలో నిలిచాయి. ఆసియా ర్యాంకింగ్స్‌లో కూడా భారత్‌లో అగ్రస్థానంలో ఉన్న మన విజ్ఞాన సంస్థ 43 స్థానంలో ఉండగా, చైనా విశ్వవిద్యాలయం మొదటి స్థానంలో, సింగపూర్ విశ్వవిద్యాలయం మూడో స్థానంలో ఉన్నాయి.

మరో ప్రధాన ర్యాంకింగ్స్‌లో కూడా పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ఒక జాబితాలో మన సాంకేతిక విజ్ఞాన సంస్థ నూట ఇరవై మూడో స్థానంలో ఉండగా, తరువాతి జాబితాలో నూట పద్దెనిమిదో స్థానానికి చేరింది. మరో సాంకేతిక సంస్థ నూట ముప్పై నాలుగో స్థానంలో ఉంది. అంటే భారత సంస్థలు ముందుకు కదులుతున్నా, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యా సంస్థలతో సమాన స్థాయికి చేరేందుకు ఇంకా గణనీయమైన దూరం ఉంది.

ఇంతటి జనాభా, అపారమైన యువశక్తి ఉన్న దేశంలో ఈ పరిస్థితి ఎందుకు? సమాధానం విద్యకు ఇచ్చే ప్రాధాన్యంలోనే వెతకాలి. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు ఒక్కరోజులో తయారుకావు. వాటి వెనుక దశాబ్దాల పరిశోధన పెట్టుబడులు, అత్యాధునిక ప్రయోగశాలలు, నాణ్యమైన అధ్యాపకులు, అంతర్జాతీయ సహకారం, స్వేచ్ఛాయుత పరిశోధనా వాతావరణం, నిరంతర ఆర్థిక మద్దతు ఉంటాయి.

భారత్‌లో మాత్రం విద్యకు అవసరమైన స్థాయిలో ప్రజా పెట్టుబడి ఇంకా లేదు. అధికారిక ఆర్థిక సర్వే ప్రకారం కేంద్రం, రాష్ట్రాల కలిపిన విద్యా వ్యయం రెండు వేల ఇరవై మూడు, ఇరవై నాలుగు సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తిలో రెండున్నర శాతం మాత్రమే ఉంది. అంతకుముందు సంవత్సరంలో అది రెండున్నర తొమ్మిది శాతం. విద్యపై వ్యయం ఇంత తక్కువ స్థాయిలో ఉండగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, అత్యాధునిక పరిశోధన కేంద్రాలు, నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలను ఎలా నిర్మిస్తాం?

ఇది కేవలం గణాంకం కాదు, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అద్దం. విద్యను దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాల్సిన సమయంలో దాన్ని ఖర్చుగా చూసే ధోరణి ప్రమాదకరం. ఒకవైపు ప్రపంచస్థాయి ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యాలు ప్రకటిస్తూ, మరోవైపు ప్రపంచస్థాయి మానవ వనరులను తయారు చేసే విద్యా వ్యవస్థకు సరిపడా నిధులు కేటాయించకపోవడం తీవ్రమైన వైరుధ్యం.


ప్రస్తుత పాలనలో విద్యా రంగానికి నిధుల విషయంలో మరింత స్పష్టమైన లక్ష్యం అవసరం. కేవలం పథకాలకు నిధులు ప్రకటించడం సరిపోదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ కావాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడాలి. ఉన్నత విద్యలో పరిశోధనకు భారీగా నిధులు పెరగాలి. విశ్వవిద్యాలయాలకు స్వతంత్ర పరిశోధనా వాతావరణం కల్పించాలి. అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు, పరిశోధకులను ఆకర్షించే విధానాలు రావాలి. లేకపోతే భారత యువత ప్రతిభ విదేశాలకు వెళ్లడం కొనసాగుతూనే ఉంటుంది.

మరోవైపు భారతదేశంలోని ప్రతిభకు మాత్రం కొదవ లేదు. మన ప్రతిష్టాత్మక సాంకేతిక, నిర్వహణ, విజ్ఞాన సంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రపంచంలోని ప్రముఖ సాంకేతిక, పరిశోధనా సంస్థల్లో రాణిస్తున్నారు. భారతీయులు ప్రపంచంలోని అతిపెద్ద సంస్థలకు నాయకత్వం వహిస్తున్న ఉదాహరణలు ఉన్నాయి. సమస్య ప్రతిభలో లేదు. ఆ ప్రతిభను దేశంలోనే నిలబెట్టి ప్రపంచస్థాయి పరిశోధనగా, ఆవిష్కరణగా మార్చే వ్యవస్థలో ఉంది.

అందుకే విద్యను రాజకీయ ప్రసంగాల అంశంగా కాకుండా జాతీయ ప్రాధాన్యతగా చూడాలి. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుకోవడం మాత్రమే సరిపోదు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో మన విశ్వవిద్యాలయాలు ఎక్కడున్నాయో కూడా ప్రశ్నించుకోవాలి. మన పిల్లలు ప్రపంచస్థాయి విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఎందుకు వస్తోంది? మన విశ్వవిద్యాలయాలే ప్రపంచ విద్యార్థులను ఆకర్షించే స్థాయికి ఎప్పుడు చేరతాయి? పరిశోధన కోసం భారతీయ శాస్త్రవేత్తలు విదేశీ నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎప్పుడు మారుతుంది?

దేశ భవిష్యత్తును నిర్ణయించేది కేవలం రహదారులు, భవనాలు, పరిశ్రమలు కాదు. వాటిని నిర్మించే మానవ మేధస్సు. ఆ మేధస్సును తీర్చిదిద్దేది విద్య. అందుకే విద్యపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు కాదు, భారత భవిష్యత్తుపై పెట్టుబడి.

# 12 ఏళ్ళ బీజేపీ పాలనలో ప్రశ్నలు అనేకం-మోదీ మౌనం




2014 నుంచి బీజేపీ ప్రభుత్వం తరపున భారత ప్రజలకు అభివృద్ధి, దేశభక్తి, త్యాగం, క్రమశిక్షణ పేరుతో ఎన్నో పిలుపులు వచ్చాయి. పెద్ద నోట్ల రద్దు నుంచి కొవిడ్ దీపాల వరకు, వ్యవసాయ చట్టాల నుంచి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వరకు ప్రజలు ప్రభుత్వ నిర్ణయాల భారాన్ని మోశారు. కానీ ప్రజాస్వామ్యంలో అసలు ప్రశ్న "ప్రజలు ప్రభుత్వం చెప్పింది చేశారా?" అనేది కాదు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏమి నెరవేర్చింది? ఎవరి జీవితాలు మెరుగుపడ్డాయి? ఎవరి మీద భారాలు పెరిగాయి? లాభాలు ఎవరికి వచ్చాయి, నష్టాలు ఎవరు భరించారు?" అనేదే ప్రధాన ప్రశ్నలు. ఈ ప్రశ్నలను శ్రమజీవి, రైతు, చిన్న వ్యాపారి, ఉద్యోగార్థి, మధ్యతరగతి కుటుంబం అనే ప్రజా దృక్కోణంలో చూస్తే 2014 తర్వాతి పాలనపై మరింత కఠినమైన లెక్కలు అడగాల్సి వస్తుంది.

మొదట నోట్ల రద్దు. 2016 నవంబర్ 8న రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాద నిధులపై దెబ్బగా ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించింది. కానీ రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారం రద్దయిన నోట్లలో రూ.15.31 లక్షల కోట్ల విలువైన నోట్లు తిరిగి వచ్చాయి. అంటే రద్దయిన కరెన్సీలో దాదాపు 99.3 శాతం బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చింది. అదే సమయంలో రిజర్వ్ బ్యాంక్ 2017-18లో నోట్ల ముద్రణ, భద్రతా ముద్రణ తదితర ప్రక్రియలపై భారీ వనరులు వినియోగించాల్సి వచ్చిందని తెలిపింది.నోట్ల రద్దు వల్ల పన్ను అనుసరణ, డిజిటల్ చెల్లింపులు వంటి కొన్ని మార్పులు వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, "నల్లధనం నిర్మూలన" అనేది అసలు సమస్యగా చెప్పిన బీజేపీ అది ఆచరణలో జరగలేదు. నోట్ల రద్దు అనేది కేవలం ప్రచార ఆర్భాటంగా మిగిలింది,ఫలితంగా సామాన్య ప్రజలు నానా అగచాట్లు పడ్డారు తప్ప నోట్లరద్దు వల్ల ఏం మేలు జరిగిందో ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రజలకు స్పష్టమైన జవాబు చెప్పలేదు.బడా బాబులు డబ్బుకోసం బ్యాంకుల ముందు ఎవరూ క్యూలో నిలబడలేదు.కొత్త నోట్ల ప్రింటింగ్ ఖర్చు కేంద్ర ప్రభుత్వానికి అదనపు భారం అయింది. ఈ కొత్త నోట్లు ప్రింటింగ్ ప్రెస్ నుంచి ధనికుల ఇళ్ళకు నేరుగా లారీల కొద్దీ నోట్ల కట్టలు సేఫ్ గా చేరాయి. జీఎస్టీని "గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్"గా పరిచయం చేశారు. కానీ పన్ను సంస్కరణ ప్రయోజనాలను అంచనా వేయాలంటే పెద్ద కార్పొరేట్ సంస్థల దృష్టితో మాత్రమే చూడటం సరిపోదు. చిన్న దుకాణదారు, స్వయం ఉపాధి కార్మికుడు, చిన్న తయారీదారు, సేవా రంగంలోని సూక్ష్మ సంస్థపై అనుసరణ ఖర్చు ఎంత పడింది? వారి వ్యాపారం, ఆదాయం, ఉద్యోగాలపై ప్రభావం ఏమిటి? ఇవే ప్రజా ఆర్థిక దృష్టిలో కీలక ప్రశ్నలు. జీఎస్టీ ద్వారా పన్ను వ్యవస్థలో మార్పులు వచ్చినా, పన్ను సేకరణ పెరగడం మాత్రమే ప్రజల జీవన ప్రమాణం పెరిగిందనడానికి ప్రమాణం కాదు.

ఉద్యోగాల విషయంలో మరింత తీవ్రమైన ప్రశ్న ఉంది. "ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు" అనే ఎన్నికల హామీ రాజకీయ చర్చలో విస్తృతంగా నిలిచింది.బీజేపీ వాగ్దానం మేరకు ఈ 12ఏళ్ళ కాలం 24 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాల్సింది.కానీ ఇదొక బూటకపు ప్రకటనగా దేశ చరిత్రలో నిలిచింది. తాజా ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2025లో 15-29 ఏళ్ల యువత నిరుద్యోగిత రేటు 9.9 శాతం; పట్టణ యువతలో అది 13.6 శాతం. 2025లో 15 ఏళ్లు పైబడిన విద్యావంతుల నిరుద్యోగిత కూడా 6.5 శాతంగా నమోదైంది. మరోవైపు 2025లో స్వయం ఉపాధి వాటా 56.2 శాతంగా ఉంది. అంటే "ఉద్యోగం" అనే పదం వెనుక స్వయం ఉపాధి, అసంఘటిత పని, స్థిర వేతన ఉద్యోగం మధ్య ఉన్న తేడాను గుర్తించాలి. ప్రజలకు కావాల్సింది కేవలం ఉపాధి సంఖ్య కాదు; స్థిరమైన ఉద్యోగం, గౌరవప్రదమైన వేతనం, సామాజిక భద్రత.

రైతుల విషయంలో 2020లో మూడు వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి, ఏడాది పాటు జరిగిన తీవ్ర ఉద్యమం తరువాత 2021లో వాటిని రద్దు చేయాల్సి వచ్చింది. రైతు ఉద్యమ సమయంలో మరణించిన వారి సంఖ్యపై ప్రభుత్వం అధికారిక గణాంకం లేదని పార్లమెంటుకు తెలిపింది; అదే సమయంలో రైతు సంఘాలు 700కు పైగా మరణాలను ప్రస్తావించాయి.ఇప్పటికీ రైతు ఆత్మహత్యల సమస్య మాత్రం ఉద్యమానికి అతీతంగా కొనసాగుతోంది. అధికారిక పార్లమెంటరీ గణాంకాల ప్రకారం 2019లో 5,957 మంది రైతులు/సాగుదారుల ఆత్మహత్యలు నమోదైతే, 2020లో 5,579, 2021లో 5,318 నమోదయ్యాయి. వ్యవసాయ సంస్కరణల చర్చలో రైతు ఆదాయం, కనీస మద్దతు ధర, రుణభారం, మార్కెట్ శక్తి, ఇన్‌పుట్ ఖర్చులు ప్రధాన స్థానంలో ఉండాలి.కానీ రైతు బ్రతుకులు బీజేపీ పాలనలో ఛిద్రం అయ్యాయి.

ఇంధన ధరలు సామాన్యుడి జీవితంపై పడే పరోక్ష పన్నుల్లాంటివి. పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలో లేవు; కేంద్ర సుంకాలు, రాష్ట్రాల వ్యాట్ రెండూ ధరలో భాగం. 2026 సెప్టెంబర్ నాటికి కేంద్రం పెట్రోల్‌పై వివిధ రూపాల్లో లీటరుకు సుంకాలు విధిస్తుండగా, రాష్ట్రాల మధ్య వ్యాట్ రేట్లు గణనీయంగా మారుతున్నాయి. తెలంగాణలో పెట్రోల్‌పై 35.20 శాతం, డీజిల్‌పై 27 శాతం వ్యాట్ ఉందని పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ చూపిస్తోంది. కాబట్టి ధరల బాధ్యతను పూర్తిగా కేంద్రానికో, రాష్ట్రాలపైకో నెట్టేయడం కాకుండా కేంద్రం-రాష్ట్రాల పన్నుల మొత్తం భారాన్ని ప్రజల ముందుంచాలి.బీజేపీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు సాగిలపడటం మూలంగా ,వెనుజులా , రష్యా, ఇరాన్ నుండి కారుచౌకగా మనం ఇంధన వనరులను సమకూర్చుకోలేక పోయాము. మన దౌత్యం ఈ విషయంలో పూర్తిగా విఫలం అయింది. చైనా అమెరికా ఆంక్షలను ఎదిరించింది.తన దేశ ఇంధన వనరులను సజావుగా పొందుతుంది. మోదీ ప్రభుత్వానికి ట్రంప్ ను ఎదిరించే దమ్మూ, ధైర్యం లేకపోయింది.మోదీ మొఖాన ఎన్ని సార్లు ట్రంప్ అవమాన పరుస్తూ,ఈసడింపుగా మాట్లాడాడో లెక్క లేదు. భారత దేశ చరిత్రలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ భారత ప్రధానమంత్రి కి ఇంత అవమానం ఎన్నడూ జరగలేదు. గత భారత దేశ ప్రధాన మంత్రులు ఎవరూ ఇంత అవమానాన్ని భరించలేదు.అయినా అమెరికా అధ్యక్షుడు ప్లాంటుకు ఘాటుగా సమాధానం ఇవ్వకుండా మోదీ మౌనం పాటించారు.

కొవిడ్ సమయంలో చప్పట్లు, పళ్లెం శబ్దాలు, దీపాల కార్యక్రమాలు ఆరోగ్య కార్యకర్తలకు సంఘీభావ సూచికలుగా అశాస్త్రీయ ఆదేశాలు ఇచ్చారు. మోదీకి ప్రచారం, ప్రదర్శనలు ఇవ్వడం ఇష్టం. ప్రజలు కూడా గుడ్డిగా మోదీ మాటలు నమ్మారు. కానీ కోవిడ్ మహమ్మారి రెండో దశలో ఆక్సిజన్, ఆసుపత్రి పడకలు, వైద్య మౌలిక వసతుల కొరత దేశాన్ని తీవ్రంగా కుదిపేసింది.శవాలు వేలసంఖ్యలో గంగా నదిలో తేలాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 5 కోట్ల మందికి పైగా చనిపోయారు. వాస్తవానికి ఈ మరణాలు అనేక రెట్లు అధికంగా ఉన్నాయి అని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ తేల్చింది. ప్రజాస్వామ్య సమాజంలో సంక్షోభ సమయంలో ప్రతీకాత్మక ఐక్యతతో పాటు ప్రాణాలను కాపాడే ప్రజారోగ్య మౌలిక వసతులే ప్రభుత్వ పనితీరుకు అసలు కొలమానం. కానీ నేటికీ ఈ విషయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల సంగతి తెలిసిందే. ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రుల నగ్న దోపిడీ తెలిసిందే. దేశంలో ఫార్మా కంపెనీల డ్రగ్ మాఫియా సంగతి ప్రజల అనుభవంలో ఉన్నదే.

ఎన్నికల బాండ్ల వ్యవహారం ప్రజాస్వామ్యంలో డబ్బు-అధికారం సంబంధాన్ని మరింత స్పష్టంగా ముందుకు తెచ్చింది. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తూ, రాజకీయ పార్టీల నిధులపై సమాచారాన్ని ప్రజలకు దాచడం సమాచార హక్కుకు విరుద్ధమని పేర్కొంది. కంపెనీలకు అపరిమిత రాజకీయ విరాళాలకు అనుమతినిచ్చిన మార్పులను కూడా కోర్టు కొట్టివేసింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారంపై ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం 2017-18 నుంచి 2022-23 వరకు బాండ్ల ద్వారా వచ్చిన విరాళాల్లో బీజేపీకి రూ.6,565.98 కోట్లు, అంటే 54.77 శాతం లభించాయి. ఇక్కడ ప్రశ్న ఒక పార్టీకి వ్యతిరేకంగా కాదు; రాజకీయ అధికారం-- కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు కార్పొరేట్ డబ్బు మధ్య సంబంధం ఓటరుకు పూర్తిగా కనిపించాలా లేదా? ఇప్పటికీ ప్రపంచంలో ఏ దేశంలో, ఏ పార్టీ కి ఇంత మూలధనం బీజేపీకి లభించినంతగా ఎవరికీ లభించలేదు.సుప్రీం కోర్టు తప్పు పట్టినా...మరో పేరుతో ఈ సరఫరా నేటికీ కొనసాగుతుంది.

మణిపూర్ విషయంలో 2023లో హింస ప్రారంభమైన తరువాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకారం 2023 ఆగస్టు నాటికి 152 మంది మరణించారు, 1,106 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి, దాదాపు 14,898 మందిని అరెస్టు చేశారు. హింసకు కారణాలు, అధికారుల వైఫల్యాలు పరిశీలించేందుకు కేంద్రం విచారణ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయినప్పటికీ బాధితుల పునరావాసం, న్యాయం, శాశ్వత శాంతి వంటి చర్యలు తీసుకోలేదు. నేటికీ మణిపూర్ రావణాసురుని కాష్టంలా రగులుతూనే ఉంది.

చివరగా మీడియా. అధికారాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ప్రాథమిక బాధ్యత. కానీ ప్రభుత్వ అనుకూలమైనా మీడియా గోదీ మీడియాగా ప్రసిద్ధి పొందింది.అవి మోదీ భజన మండళ్లుగా మారాయి. ప్రతిపక్ష అనుకూలమైనా జర్నలిజంపై ఆంక్షలు పెరిగాయి.భారత మీడియా స్వేచ్ఛా పై ప్రపంచ స్థాయి ఇండెక్స్ లో 157 స్థానానికి పడిపపోయింది. కేంద్ర ప్రభుత్వ లెక్కలు, ఆర్థిక ఆధారాలను ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ నమ్మే పరిస్థితి లేదు. దేశ ఆర్థిక పరిస్థితి వాస్తవాలు,146 కోట్ల ప్రజల్లో సామాన్య ప్రజా నిత్య జీవన స్థాయి అనే ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది.అదానీ, అంబానీ లాంటి కొద్ది మంది ప్రపంచ స్థాయి సంపన్నుల స్థాయికి చేరుకుంటే అది ఆర్థిక ప్రగతి అని చెప్పలేము. అదే సమయంలో అధికారాన్ని ప్రశ్నించే స్వరాలను, మీడియాపై ఆంక్షలు రుద్దటం, జర్నలిస్ట్ లు, సంపాదకులపై కేసులు పెట్టి జైళ్ళ పాలు చేశారు . కోర్టులు అవి ఆధారాలు లేనివిధంగా తేల్చాయి. భారత్ లో దేశభక్తి--దేశద్రోహం అనే ద్వంద్వంలో మీడియా స్వేచ్ఛను బంధించడం ప్రజాస్వామ్య చర్చను కుదిస్తుంది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి జీడీపీ వృద్ధి గణాంకాలు చెప్పే కథ ఒకటి; కుటుంబాల జీవన వ్యయం, ఉపాధి, వేతనాలు, రైతు ఆదాయం చెప్పే కథ మరొకటి. 2023-24 కుటుంబ వినియోగ వ్యయ సర్వేలో గ్రామీణ వినియోగ అసమానత గణాంకాలలో 0.237, పట్టణ ప్రాంతంలో 0.284గా నమోదైంది. ఈ గణాంకాలు అసమానత తగ్గిందనే అధికారిక సూచన ఆచరణలో కనపడటం లేదు 80 కోట్ల మంది ప్రజలు సబ్సిడీ ఆహార ధాన్యాలపై ఆధారపడుతున్నారు.

అందుకే ప్రతి బడ్జెట్‌లో, ప్రతి ఎన్నికలో, ప్రతి పెద్ద విధాన నిర్ణయంలో ప్రజల లెక్క అడగాల్సిన ప్రశ్న ఒక్కటే: ఆర్థిక వృద్ధి ఫలాలు ఎవరికి చేరాయి? శ్రమించిన ప్రజలకు ఎంత దక్కింది? కార్పొరేట్ రంగానికి ఎంత లాభం వచ్చింది? రైతు, కార్మికుడు, చిన్న వ్యాపారి, నిరుద్యోగ యువత, మధ్యతరగతి కుటుంబం ఎంత భారం మోశాయి?

ప్రజలు దేశం కోసం త్యాగం చేయాలని ప్రభుత్వాలు అడగడం కొత్త కాదు. కానీ ప్రజాస్వామ్యంలో త్యాగం చేయాల్సింది ఎప్పుడూ ప్రజలే, లాభం పొందేది ఎప్పుడూ గద్దెనెక్కిన కొద్దిమందే అనే భావనకు తావు ఉండకూడదు. ప్రజల నుంచి విధేయతను కోరే రాజకీయానికి బదులు, ప్రజల ముందు ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ లెక్క చెప్పే పారదర్శక పాలన అవసరం.కోవిడ్ సమయంలో మోదీ పిలుపును ఆవేశంగా గుడ్డిగా నమ్మకంతో పళ్లెలు, చప్పట్లు కొట్టిన చేతులు ఇప్పుడు గణాంకాల చిట్టా విప్పమని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి అడుగుతున్నాయి. దీపాలు వెలిగించిన అంధ భక్తులే ఇప్పుడు లెక్కల పుస్తకం తెరవమంటున్నాయి. "ప్రజలు కేవలం ఓట్లు వేసే భక్తులు మాత్రమే కాదు- ఈ యువతరం నవ పౌరులు చప్పట్లు కొట్టడానికే కాదు, అధికారాన్ని నిలబెట్టి ప్రశ్నించడానికి జన్-జీ, ఆల్ఫా-జీ కూడా సిద్ధంగా ఉన్నారు."



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### ఇంకేమీ వద్దు, ఒక్క వాన చాలు

సాలు సాలూలో విత్తనం
మొలకెత్తితేనే గదా
పంటకు జన్మ ఇచ్చినట్టు!!
జన్మనిస్తేనే గదా....
మన పళ్లెంలో తెల్లని మెతుకయ్యేది
అప్పుడే గదా ..ఆ మెతుకు మీద
మన పేరుతో పాటు రైతు పేరు
కూడా నిలబడి ఉండేది!!
కానీ ఇప్పుడు పంటలే లేకపోతే??

దాహంతో నేలమ్మ ఎండలతో ఎండి
నెర్రెలు బారుతుంది
తనువంతా ఎడారిగా మారిపోతూ
నిలువెల్లా కాలిపోతున్నది!
రైతులంతా వానల రాకకై
ఆశగా నింగివైపే చూస్తూ,
ఆకలి గుండెలో తడిలేక
కన్నీరు మున్నీరవుతున్నారు
విత్తనాలు మొలవక, పంటలు పండక
ధరిత్రి అసాంతం వాడిపోతుంది !!
పాడిజీవులు మేతకై అలమటిస్తున్నయ్
భవిష్యత్తు అంధకారమై

కానరాని భయం కలవర పెడుతున్నది
మానవ తప్పిదాలే శాపంగామారి
అందరి గుండెల్లో గుబులు రేపుతుంది!
తెలిసో!, తెలియకో!
దేశాన్ని పోషించే భారాన్ని
నెత్తినేసుకోలేదు రైతు!!
లాభ నష్టాలు బేరీజు వేసుకోడు
అతనికి చేనంటే మట్టి కాదు,
శ్వాసల పందిరి, ప్రాణం పోసి పెంచే
పచ్చని ధాన్య క్షేత్రం
బంగారు పంటలను ప్రసవించే
అమృత కలశం.

సృష్టి పరిమళం అంతా
మట్టి వాసనలోనే దాగి ఉంది
మనం కాలరాసే ఈ మట్టిలోనే
జీవితాన్ని నిలబెట్టే
ఆకు పచ్చని రహస్యం.
ఇమిడి వుంది...
అవసరమైన ఓర్పు పాఠం
మట్టి గుణంలోనే ఒదిగి వుంది
అందుకే అతను అన్నదాత
సమస్త జీవుల జీవనాధారం
వాన ఒక్కటే... దానికై...నిరంతరం
ఎదురుచూసే ఆశాజీవి రైతు ఒక్కడే!!

పొడిబారుతున్న కరువు నేలకు
పచ్చని పంటల భాగ్యలక్ష్మి
వస్తేనే గదా సిరులు కురిసేది
ఆకలి ఋతువుకు
వర్షమే నిత్య ఆధారం
పైరంటే రైతులకు జీవితమే గదా!!
మరీ, జీవితమైన బ్రతుకును
ఎవరు కాళీ చేస్తారు??
జీవితాన్నిచ్చే ఒక్క వాన కోసం
ఎదురుచూడడం తప్పు!!

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

# ప్రపంచానికి కావాల్సింది ఆయుధాలు కాదు.. శాంతి!



ప్రపంచ శాంతి దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న నిర్వహించబడుతుంది. యుద్ధాలు, హింస, విద్వేషాలు, అణ్వాయుధాల ముప్పు, అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య మానవజాతి శాంతి విలువను మరోసారి గుర్తు చేసుకునే రోజు ఇది. ఐక్యరాజ్యసమితి 1981లో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం 2001లో సెప్టెంబర్ 21వ తేదీని శాశ్వతంగా ప్రపంచ శాంతి దినోత్సవంగా నిర్ణయించింది. ఈ రోజును అంతర్జాతీయ స్థాయిలో అహింస, కాల్పుల విరమణ, సంభాషణ, పరస్పర అవగాహనకు అంకితం చేశారు. 2026 సంవత్సరానికి ఐక్యరాజ్యసమితి శాంతి దినోత్సవ సందేశంగా "శాంతిలో పెట్టుబడి - అందరి కోసం, ప్రతిచోటా, ప్రతిరోజూ" అనే భావనను ముందుకు తెచ్చింది. శాంతి అనేది కేవలం యుద్ధం లేకపోవడం మాత్రమే కాదని, ప్రతి మనిషికి గౌరవం, భద్రత, సమాన అవకాశాలు, న్యాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి లభించే పరిస్థితిని నిర్మించడమే నిజమైన శాంతి అని ఈ సందేశం తెలియజేస్తోంది.

మానవ నాగరికత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించినప్పటికీ ప్రపంచం ఇంకా యుద్ధాల నుంచి పూర్తిగా బయటపడలేకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఒకప్పుడు నెలల తరబడి పట్టే సమాచార ప్రసారం నేడు క్షణాల్లో జరుగుతోంది. మానవుడు అంతరిక్షంలోకి వెళ్లాడు. కృత్రిమ మేధస్సును అభివృద్ధి చేస్తున్నాడు. వైద్యం, రవాణా, సమాచార సాంకేతికత, వ్యవసాయం వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సాధించాడు. అయితే అదే మానవుడు ఆధునిక ఆయుధాలను కూడా మరింత విధ్వంసకరంగా తయారు చేసుకున్నాడు. యుద్ధం జరిగితే కేవలం సైనికులు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలు, పిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇళ్లు ధ్వంసమవుతున్నాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ప్రజలు తమ స్వస్థలాలను విడిచి శరణార్థులుగా మారుతున్నారు. యుద్ధం ముగిసిన తరువాత కూడా దాని ఆర్థిక, సామాజిక, మానసిక ప్రభావాలు అనేక సంవత్సరాల పాటు కొనసాగుతాయి. ఐక్యరాజ్యసమితి ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు యుద్ధాలు, హింస, సంక్షోభాల కారణంగా బలవంతపు నిరాశ్రయులుగా మారుతున్నారు. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా 117 మిలియన్లకు పైగా ప్రజలు బలవంతపు నిరాశ్రయుల పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ సంఖ్య ప్రపంచ శాంతి పరిస్థితి ఎంత తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందో తెలియజేస్తోంది. ఒక వ్యక్తి తన ఇల్లు, భూమి, ఉపాధి, కుటుంబం, సామాజిక సంబంధాలను వదిలి తెలియని ప్రాంతానికి వెళ్లాల్సి రావడం కేవలం వలస సమస్య కాదు; అది మానవ భద్రతకు సంబంధించిన తీవ్రమైన సమస్య. యుద్ధం వల్ల నష్టపోయిన ప్రజలకు ఆహారం, నీరు, నివాసం, వైద్యం, విద్య అందించడం అంతర్జాతీయ సమాజం ముందున్న నిరంతర బాధ్యతగా మారింది.

ప్రపంచ శాంతి గురించి చర్చిస్తున్న సమయంలో మరో విరుద్ధమైన వాస్తవం మన ముందుకు వస్తోంది. ప్రపంచ దేశాలు రక్షణ, సైనిక రంగాలపై భారీ మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ గణాంకాల ప్రకారం 2024లో ప్రపంచ సైనిక వ్యయం 2.718 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2023తో పోలిస్తే ఇది వాస్తవ విలువల్లో 9.4 శాతం పెరుగుదల. శీతల యుద్ధం ముగిసిన తరువాత నమోదైన అత్యంత వేగవంతమైన సైనిక వ్యయ పెరుగుదలల్లో ఇది ఒకటిగా SIPRI పేర్కొంది. ప్రపంచ దేశాలు భద్రత కోసం సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నప్పటికీ, ఆయుధ పోటీ పెరుగుతున్న కొద్దీ ప్రపంచంలో పరస్పర అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. ఒక దేశం తన భద్రత కోసం ఆయుధాలను పెంచితే మరొక దేశం కూడా అదే కారణంతో తన సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవడం అంతర్జాతీయ స్థాయిలో ఆయుధ పోటీకి దారితీస్తుంది. దీని ఫలితంగా శాంతి కంటే భయానికి ఎక్కువ ప్రాధాన్యం ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

అణ్వాయుధాల సమస్య ప్రపంచ శాంతికి అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటి. రెండో ప్రపంచ యుద్ధం చివరి దశలో అణ్వాయుధాల విధ్వంసక శక్తిని ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. అప్పటి నుంచి అణ్వాయుధాల సంఖ్య, వాటి ఆధునికీకరణ, వాటి నియంత్రణ వంటి అంశాలపై అంతర్జాతీయ చర్చలు కొనసాగుతున్నాయి. ఒకవైపు అణ్వాయుధాలు తమ దేశ భద్రతకు అవసరమని కొన్ని దేశాలు వాదిస్తుంటే, మరోవైపు అణు ఘర్షణ జరిగితే దాని ప్రభావం ఒక దేశానికే పరిమితం కాకుండా ప్రపంచ మానవాళిపై పడుతుందని నిరాయుధీకరణకు మద్దతు ఇచ్చే దేశాలు, సంస్థలు చెబుతున్నాయి. అందువల్ల అణ్వాయుధాల వ్యాప్తి నిరోధం, ఆయుధ నియంత్రణ, అంతర్జాతీయ నమ్మక నిర్మాణం, సంభాషణ వంటి అంశాలు ప్రపంచ శాంతి చర్చల్లో అత్యంత ప్రాధాన్యం పొందుతున్నాయి. భారతదేశ చరిత్రలో శాంతి, అహింస భావనలకు ప్రత్యేక స్థానం ఉంది. "వసుధైవ కుటుంబకం" అనే భావన ప్రపంచాన్ని ఒక కుటుంబంగా చూడాలని సూచిస్తుంది. మహాత్మా గాంధీ అహింసను రాజకీయ, సామాజిక మార్పుకు శక్తివంతమైన మార్గంగా ప్రపంచానికి పరిచయం చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అహింసా సిద్ధాంతం కీలక పాత్ర పోషించింది. స్వాతంత్ర్యం తరువాత కూడా భారత విదేశాంగ విధానంలో శాంతియుత సహజీవనం, వివాదాల శాంతి యుత పరిష్కారం, బహుళపక్ష సహకారం, నిరాయుధీకరణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది. పంచశీల సూత్రాలు కూడా దేశాల మధ్య పరస్పర గౌరవం, సార్వభౌమత్వం, జోక్యం లేక పోవడం, శాంతియుత సహజీవనం వంటి భావనలను ముందుకు తెచ్చాయి. అయితే శాంతి అంటే కేవలం దేశాల మధ్య యుద్ధం లేకపో వడం మాత్రమే కాదు. ఒక దేశంలో యుద్ధం లేకపోయినా పేదరికం, ఆకలి, నిరుద్యోగం, కుల వివక్ష, మత విద్వేషం, లింగ అసమానత, సామాజిక అన్యాయం, కుటుంబ హింస, రాజకీయ హింస, ద్వేష ప్రసంగాలు కొనసాగితే అక్కడ సంపూర్ణ శాంతి ఉన్నట్లు చెప్పలేం. నిజమైన శాంతి అనేది వ్యక్తి గౌరవంగా, భద్రంగా, స్వేచ్ఛగా జీవించే సామాజిక పరిస్థితి. అందుకే ఆధునిక కాలంలో శాంతిని మానవ భద్రతతో అనుసంధానించి చూడాల్సిన అవసరం ఏర్పడింది. విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఆహారం, తాగునీరు, నివాసం, సామాజిక న్యాయం వంటి అంశాలన్నీ శాంతికి పునాదులుగా మారాయి.

పేదరికం, అసమానతలు, అవకాశాల కొరత అనేక సమాజాల్లో అసంతృప్తికి కారణమవుతున్నాయి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందకపోతే సామాజిక విభేదాలు పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల శాంతి నిర్మాణం అంటే యుద్ధాన్ని ఆపడం మాత్రమే కాకుండా, యుద్ధాలకు దారితీసే సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను కూడా పరిష్కరించడం. ఒక బాలుడికి నాణ్యమైన విద్య అందించడం శాంతిలో పెట్టుబడి. ఒక యువకుడికి ఉపాధి కల్పించడం శాంతిలో పెట్టుబడి. ఒక మహిళకు సమాన అవకాశాలు కల్పించడం శాంతిలో పెట్టుబడి. ఒక గ్రామానికి తాగునీరు అందించడం కూడా శాంతిలో పెట్టుబడే. ఎందుకంటే భద్రత, గౌరవం, అవకాశాలు ఉన్న సమాజంలో అస్థిరతకు కారణమయ్యే పరిస్థితులు తగ్గే అవకాశం ఉంటుంది.

శాంతి నిర్మాణంలో విద్య అత్యంత కీలకమైన సాధనం. చిన్ననాటి నుంచే పిల్లలకు ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, భిన్నత్వాన్ని అంగీకరించడం, విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, వివక్షకు వ్యతిరేకంగా నిలబడటం వంటి విలువలను బోధించాలి. యుద్ధాలు, ఘర్షణలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో విద్యకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య



**నవాబుపేట్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** నవాబ్ పేట్ మండలం దూద్దగు గ్రామంలో గూడెం అమృత గోపాల్ ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వ ఆధ్వర్యంలో గూడెం అమృత గోపాల్, ఆధ్వర్యంలోగృహప్రవేశాన్ని ఆదివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడారు.పేద కుటుంబాలకు సొంతింటి వసతి కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నవాబుపేట్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచి శేఖర్ ఆధ్వర్యంలో స్వరూప మహేందర్ నిర్మించుకున్న గృహం ప్రవేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చేవెళ్ల నియోజకవర్గం లోని నవాబుపేట్ మండల పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. పేద కుటుంబాలకు రేషన్ కార్డు అనేది కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే కాదు.. అనేక సంక్షేమ పథకాలకు ఆధారం. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదల సమస్యలను గుర్తించి కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు.పేదల కష్టాలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ బంధువులు లక్ష్మి, అమృత, పుష్పమ్మ, కిష్టమ్మ, బుచ్చయ్య, అనసూయ,అరుణ, మల్లయ్య, అంతయ్య దేవకుమార్, నాగలక్ష్మి, అశ్విని, కవిత, ప్రణవి, బంధువులు,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తూనికలు, కొలతల్లో భారీ మోసం..!

- పర్యవేక్షణ లోపం వినియోగదారులకు శాపం
- కొన్నేళ్లుగా తూనీకలకు స్టాంపింగ్ వేయని అధికారులు
- తూకం వేసే మిషన్లలో సెట్టింగులు
- కొనుగోలుదారుల జేబులకు చిల్లులు
- మామూళ్ల మత్తులో అధికారులు




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** మార్కెట్లల్లో ఏ వస్తువు కొనాలన్నా తూకం లేదా లీటర్ల లెక్కన కొలతల్లో తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వ్యాపారులు తూకాలు, కొలతల్లో మోసాలకు పాల్పడుతూ వినియోగదారుల జేబుకు చిల్లులు పెడుతున్నారు. వ్యాపార లావాదేవీల్లో పారదర్శకత పట్టించి వినియోగదారుడికి తూకంలో మోసం జరగకుండా చూడాల్సిన తూనికలు కొలతల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో నిద్రావస్థలోకి వెళ్లిపోయారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు వ్యాపార సంస్థల్లో, కూరగాయ మార్కెట్లలో, రైతు బజార్లలో తూకాలకు స్టాంపింగ్ వెయ్యక సంవత్సరాలు గడుస్తుంది. కూరగాయల మార్కెట్లో ఇప్పటికీ 100 గ్రాములు, 200 గ్రాములు, 500 గ్రాములు, కిలో వరకు రాళ్ల ద్వారా తూకం వేస్తున్నారు. పూల వ్యాపారులు కూడా చాలామంది రాళ్లతోనే తూకం వేస్తున్నారు.

### తూనికలు, కొలతల శాఖ నిఘా ఎక్కడ?

తూనికలు, కొలతల శాఖ అంటే సామాన్యులకు ప్రజలు వారు కొనుగోలు చేసిన వస్తువులు సరి అయిన తూకంలో ఉన్నాయా.. లేవా..? అనే విషయాలపై నిఘా పెడుతూ.. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ.. ప్రజలు మోసపోకుండా జాగ్రత్తలు తీసు కుంటూ.. వినియోగదారుల రక్షణలో ఈ విభాగం నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైనది. ఈ శాఖ వినియోగదారుల రక్షణ కోసం అనేక చర్యలు తీసు కుంటూ.. వ్యాపారులకు అనేక మార్గదర్శకాలను పెట్టింది... అయితే వ్యాపారాలు బాగా జరిగే పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్న బడా సంస్థలు సహా, వ్యాపారులు నిర్వహించేవారు చాలావరకు వీటిని సరిగా ఆచరించడం లేదు అనేది వాస్తవం.. తూనికలు కొలతల శాఖ వినియోగదారుల రక్షణ కోసం విధించిన ప్రమాణాలు ప్రతి రెండేండ్లకోసారి ప్రామాణిక ముద్రలు : తూనిక రాళ్లకు ప్రతి రెండేండ్లకోసారి తూనికలు, కొలతల శాఖ (డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ) నుంచి ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలి. ఇందుకు కొంత నగదును తూనికలు, కొలతల శాఖకు ఫీజు రూపంలో చెల్లించాలి. అదే ఎలక్ట్రానిక్ కాటా అయితే ప్రతి సంవత్సరం ఒకసారి తనిఖీలు చేయించుకొని స్టాంపులు వేయించుకోవాలి. అయితే వ్యాపారులు 70 శాతం మంది ప్రామాణిక ముద్రలు వేయించుకోవడంలేదు అనేది ఒక సర్వే లో తేలిన నిజం... అధికారులు తమ టార్గెట్ లను పూర్తిచేయాలన్న ఉద్దేశంతో అడపాదడపా దాడులు చేసి, మొక్కుబడిగా కొంత ఫైన్ విధించి తూతూ మంత్రంగా వీటిని ముగిస్తున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల కిరాణా వ్యాపారాల్లో ఇప్పటికీ తూకం రాళ్లతో పాతపద్ధతిలోనే విక్రయిస్తున్నారు. సరాసరి ప్రతి కిలోకు 100 గ్రాముల వరకు నష్టపోతున్నట్లు అంచనా.. ఇదిలా ఉండగా వ్యాపారులు వినియోగించే తూనికలు, కొలతల యంత్రాలపై తప్పనిసరిగా ప్రామాణిక ముద్రలు వేయించుకునేలా అధికారులు శ్రద్ధ తీసుకుని నిఘా పెంచాల్సిన అవసరం ఉందని వినియోగదారులు చెబుతున్నారు... లీగల్ మెట్రాలజీ విభాగం యొక్క మొదటి, ప్రధాన విధి వినియోగదారులలో విశ్వాసాన్ని పెంపొందించడం. అంతర్జాతీయ యూనిట్ల వ్యవస్థ (ఐఎస్ఐ)కి అనుగుణంగా ప్రమాణాల ఏకరూపతను తయారు చేయడం. లీగల్ మెట్రాలజీ యొక్క నిజమైన సహాయం ఇంకా సేవలను అందించడం ద్వారా ప్రజల ప్రయోజ నాలను పరిరక్షించడం. ముఖ్యంగా వాణిజ్య లావా దేవీలకు సంబంధించిన అన్ని రకాల కొలతలలో ఖచ్చితత్వాన్ని నిర్ధారించడం లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ యొక్క గొప్ప భాధ్యత కట్టుబడి ఉన్న విధి. అయితే వీరి బాధ్యతలతో పాటు ప్రజలు కూడా సరైన అవగాహన కలిగి ఉండటం ఎంతైనా అవసరం... పెట్రోల్ బంక్ ల దగ్గరనుండి, వెండి, బంగారు నగలకు సంబంధించి జ్యువలరీ ప్రతివిషయంలో వారు మోసపో కుండా ఉండటం కోసం తగిన జాగ్రత్తతో ఉండటం.. అలాగే ఏదైనా మోసం జరిగితే తూనికలు, కొలతల శాఖ (డిపార్ట్ మెంట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ ) కు ఆన్లైన్ లో కానీ లేదా ఫోన్ ద్వారా కానీ పిర్యాదు చేసి చర్య తీసుకునే విధంగా అలెర్ట్ గా ఉండాలి.. కానీ ఇక్కడ అందుకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతోంది.. డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ మెటాలజీ విభాగంలో అవినీతి అంతకంతకు పెరిగి, వినియోగదారులను విస్మరించి, సొంత పనులను చక్కబెట్టుకునే హడావిడిలో శాఖ ఉందని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకా కొందరు అధికారులు సుదీర్ఘకాలం ఒకే చోట విధులు నిర్వహిస్తూ తమకు అనుకూలమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకొని బహిరంగంగానే వసూళ్లకు పాల్పడుతున్నారని విశ్రాంత ఉద్యోగులే కుండ బద్దలు కొట్టి చెబుతున్నారు. ప్రతినిత్యం వినియో గదారునికి తూనికలు, కొలతల శాఖతో అనుబంధం కచ్చితంగా ఉంటుంది.. కానీ ఈ విభాగం అధికారులను, సిబ్బందిని వ్యాపారస్తులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోయినట్లు కనిపించడం లేదు. అసలు తూనీకలు కొలతల శాఖ ఉందనేది చాలామంది వ్యాపారులకు తెలియదనేని నిజం... కారణం.. వారు సమర్పిస్తున్న తాయిలాలు కావచ్చు, లోపాయికారి ఒప్పందాలు కావచ్చు. జిల్లాలో చాలావరకు ఎక్కడ చూసినా కల్తీనే.. ఇప్పటికైనా వినియోగదారుని సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిపార్ట్మెంట్ పై నిఘాని పెంచి, అవినీతిమయమైన శాఖను ప్రక్షాళన చేసి, పారదర్శకమైన సేవలను అందించాలని పలువురు మేధావులు, కొనుగోలుదారులు కోరుకుంటున్నారు.

## తరాలు మారినా మారని రోడ్డు

- గుంతలమయంగా మాసాన్‌పల్లి-కల్హేర్ రహదారి.. వాహనదారుల నరకయాతన



**కల్హేర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో మాసాన్‌పల్లి నుంచి కల్హేర్ వరకు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి దయనీయంగా మారింది. తరాలు మారినా ఈ రోడ్డు తలరాత మాత్రం మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 5 కిలోమీటర్ల ఈ రోడ్డు గత పదేళ్లుగా అధ్వానంగా ఉంది. రోడ్డుపై తారు లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తోంది. ద్విచక్ర వాహనదారులు అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు.

### ప్రజలకు తప్పని ఇబ్బందులు

ఈ రోడ్డుపై రోజూ వందలాది మంది రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తారు. మాసాన్‌పల్లి, బాచేపల్లి, నాగ్‌ధర్ గ్రామాల ప్రజలకు కల్హేర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇదే ప్రధాన దారి. గుంతల కారణంగా ఆటోలు, పాఠశాల బస్సులు తిరగడం లేదు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. రైతులు తమ పంటను మార్కెట్ కు తీసుకెళ్లాలంటే నానా తంటాలు పడుతున్నారు.

“మా చిన్నప్పటి నుంచి ఈ రోడ్డు ఇంతే ఉంది. మేము పెద్దోళ్లమయ్యాం, మా పిల్లలు పెద్దోళ్లవుతున్నారు కానీ రోడ్డు మాత్రం అలాగే ఉంది. నాయకులు వచ్చినప్పుడల్లా రోడ్డు మంజూరైందని చెబుతారు తప్ప పనులు మొదలు పెట్టరు” అని మాసాన్‌పల్లికి చెందిన ప్రజలు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మాసాన్‌పల్లి-కల్హేర్ రోడ్డుకు మరమ్మతులు కాకుండా పూర్తిస్థాయిలో కొత్త బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సేల్ డీడ్‌ల జారీపై కాలనీవాసుల హర్షం

- మధుయాష్కి గౌడ్‌కు స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు

**హయత్ నగర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ నియోజకవర్గం లో జీవో 118 పరిధిలోని కాలనీల్లో రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం లభించడంతో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తి యాజమాన్య హక్కులతో సేల్ డీడ్‌లు అందుబాటులోకి రావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ మధుయాష్కి గౌడ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయనను కలిసి స్వీట్లు తినిపించారు. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ వివేకానంద పార్క్, రాజీవ్ గాంధీ పార్కులను మధుయాష్కి గౌడ్ సందర్శించి మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా వైదేహి నగర్, బీఎన్ రెడ్డి నగర్, శ్రీపురం తదితర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి తమ సమస్య పరిష్కారంపై సంతోషం వ్యక్తం చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. గతంలో జీవో 118 కింద డీడ్ ఆఫ్ కన్వేయన్స్ మాత్రమే ఉండటంతో బ్యాంకు రుణాలు పొందడం, మార్టిగేజ్, గిఫ్ట్ డీడ్ తదితర లావాదేవీలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. సమస్యను మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేశారని చెప్పారు. ప్రస్తుతం పూర్తి యాజమాన్య హక్కులతో సేల్ డీడ్‌లు అందించే చర్యలు



చేపట్టడం వల్ల తమ సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. సేల్ డీడ్‌ల జారీతో ప్రజలకు తమ ఆస్తులపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయని తెలిపారు. ఆస్తుల విక్రయం, గిఫ్ట్, మార్టిగేజ్, బ్యాంకు రుణాలు వంటి లావాదేవీల్లో గతంలో ఎదురైన ఇబ్బందులు తొలగే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆస్తులకు సంబంధించిన 22-ఏ నిషేధిత జాబితా అంశాన్ని కూడా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, ముద్దగోని లక్ష్మీప్రసన్న, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతి గణేష్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం




**చిలప్‌చేడ్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** తొమ్మిదవ జాతీయ పోషణ మాసం సందర్భంగా శనివారం చిలప్‌చేడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సోమక్కపేట, గౌతాపూర్, చండూర్, చిట్కుల్, ఫైజాబాద్ హైస్కూళ్లలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఎంపిక చేసి, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఉత్తమంగా ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేసిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చిన్న వయస్సు నుంచే అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెస్త దుర్గాచలం, తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై నర్సింలు, స్కూల్ చైర్మన్, పంచాయతీ కార్యదర్శి మోహన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని అన్ని హైస్కూళ్లలో అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులకు పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

## ప్రపంచ శాంతి కోసం టీజీపీఏ శిక్షణార్థుల యాత్ర

**హైదరాబాద్/రాజేంద్రనగర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** ప్రపంచ శాంతి, సోదరభావం, సామరస్యాన్ని చాటిచెప్పే ఉద్దేశంతో అఖిల భారతీయ ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన విశ్వ శాంతి యాత్రలో ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)కు చెందిన 58 మంది శిక్షణార్థులు పాల్గొన్నారు. డైరెక్టర్ అభిలాషా బిస్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు పర్యవేక్షణలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చైతన్యతో కలిసి శిక్షణార్థులు యాత్రలో పాల్గొన్నారు. శాంతి, మానవతా విలువలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తూ యాత్ర సాగింది.



## మున్నూరు రవీందర్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు జిల్లా కోర్ కమిటీ వినతి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** రాబోయే మెదక్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది మున్నూరు రవీందర్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా కోర్ కమిటీ సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ శాసనమండలి సభ్యుడు ఎన్. రామచంద్రరావుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్న మున్నూరు రవీందర్ మాట్లాడుతూ, గత 45 సంవత్సరాలుగా వనపర్తి నియోజకవర్గంలో బీజేపీ విస్తరణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు పర్యాయాలు వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 1994లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినట్లు తెలిపారు.నియోజకవర్గంలో పార్టీ విస్తరణ కోసం పనిచేస్తున్న సమయంలో నక్సలైట్ల దాడికి గురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తన సుదీర్ఘ రాజకీయ సేవలను, పార్టీ కోసం చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, ఆర్. వెంకటేశ్వర్‌రెడ్డి, కేతూరి బుడ్డన్న, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుజ్ఞారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- ఎస్సై హామీతో ఆందోళన విరమణ

**కొల్చారం, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తా సమీపంలోని కుటుంబాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం మూడేళ్ల క్రితం మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలోని దర్గా వెనుక భాగంలో రక్షిత మంచినీటి ట్యాంకును నిర్మించినప్పటికీ.. ఇప్పటివరకు దానికి నీటి కనెక్షన్ ఇవ్వలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ట్యాంక్ నిర్మించిన తమ దాహార్తి తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హామీలు ఎన్నో.. నీళ్లు మాత్రం లేవు

సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికల సమయంలో వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని సర్పంచ్ దయాకర్ గౌడ్ ఉపసర్పంచ్ నాని హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు. అయితే సమస్య పరిష్కారం కాకపోగా, వారం, పది రోజులకు ఒకసారి కాలనీ ప్రజలు ఎన్నోసార్లు చేస్తే ట్యాంకర్ ద్వారా నీటిని ఎరఫరా చేస్తున్నారని చెప్పారు. దీంతో తాగునీటితోపాటు ఇతర అవసరాలకు నీటి కోసం కూడా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పంచాయితీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పరిష్కారం కాలేదని ఆరోపిస్తూ మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. తమ సమస్యను పరిష్కరించడంలో పాల్కవర్గం విఫలమైందని ఆరోపించారు.

### ఎస్సై హామీతో ఆందోళన విరమణ

విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్



సంఘటన స్థలానికి చేరుకొని మహిళలతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
21 సెప్టెంబర్ 2026

# విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ఊకచెట్టివాగుపై హైలెవల్ బ్రిడ్జి ప్రారంభం



**వనపర్తి/మదనాపూర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** మదనాపూర్ మండలంలోని ఊకచెట్టివాగుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మదనాపూర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యే మాట్లాడారు.మదనాపూర్, కౌకుంట్ల, మూసాపేట మండలాల్లో సమీకృత మండల కార్యాలయ సముదాయాల నిర్మాణానికి రూ.49 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ఒక్కో సముదాయానికి సుమారు రూ.16.30 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక భవనాలతో పాటు ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.గతంలో ప్రారంభమై మధ్యలో నిలిచిపోయిన ఊకచెట్టివాగు బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు రూ.6 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. బ్రిడ్జి పూర్తికావడంతో వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పుస్తకాలు, యూనిఫారాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా చేయడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలతో పాటు వివిధ వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో ప్రజల రాకపోకల సమస్యలు తొలగాయని తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి మెరుగైన రవాణా సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గానికి సుమారు రూ.1,034 కోట్ల నిధులు తీసుకువచ్చి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దేవరకద్ర--కురుమూర్తి రహదారులు, వంతెనల అభివృద్ధికి సుమారు రూ.143 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. క్రీడా రంగ అభివృద్ధికి మినీ స్టేడియం కోసం రూ.10 కోట్లు, కొత్తకోటలో ఇండోర్ స్టేడియం కోసం రూ.2.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్, అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో కలుషిత ఆహారంపై బీఆర్ఎస్ పరామర్శ



**ధన్వాడ, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** ధన్వాడ మోడల్ స్కూల్ హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. హాస్టళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. బూజుపట్టిన వేరుశనగలతో తయారు చేసిన చట్నీ తినడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం తక్షణమే సమీక్ష నిర్వహించి, జిల్లాలోని మోడల్ స్కూళ్లు, గురుకులాల హాస్టళ్లలో ఆహార నాణ్యతను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, నాణ్యత లేని ఆహారం సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. హాస్టళ్లలో ఆహారం, తాగునీటి నాణ్యతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్వీ పోరాడుతుందని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ యువ నాయకుడు ఇర్ఫాన్ హెచ్చరించారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటూ పాదయాత్ర



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన పాదయాత్ర నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మీదుగా కొనసాగింది. "రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా" పేరుతో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఆయన పాదయాత్ర నిర్వహిస్తున్నారు. నిజాంపేట్‌కు చేరుకున్న కాటూరి వెంకటేశ్వర్లును మాజీ మండల అధ్యక్షులు మాణిక్ రావు పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాటూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండల్ రెడ్డి, రాజేష్ రెడ్డి, ఎకనాథ్, దత్తు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ నిఘా నీడలో జూరాల ప్రాజెక్టు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** నీటి విడుదల కోసం రైతుల ఆందోళనతో జూరాల ప్రాజెక్టు వద్ద ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రాజెక్ట్ నుంచి కుడి, ఎడమ కాలువలకు రైతులు స్వయంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్న అనుమానాలు తలెత్తడంతో ధరూర్ పోలీసులు ముందస్తు చర్యగా అక్కడ భారీగా పహారా కాస్తున్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు.గత రెండు రోజులుగా సాగునీటి విడుదల కోసం ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కాలువల కింద సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు ప్రాజెక్టు వద్ద ధర్నా చేసినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రైతులు నేరుగా



రెగ్యులేటర్ పైకి ఎక్కి, తాళాలు బద్దలుకొట్టి స్వయంగా ఎడమ కాలువ గేట్లను ఎత్తి నీటిని వదులుకున్నారు. ఈ ఊహించని పరిణామంతో అధికారులు, పోలీసులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.అయితే, అర్ధరాత్రి దాటిన తర్వాత రంగంలోకి దిగిన ప్రాజెక్టు అధికారులు రైతులు తెరిచిన గేట్లను తిరిగి మూసివేశారు. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 9 టీఎంసీల వరకు నీటి నిల్వ ఉన్నప్పటికీ, పైనుంచి ఇన్‌ఫ్లో తగ్గడం మరియు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతోనే తాము నీటిని విడుదల చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం మరియు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కాలువల్లో నీటి ప్రవాహం నిలిచిపోవడాన్ని గమనించిన రైతులు మళ్లీ ప్రాజెక్టు వైపు దూసుకువచ్చే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ధరూర్ పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ బృందాలను హెడ్ రెగ్యులేటర్ వద్ద భారీగా మోహరించారు. రైతులు ప్రాజెక్టు లోపలికి ప్రవేశించకుండా ముళ్లకంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన నిఘా పెట్టారు. దీంతో జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు ప్రస్తుతం పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి వెళ్లడంతో అక్కడ యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. తమ పంటలను కాపాడుకోవడానికి నీళ్లు ఇచ్చే వరకు వెనక్కి తగ్గేదే లేదని రైతులు స్పష్టం చేస్తుండటంతో, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## భవాని మాత దర్శనానికి తుల్జాపూర్ పాదయాత్ర



**నిజాంపేట్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** నిజాంపేట్ మండల కేంద్రంలోని బల్కం చెక్క (భక్తిదాం తాండా)లో భవాని దీక్షలు చేపట్టిన భక్తులు తుల్జాపూర్ భవాని మాత దర్శనానికి 11 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. విశ్వపాలిని జ్వాలాముఖి సమాధానం మహామందిర ధర్మకర్త మండలి ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఆనవాయితీలో భాగంగా భక్తులు భవాని మాత నామస్మరణ చేస్తూ భక్తిశ్రద్ధలతో పాదయాత్రగా బయలుదేరారు. తుల్జాపూర్ చేరుకున్న భక్తులు భవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తిరిగి మందిరానికి చేరుకున్నారు. పాదయాత్ర సందర్భంగా తాండాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## రాజోలి అభివృద్ధిపై ఎంపీ అరుణకు వినతి



**రాజోలి, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన రాజోలి గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంధ్య శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆదివారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా గ్రామం గుండా వెళ్తున్న భారత్‌మాల జాతీయ రహదారికి సంబంధించి సర్వీస్ రోడ్ల నిర్మాణం, వాహనాల రాకపోకల కోసం ఎంట్రీ,ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేయాలని వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు త్వరితగతిన పూర్తి నష్టపరిహారం చెల్లించేలా చూడాలని కోరారు.దీంతో పాటు గ్రామంలో యువతీయువకుల కోసం క్రీడా మైదానం సౌకర్యాన్ని కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం గ్రామంలో ప్రత్యేక నిధులు కేటాయించి, మౌలిక వసతులను పెంపొందించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంపీ డీకే అరుణ.. వెంటనే సంబంధిత నేషనల్ హైవేస్ మరియు రెవెన్యూ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. నిబంధనల ప్రకారం రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, సర్వీస్ రోడ్లు మరియు ఇతర మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, గోవర్ధన్రెడ్డి, స్థానిక రైతులు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి సీఎం సహాయనిధి అండ

- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- మాజీ జెడ్పీటీసి పైతర మీనాక్షి



**మునిపల్లి, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** పేదల వైద్యానికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని మునిపల్లి మాజీ జెడ్పీటిసి పైతర మీనాక్షి బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మునిపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ కారణాలతో చికిత్సలు పొందుతున్న వారికి సీఎం సహాయ నిధి ఆసరాగ నిలుస్తుందని వారు తెలిపారు. మెదక్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో గత ఏడాది నుంచి మునిపల్లి మండలంలో సుమారు 150 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేద ప్రజలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు గడ్డం భాస్కర్, కుమ్మరి శేఖర్, మల్లికార్జునపల్లి సర్పంచ్ మల్లేశం, మాజీ సర్పంచులు అంతారం శంకర్, పైతర మొగులయ్య, మేతరి మానయ్య, బోయిని సంగమేశ్వర్, దత్తు ముదిరాజ్, మల్లికార్జున్, నాయకులు భద్రప్ప, పాండు, నక్క బుచ్చన్న, వివిధ గ్రామాల వార్డు సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా లో గణేష్ పండుగ, తాఖీ బాబా దర్గా ఉర్సు వేడుకలు ప్రశాంతంగా, సోదరభావం తో,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత విశ్వాసాలు, కులాలు, వర్గా లు, మత పెద్దలు లేదా ఇత ర సముదాయాలను కించ పరిచేలా, అవమానించేలా,రెచ్చగొట్టేలా సోషల్ మీడి యాలో పోస్టులు, కామెం ట్లు, వీడియోలు, ఫొటోలు లేదా మార్ఫింగ్ చేసిన చిత్రా లను ప్రచారం చేయడం, ఫార్వర్డ్ చేయడం చట్ట రీత్యా నేరమని స్పష్టం చేశారు.జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ అధికారులు నిరం తరం సోషల్ మీడియాను పర్యవేక్షిస్తున్నారని తెలి పారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే ఉద్దే శంతో తప్పుడు సమాచా రం, పాత వీడియోలు, వదంతులు లేదా అభ్యం తరకరమైన కంటెంట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

మతపరమైన భావోద్వేగా లను దెబ్బతీసే పోస్టులు చేయవద్దు.ఇతర మతా లు, వర్గాలను కించపరిచే వ్యాఖ్యలు, మీమ్స్, వీడియోలు, ఫొటోలు షేర్ చేయవద్దు.మత విద్వేషాలను రెచ్చగొట్టే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమాచారాన్ని ఫార్వర్డ్ చేయవద్దు. నిజానిజాలు నిర్ధారించుకోకుండా ఎలాం టి వార్తలు, వీడియోలు,ఆడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దు అన్నారు. ఇతరులు చేసిన అభ్యంతర కర పోస్టులను లైక్, షేర్, ఫార్వర్డ్ చేయడం ద్వారా వాటి ప్రచారానికి సహక రించవద్దు.సోషల్ మీడియా లో నకిలీ ఖాతాలు, మార్ఫింగ్ ఫొటోలు,తప్పు డు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు, మతపరమైన విద్వేషాన్ని పెంచే కంటెం ట్పై ప్రత్యేక నిఘా కొనసా గుతోందని ఎస్పీ తెలిపారు.ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాను ఉపయోగిస్తే, వారి పోస్టుల ఆధారంగా సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాం టి ఉపేక్ష ఉండదు అని ఎస్పీ స్పష్టం చేశారు.

# అసంపూర్తి ప్రాజెక్టులకు బీఆర్ఎస్‌దే బాధ్యత

- కేటీఆర్‌కు వాస్తవాలు మాట్లాడే ధైర్యం ఉందా..?
- గత పాలనలో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి
- చేయలేక పోయారో సమాధానం చెప్పాలి
- విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** గత బీఆర్ఎస్ పాలనలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రాజెక్టులకు బాధ్యత ఎవరిదో ముందుగా బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వదిలేసిన నాయకులు.. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పనులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని వంశీకృష్ణ అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు, అనుమతులు, పెండింగ్ అంశాలు, ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై అధికారికంగా వివరాలు వెల్లడిస్తున్నప్పటికీ రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో గత ప్రభుత్వం చేపట్టిన పనుల పరిస్థితి ఏమిటి? ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని ఎందుకు పూర్తి చేయలేకపోయారు? అనే అంశాలపై కేటీఆర్ ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.ప్రాజెక్టులపై రాజకీయ విమర్శలు చేయడం సులభమే కానీ అధికారంలో ఉన్నప్పుడు వాటిని ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు చెప్పే బాధ్యత కూడా బీఆర్ఎస్ నాయకులదే అని వంశీకృష్ణ అన్నారు. వాస్తవాలను ప్రజల ముందుంచకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కేటీఆర్ నిన్న పాలమూరు ప్రాంత పర్యటనలో రైతుల విద్యుత్, సాగునీటి సమస్యలతో పాటు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రాజెక్టు పనుల్లో మిగిలిన భాగాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వంశీకృష్ణ స్పందిస్తూ.. గత బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టుల పురోగతి, ప్రస్తుతం జరుగుతున్న పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.ప్రజలకు



అవసరమైన అభివృద్ధి పనులపై నిర్మాణాత్మకంగా సూచనలు చేయకుండా కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావడం వల్ల ప్రయోజనం లేదన్నారు. గత పాలనలో తీసుకున్న నిర్ణయాలు, ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని కోరారు.అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రాజెక్టులకు బాధ్యత ఎవరిది? ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? ఎందుకు పనులు పూర్తి కాలేదు? అనే ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పాలని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. వాస్తవాల ఆధారంగా మాట్లాడితే ప్రజలు కూడా విషయాలను అర్థం చేసుకుంటారని, రాజకీయ ఆరోపణలతో ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరికాదని అన్నారు.విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సునేంద్ర కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నిరంజన్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, రంగాపూర్ దర్గా చైర్మన్ రఫీతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంజీఎం ఆస్పత్రిలో దారుణం

- పై కప్పు ఊడిపోయి ముగ్గురికి గాయాలు
- చికిత్స పొందుతున్న పేషెంట్లు





వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 20(జనం సాక్షి) : వరంగల్ నగరంలో మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రి ( ఎంజీఎం) లోనీ ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పైకప్పు (కార్డు బోర్డు) ఊడి పడిన సంఘటన ఆదివారం తోటి చేసుకుంది. ఈ క్రమంలో పెరాలసిస్ వ్యాధితో చికిత్స పొందుతున్న మస్తాన్ (55), అటెండర్స్ ఎల్లమ్మ (50), ఓంకార్ (33) లకు గాయాలు. బాధితులు ఘన్ పూర్ నియోజకవర్గం, జఫర్గడ్ మండలం ఉప్పుగల్ కి చెందిన వారిగా గుర్తింపు. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు. హఠాత్తుగా కార్డ్ బోర్డు ఊడిపడటముతో పేషెంట్లు ఆందోళనకు గురవడం కనిపించింది. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు, నిర్వాహకులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.


# తమ్ముడిని కత్తితో పొడిచి హత్య

- అన్నదమ్ముల మధ్య ఘర్షణ..
- నిందితుడి కోసం ప్రత్యేక బృందాల గాలింపు



గీసుకొండ,సెప్టెంబర్ 20 (జనం సాక్షి) : అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు కత్తిపోట్లకు గురై మృతిచెందిన ఘటన గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గరీబ్‌నగర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..గరీబ్‌నగర్‌కు చెందిన ఎలుబాక ప్రసాద్(31), వెల్డింగ్ పని చేసుకుంటూ తల్లి సుజాతతో కలిసి నివసిస్తున్నాడు.ప్రసాద్ అన్న ఎలుబాక ప్రవీణ్ (32), వివాహానంతరం భార్య, పిల్లలతో కలిసి కీర్తినగర్‌లో నివసిస్తున్నాడు. కుటుంబపరమైన కారణాలతో ప్రవీణ్ అప్పుడప్పుడు గరీబ్‌నగర్‌కు వచ్చి తమ్ముడు ప్రసాద్‌తో గొడవపడేవాడని పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో శనివారం రాత్రి ప్రసాద్ ఇంటి వద్దకు వచ్చిన ప్రవీణ్ అతడితో గొడవపడి కత్తితో వీపు,ఎడమ ఛాతి,ఎడమ భుజంపై పొడిచాడు.తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.క్లూస్‌టీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. పరారీలో ఉన్న నిందితుడు ప్రవీణ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ తెలిపారు.నిందితుడిని త్వరలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

# చేయూతలో చేతివాటం..




- పైసా ఇస్తేనే పెన్షన్ వస్తుందా?
- దరఖాస్తుదారులతో కొందరు పంచాయతీ సిబ్బంది బేరసారాలు

కెరమెరి, సెప్టెంబర్ 20(జనంసాక్షి) : కెరమెరి మండలంలో చేయూత పెన్షన్లు పేదోళ్లకు వరం కావాల్సింది పోయి, కొందరు పంచాయతీ సిబ్బందికి కాసుల పంటగా మారింది. అర్హుల ఇళ్లకు వెళ్లి వెరిఫికేషన్ చేయాల్సిన సిబ్బంది, "మీ పేరు ఆన్లైన్లోకి ఎక్కించా! కాస్త ఖర్చు అవుద్ది" పెన్షన్ వచ్చిన వెంటనే 1000 నుంచి 2000 చొప్పున ఇవ్వాలి.అంటూ బేరసారాలు మొదలుపెట్టారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వితంతువులు, ఒంటరి మహిళలు, వయసు మళ్లిన అవ్వలే టార్గెట్. "అమ్మా, నీ పెన్షన్ సంగతి నేను చూసుకుంటా, ఓ ఐదొందలు ఇయ్యి" అంటూ కొందరు పంచాయతీ వర్కర్లు వసూళ్లకు దిగారని బాధితులు బయటకు చెప్పలేక లోలోపల రగిలిపోతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే నమోదు అదేమోనని ఆందోళన, డబ్బులు ఇవ్వనోళ్లకు "నీ ఆధార్ సరిలేదు, నీ సర్టిఫికెట్ గడువు ముగిసింది" అంటూ మెలికలు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న పథకాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాపై ఎంపీడీవో, కలెక్టర్ జోక్యం చేసుకొని, ప్రతి గ్రామంలో విచారణ జరిపి పైరవీకారులుగా చలామణి అవుతున్న కొందరు పంచాయతీ సిబ్బంది పీచమణచాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఓపెన్ కాస్ట్ హఠావో- రామప్ప బచావో!

- వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు ప్రయత్నాలు
- రామప్ప,పర్యావరణ పరిరక్షణకై మరో ఉద్యమానికి సిద్ధం





వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్ 20 (జనం సాక్షి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ప్రతిపాదించిన పీవీఎన్ఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును రద్దు చేసి యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప ఆలయాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఓపెన్ కాస్ట్ హఠావో – రామప్ప బచావో.. అనే నినాదంతో మండలంలోని ప్రజలు, ప్రజా సంఘాలు,రామప్ప పరిరక్షణ సమితితోపాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. రామప్ప ఆలయానికి కేవలం 6 కి.మీ దూరంలోనే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని తవ్వకాలు చేపడితే, బ్లాస్టింగ్ ల వల్ల రామప్ప ఆలయం దెబ్బ తినడంతోపాటు 800 ఏళ్ల చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సింగరేణి అధికారులు చెబుతున్న కంట్రోల్డ్ బ్లాస్టింగ్, నాన్–ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 500 మీటర్లకే వైబ్రేషన్ అనే మాటలను స్థానిక ప్రజలు నమ్మటం లేదు. ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల వల్ల అక్కడ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతోపాటు దుమ్ము, ధూళితో పంటలు, ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నట్టుగా ఇక్కడ సైతం అలాంటి పరిస్థితిలే తలెత్తుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా కలెక్టర్ ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రాజెక్టుకు ఎన్ వోసీ ఇవ్వవద్దని, అలా కాదని ఎన్ వోసీ ఇచ్చినట్లయితే గ్రామాల్లో చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకొని తీరుతామని వారు హెచ్చరిస్తున్నారు. 2.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి పేరుతో 19 ఏళ్ల పాటు ఇక్కడ తవ్వకాలు జరిపితే వెంకటాపూర్ మండలం మొత్తం కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రపంచ వారసత్వ సంపద కలిగి చరిత్ర పుటల్లో నిలవడంతో పాటు యూనెస్కో గుర్తింపు పొందిన రామప్ప దెబ్బ తినడంతో పాటు పర్యాటకానికి తీవ్ర విఘాతం కలుగుతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

రామప్పను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని, బొగ్గు కోసం చరిత్రను తవ్వి పూడ్చవద్దని, వెంటనే ఓపెన్ కాస్ట్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని స్థానికులతోపాటు పలువురు ప్రభుత్వం, అధికారులను డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రామప్ప పరిరక్షణ పేరుతో ఓపెన్ కాస్ట్ హఠావో... రామప్ప బచావో...అనే నినాదంతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రామప్ప దేవాలయాన్ని కాపాడుకోవడంతోపాటు భూగర్భ జలాలను, పర్యావరణాన్ని సైతం కాపాడుకోవాల్సిన బాధ్యత వెంకటాపూర్ మండల ప్రజలందరి పైన ఉంది. ఓపెన్ కాస్ట్ బొగ్గు గని మూలంగా రామప్పకు ఎలాంటి ప్రమాదం ఉండదని సింగరేణి అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రజలు మాత్రం ఆ అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఒక ప్రమాద గనిగానే భావిస్తున్నారు. అందులో భాగంగానే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని పై ప్రజల్లో వ్యతిరేకత భావం ఏర్పడుతుంది. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి మరీ..!

# భార్యాభర్తల పంచాయితీ

- పోలీస్ స్టేషన్ ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకున్న వ్యక్తి
- కౌన్సిలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు
- మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ వద్ద ఇది రెండో ఘటన




వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) : వరంగల్ నగరంలోని ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ వద్ద భార్యాభర్తల పంచాయితీ లో భాగంగా స్టేషన్ వద్ద ఒంటిపై డీజిల్ పోసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ నగరంలోని ఉరుసు ప్రాంతానికి చెందిన వేల్పుగొండ స్రవంతి అనూప్ భార్యాభర్తలు. వీరికి 13 సంవత్సరాల క్రితం వివాహం జరుగుతుంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తరచుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. తాజాగా వీరిమధ్య గొడవ జరుగుతున్న క్రమంలో 112 డయల్ కాల్ రావడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వచ్చారు. కానీ సదర్ భార్యాభర్తలతో పాటు పిల్లలు, అత్త మామ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ రావడం జరిగిందని ఈ క్రమంలో అనూప్ తనతో తెచ్చుకున్న డీజిల్ను ఒంటిపై పోసుకోవడం జరిగింది. ఇది గమనించిన పోలీసులు వెంటనే అడ్డుకొని నీళ్లు చల్లి ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు ఇన్స్పెక్టర్ వివరించారు. భార్యాభర్తల సమస్యలు ఉంటే ఉమెన్ పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కూడా ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఇదే పోలీస్ స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం, ఆ తరువాత అతను చికిత్స పొందుతూ చనిపోవడం కూడా జరిగిన సంగతి తెలిసిందే.

# ప్రకృతి ఒడిలో సంప్రదాయ విందు





- విస్తరాకుల్లో వినాయకుడి అన్నదానం
- ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి అడవి ఆకులతో భోజనాలు వడ్డిస్తున్న ఆదివాసీలు

జైనూర్, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) : మండలకేంద్రం లో పట్నాపూర్ గ్రామం లో వినాయక నిమజ్జనం వేళ ఆదివాసీ పల్లెలు ప్రకృతితో మమేకమైన తమ ప్రత్యేక సంస్కృతిని చాటుకుంటున్నాయి. ఆధునిక కాలంలో విస్తృతంగా వాడుతున్న ప్లాస్టిక్ ప్లేట్లను పూర్తిగా పక్కనబెట్టి, పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయ పద్ధతిలోనే స్వామివారి భోజన వితరణ అన్నదానం చేపడుతున్నారు. అడవుల నుంచి సేకరించిన మద్ది ఆకులు, మోదుగ ఆకులు, విస్తరాకులను స్వయంగా కుట్టి, అందులోనే భక్తులకు భోజనాలు వడ్డించడం ఇక్కడి విశేషం. అడవిలో లభించే ఆకులతో తయారుచేసిన విస్తర్లు ఆరోగ్యానికి ఎంతో మేలని, పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని గ్రామ పెద్దలు తెలిపారు. ఐక్యతతో వంటావార్పు. గ్రామంలోని , యువకులు పెద్ద లు,కలిసి స్వయంగా ఆకులు కుట్టడం నుంచి వంటలు చేయడం వరకు ఉమ్మడిగా పాల్గొని వినాయకుడి అన్నదానాన్ని నిర్వహించారు. సంప్రదాయ వంటకాలతో పాటు పవిత్రమైన నైవేద్యాలను ఆకులలో వడ్డించి అందరికీ పంచిపెట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కలుషితమవుతున్న నేటి రోజుల్లో, ఆదివాసీలు పాటిస్తున్న ఈ ఆకు భోజన సంప్రదాయం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు కొనియాడారు.




## బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న నేతాజీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయురాలు


సారంగాపూర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) : ఈనెల 18వ తేదీన ట్రస్మా నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ కు ఎంపికైన సారంగాపూర్ మండలం నేతాజీ పబ్లిక్ స్కూల్ కౌట్ల బి గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయురాలు జంగిటి మంగ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా బెస్ట్ టీచర్ అవార్డ్ అందుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, కరస్పాండెంట్ కిష్టయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు




బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) : బెల్లంపల్లి మండలం సోమగూడెం త్రినేత్రి ఫంక్షన్ హాల్లో ఆదివారం 6వ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను సింగరేణి మందమర్రి జీఎం రాధకృష్ణ, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కమిటీ అధ్యక్షుడు మల్లేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి చిన్నారుల పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్న మాస్టర్ రవిని అభినందించారు.

## గణేష్ మండపాలను సందర్శించిన సీపీ



బెల్లంపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) : బెల్లంపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆదివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మండపాల వద్ద శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్, బెల్లంపల్లి పట్టణ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిశ్శబ్దంగా నశించిపోతున్న సహజ వనరులు

- నివేదికలకే పరిమితమైన హెచ్చరికలు...
- ఆగుతుందా ఈ అక్రమ తవ్వకాల 'మొరం' దందా?
- మైనింగ్ శాఖ ఇకనైనా మేల్కొనేనా?



ఖానాపూర్ సెప్టెంబర్ 20 (జనం సాక్షి) : మనుషుల ప్రాథమిక అవసరాలకు తోడ్పడాల్సిన ఇసుక, మొరం వంటి సహజ వనరులు నేడు కొంతమంది స్వార్థపరుల, అక్రమ ముఠాల చేతుల్లో వ్యాపార సరుకులుగా మారిపోయాయి. సహజ సమతుల్యతను కాపాడాల్సిన కనీస స్పృహ లేకుండా, కేవలం లాభార్జనే ధ్యేయంగా భూమాత పొట్టను గుల్ల చేస్తున్నారు. గతంలో నిర్వహించిన సర్వేలు, ప్రత్యేక అధికారుల తనిఖీల్లో భారీగా అక్రమ తవ్వకాలు జరిగినట్లు, పెద్ద పెద్ద గోతులు ఏర్పడి పర్యావరణానికి ముప్పు వాటిల్లినట్లు స్పష్టమైన నివేదికలు ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ ఆ నివేదికలు, హెచ్చరికలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో ఎలాంటి కఠిన చర్యలూ తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. ప్రజలు బాధ్యతాయుతంగా అక్రమ తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలోని కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, ఫిర్యాదుదారుల వివరాలను, సమాచారాన్ని తిరిగి అక్రమార్కులకే చేరవేస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారుల జవాబుదారీతనానికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. నియంత్రణ లేని తవ్వకాల వల్ల భూగర్భ జలాలు ఇంకిపోవడం, భూకోతకు గురికావడం, పెద్ద గోతుల వల్ల వర్షాకాలంలో ప్రమాదాలు జరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. స్థానిక ప్రజలు తమ ప్రాంతాన్ని కాపాడుకోవాలని చూస్తున్నా, మాఫియా భయంతో అధికారుల అసహకారంతో ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖల ఆధ్వర్యంలో నివేదికలు సిద్ధం చేయడమే కాకుండా అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలపై తక్షణమే విచారణ జరిపి వాహనాలను, మైనింగ్ పరికరాలను జప్తు చేసి, ప్రకృతిని ధ్వంసం చేసే ముఠాలపై చట్టపరమైన నాన్–బెయిలబుల్ కేసులు నమోదు చేసి, భారీ జరిమానాలు విధించాలి. ఫిర్యాదు చేసే స్థానిక ప్రజల వివరాలు రహస్యంగా ఉంచేలా ప్రత్యేక టోల్–ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలి. మాఫియాతో చేతులు కలిపి సమాచారాన్ని ముందే చేరవేసే శాఖాపరమైన వారిని గుర్తించి, వారిపై తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## బీరంగూడ మల్లన్న సన్నిధిలో సినీ, టీవీ తారల సందడి



**అమీన్పూర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** బీరంగూడ గుట్టపై కొలువుదీరిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం సినీ, టీవీ రంగానికి చెందిన ప్రముఖులు సందడి చేశారు. ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కుమారుడు, యువ హీరో ఆకాష్ పూరితో పాటు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' షో ఫేమ్ సిద్ధు, సోనియా ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న సినీ, టీవీ తారలకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి విశేష అభిషేకాలు, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపిన వారు స్వామివారి ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ఈవో దేవనాదం, ఆలయ చైర్మన్ సుధాకర్ సినీ, టీవీ తారలను ఘనంగా సన్మానించారు. స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆకాష్ పూరి, సిద్ధు, సోనియా మాట్లాడుతూ బీరంగూడ మల్లన్నను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయంలోని ప్రశాంతమైన వాతావరణం, స్వామివారి దర్శనం తమకు ఎంతో మానసిక ప్రశాంతతను కలిగించిందని పేర్కొన్నారు.

## పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 20 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఉర్లదాసుపాడు గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం, గాలివానకు పిడుగుపడి రెండు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గుండి దేవయ్య, మడకం వీరమయ్యకు చెందిన ఆవుల విలువ సుమారు రూ.60--70 వేల వరకు ఉంటుందని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆర్థికంగా పశువులపైనే ఆధారపడుతున్న ఆదివాసీ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. పశువులకు పోస్టుమార్టం నిర్వహించారని, సంబంధిత నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపి బాధితులకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వర్షాల కోసం సామూహిక ప్రార్థనలు



**కోదాడ, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** పట్టణంలోని సాలార్జంగ్‌పేట ఈద్గా వద్ద ముస్లింలు వర్షాల కోసం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా, దేశంలో పలు ప్రాంతాల్లో వర్షాకాల పరిస్థితులు అతివృష్టి, అనావృష్టి రూపంలో నెలకొని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా రైతులు వర్షాభావం, అధిక వర్షాల కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యల భారీ నుంచి మానవాళిని కాపాడాలని ముస్లిం ప్రార్థనలు చేశారు .రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి సాగునీరు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వారు ప్రార్థించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి మానవాళికి ఉపశమనం కలగాలని, అల్లాహ్ కృప సర్వమానవాళిపై ఉండాలని, తన చల్లని చూపుతో ప్రజలను ప్రకృతి విపత్తుల నుంచి కాపాడాలని కోరుతూ ముస్లింలు ప్రత్యేక దువా చేశారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు మరియు ముస్లింలు , తదితరులు పాల్గొన్నారు.

## రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

- సత్తాచాటిన పిర్జాదిగూడకు చెందిన అభియ షారోన్



**బోడుప్పల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. నారపల్లిలోని రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి జంప్ రోప్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు మంచి భవిష్యత్తును అందిస్తాయన్నారు. తెలంగాణ క్రీడాకారులు భవిష్యత్‌లో ఏషియన్ గేమ్స్‌లో సత్తా చాటి దేశానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.కాగా పీర్జాదిగూడ కు చెందిన చాబతుల విజయ్ బాబు, అనిత ల కుమార్తె రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ 6వ తరగతి చదువుతున్న చాబతుల అభియ షారోన్ అండర్ 11 లో ఇంజురెన్స్‌లో గోల్డ్ మెడల్, రిలే స్పీడ్‌లో గోల్డ్ మెడల్, డబుల్ అండర్‌లో సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటింది.విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి, డైరెక్టర్ శ్వేతా రెడ్డి, ప్రిన్సిపాల్ రూపా రెడ్డి, ఈవీ రమణ, స్పోర్ట్స్ ఇన్‌చార్జి సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జనానికి రెండు ప్రాంతాలే సురక్షితం

- ఎర్రగండ్లపల్లి కెనాల్, కిష్టరాంపల్లి రిజర్వాయర్ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు
- చర్లగూడెం ప్రాజెక్టు వద్ద నిమజ్జనం చేయొద్దు.. అధికారులు హెచ్చరిక



**మర్రిగూడ, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** వినాయక చవితి ఉత్సవాల అనంతరం గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మర్రిగూడ మండల ప్రజలకు అధికారులు కీలక సూచనలు చేశారు. మండలంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి యరగండ్లపల్లి( రిజర్వాయర్ ) కెనాల్ వద్ద, కిష్టరాంపల్లి రిజర్వాయర్ వద్ద రెండు ప్రాంతాలను సురక్షిత ప్రదేశాలుగా గుర్తించినట్లు మర్రిగూడ తహశీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీఓ మునయ్య,మర్రిగూడ ఎస్ఐ రాంబాబు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో భక్తులు, నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. నిమజ్జనం కోసం అధికారులు సూచించిన ఈ రెండు ప్రాంతాలను మాత్రమే వినియోగించాలని కోరారు. చర్లగూడెం ప్రాజెక్టు వద్ద ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉన్నందున అక్కడ నిమజ్జనం చేయవద్దని అధికారులు స్పష్టం చేశారు. ఇతర అనధికారిక ప్రాంతాల్లో కూడా నిమజ్జనం నిర్వహించకుండా, అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. గణేశ్ ఉత్సవ నిర్వాహకులు తమ విగ్రహాలను సురక్షితంగా సూచించిన ప్రాంతాలకు తరలించి నిమజ్జనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న అధికారులు, నిర్దేశించిన నిమజ్జన ప్రాంతాలను మినహాయించి ఇతర ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కొత్త హౌసింగ్ బోర్డ్‌లో గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** గద్వాల పట్టణంలోని 6వ వార్డు కొత్త హౌసింగ్ బోర్డ్ కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి గణేష్ ఉత్సవాల్లో పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు.గజానన మహోత్సవంలో భాగంగా గణపతి మండపంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగినది. ఎమ్మెల్యే కి గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ప్రతి సంవత్సరం జరుపుకోవాలి మట్టి వినాయకుడిని పూజించాలి పర్యావరణాన్ని కాపాడాలని అని తెలిపారు. గణేష్ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర గద్వాల నియోజకవర్గం లో రైతులకు ,దిన దిన అభివృద్ధి అభివృద్ధి చెందాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా స్వామి వారి కోరుకోవడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పి చైర్మన్ బండారి భాస్కర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్ , మాజీ ఎంపీపీలు విజయ్, రాజారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్స్ తుమ్మల నరసింహులు యాదవ్ , మురళి, నాయకులు రమేష్ రెడ్డి, అజయ్, మైలగడ్డ చంద్రశేఖర్, కొత్త గణేష్,రైల్వే సతీష్, లక్ష్మయ్య శెట్టి , హెల్త్ శ్రీనివాసులు, తరికి గోపాల్, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**కనగల్లు, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** రైతులను హరిగోశపెట్టి ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడడం సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మన్నగూడెం తేలకంటి గూడెం గ్రామాలలోని విద్యుత్ కోతలతో ఎండిపోయిన వరి పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముకని రైతు లేనిదే రాజ్యం లేదని ఆరుగాలం శ్రమించి పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్ళముందే ఎండిపోతుంటే రైతన్న బాధ వర్ణనాతీతం అని గుర్తు చేశారు. మిగులు విద్యుత్తు ఉన్న రాష్ట్రంలో ప్రభుత్వ పాలకుల అసమర్థ తవ్వాలని 24 గంటల విద్యుత్తు సరఫరాను 12 గంటలకు కుదించి ఆ విద్యుత్ సరఫరాను కూడా సకాలంలో ఇవ్వక గంటకు కోతలు విధించడంతో రైతులు ఉమ్మడి రాష్ట్రంలో పడ్డ బాధలే గుర్తుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యలపై ఎక్కడ ప్రశ్నిస్తారు అని తెలిసి అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేస్తున్నారని ఇదంతా దాష్టికమైన పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని తెలియజేశారు. మాజీ ఎంపీపీ కరీం పాషా మండల పార్టీ అధ్యక్షులు అయితే గొని యాదయ్య గౌడ్ జిల్లా నాయకులు గోన రవీందర్రావు తేలకంటి గూడెం మాజీ సర్పంచ్ బైరగోని ఎంకన్న మరి రేణుక తదితరులున్నారు.

## లారీని ఢీకొన్న ఆటో

- ఒకరి మృతి
- ముగ్గురికి గాయాలు..
- సారపాక ఐటీసీ సమీపంలో ఘటన



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 20 (జనంసాక్షి) :** యూటర్న్ తీసుకుంటున్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడిన విషాద సంఘటన సారపాక ఐటీసీ ఈస్ట్ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పినపాక మండలం టీకొత్తగూడెం గ్రామానికి చెందిన దొడ్డా వెంకటేశ్వర్లు (55) ఆటోలో భద్రాచలం వచ్చి బ్లడ్ శాంపిల్స్ ఇచ్చి, అనంతరం ముసలిమడుగులోని తన కుమార్తె వద్దకు వెళు_న్నారు. ఈ క్రమంలో సారపాక ఐటీసీ ఈస్ట్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న లారీని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ ఆంగోతు శ్రీకాంత్, గద్దెల శివకుమార్, మరో వ్యక్తి గాయాల పాలయ్యాడు. క్షతగాత్రులను చికిత్స కోసం భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటేశ్వర్లు మృతిచెందారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు సుకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మేడా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గణేష్ మండపాలను సందర్శించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) : మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులంతా సుఖసంతోషాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే టోకల శ్రీనివాస్ రెడ్డి, మణికొండ డివిజన్ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి, విగ్నేష్ మహారాజ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జొన్నాడ సిద్ధప్ప, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు చిలుకూరి బీరప్ప తదితరులు పాల్గొన్నారు. మణికొండ డివిజన్‌లోని గణేష్ మండపాలను మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి సందర్శించి గణనాథుడిని దర్శించుకున్నారు. హుడా కాలనీలోని గణేష్ మండపం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు, వారి కుటుంబాలపై గణనాథుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మణికొండ డివిజన్ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు చిలుకూరి బీరప్ప, మాజీ కోఆప్షన్ సభ్యుడు జొన్నాడ సిద్ధప్ప, మాజీ వార్డు సభ్యుడు ధనల రాజేష్, పి. మధు తదితరులు పాల్గొన్నారు.

## గొంతు నులిమి వృద్ధురాలి హత్య

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ..?



**అశ్వాపురం, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం తుర్రం వారిగూడెం గ్రామంలో జర్పుల సువాలి (60) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను గొంతు నులిమి హత్య చేసి, ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీ రాత్రి సువాలి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో అశ్వాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అశ్వాపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాము. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. సువాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.సువాలి మృతి అత్యంత బాధాకరమని తుర్రం వారిగూడెం ఉపసర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ అన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అల్వాల్ కొత్త చెరువులో నిమజ్జనాల సందడి

**అల్వాల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** వినాయక నిమజ్జనాలతో అల్వాల్‌లోని కొత్తచెరువు పరిసరాలు ఆదివారం సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వినాయక విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేస్తున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి వీడ్కోలు పలికారు. నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రెండు క్రేన్ల సహాయంతో విగ్రహాల నిమజ్జనం కొనసాగుతోంది. అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ భోగేశ్వరులు, సీఐ ప్రశాంత్, ఎస్ఐ రాఘవేందర్‌రెడ్డి, డీఈ మహేష్, ఎస్ఎస్ ప్రభాకర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

# గణేష్ శోభాయాత్రలో విషాదం

- నృత్యం చేస్తూ యువకుడు మృతి
- మృతుని కుటుంబానికి సర్పంచ్ రూ.10 వేల ఆర్థిక సాయం

**తిరుమలగిరి (సాగర్), సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో విషాద ఘటన జరిగింది. మండల కేంద్రానికి చెందిన సింగారపు బాలయ్య (రాము) శోభాయాత్రలో నృత్యం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు చికిత్స నిమిత్తం హాలియాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### కుటుంబంలో వరుస విషాదాలు

బాలయ్య అన్నయ్య కూడా ఏడాది క్రితం ఓ శుభకార్యంలో భోజనం చేస్తుండగా ఆహారం గొంతులో ఇరుక్కొని ఊపిరాడక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాజాగా బాలయ్య మృతి చెందడంతో ఒకే కుటుంబంలో వరుస విషాదాలు చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### రూ.10 వేల ఆర్థిక సాయం

బాలయ్య మృతి విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ సైదులు యాదవ్ ఆదివారం మృతుని ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. తిరుమలగిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.






# ఈ వారమూ ఐపీఓల క్యూ

## 6 పబ్లిక్ ఇష్యూలు.. రూ.3,825 కోట్లు




ఈ వారం కూడా దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఇష్యూ సందడి కొనసాగనుంది ఆరు కంపెనీలు దాదాపు రూ.3,825 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 28 మధ్య ఐపీఓకు వస్తున్నాయి. ఎలివేట్ క్యాంపసెస్, వర్మోరా గ్రానిటో వంటి కంపెనీలు ఇందులో ఉన్నాయి. ఐపీఓ నిధులను మూలధన వ్యయం, వ్యాపార విస్తరణ, రుణాల చెల్లింపులు వంటి అవసరాల కోసం ఆయా కంపెనీలు వినియోగించనున్నాయి.ఆరు ఐపీఓలు ఇవే..

హిల్‌హౌస్ ఇన్వెస్ట్‌మెంట్ మద్దతు ఉన్న ఎలివేట్ క్యాంపసెస్ ఈ వారంలో వచ్చే అతిపెద్ద ఐపీఓ. రూ.2,100 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 23న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 25న ముగియనుంది. ధరల శ్రేణి రూ.343 -362గా కంపెనీ నిర్ణయించింది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నారు.టైల్స్, బాత్‌వేర్ తయారీ కంపెనీ వర్మోరా గ్రానిటో రూ.708 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.140-148గా కంపెనీ నిర్ణయించింది. సెప్టెంబర్ 22న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 24న ముగియనుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఏ-వన్ స్టీల్స్ ఇండియా లిమిటెడ్ రూ. 405 కోట్ల నిధులను సమీకరించేందుకు ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.385- 405గా నిర్ణయించింది. సెప్టెంబర్ 24న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 28న ముగియనుంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన ఆర్మీ ఇన్ఫోటెక్ రూ.300 కోట్ల నిధుల సమీకరణతో ఐపీఓకు వస్తోంది. సెప్టెంబర్ 23-25 మధ్య సబ్‌స్క్రిప్షన్ ఉంది. ఒక్కో షేరు ధర రూ.350-375గా కంపెనీ నిర్ణయించింది. కంపెనీ తాజా షేర్లను మాత్రమే విక్రయించనుంది.ఈపీసీ సొల్యూషన్ ప్రొవైడర్ కంపెనీ స్వస్తిక ఇన్‌ఫ్రా రూ.161 కోట్లు నిధుల సమీకరణతో ఐపీఓకు వస్తుంది. ధరల శ్రేణి రూ. 175- 185గా కంపెనీ నిర్ణయించింది. సెప్టెంబర్ 23-25 మధ్య సబ్‌స్క్రిప్షన్ ఉంది. అడ్రాయిట్ ఇండస్ట్రీస్ (ఇండియా) రూ.151 కోట్ల నిధుల సమీకరణతో సెప్టెంబర్ 23న ఐపీఓకు వస్తుంది. ధరల శ్రేణి రూ.126- 134గా కంపెనీ నిర్ణయించింది సెప్టెంబర్ 23న హీరో మోటార్స్, ఎస్ఎస్ రిటైల్స్, జిందాల్ సుప్రీం కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి. సెప్టెంబరు 24 ఎన్ఎస్ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో లిస్టింగ్‌కు రానున్నాయి.

## మారుతీ ఆటోమేటిక్ ఎస్-సీఎన్‌జీ ధరలు రూ.7.928.53 లక్షలు

దిల్లీ: ముడి చమురు ధరల పెరుగుదల, సీఎన్‌జీ వేరియంట్లలో ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ప్రవేశపెట్టడం వంటి సానుకూలతల నేపథ్యంలో, మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో 10 లక్షల హరిత వాహనాల (సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీ) విక్రయాలను లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో 8-9 లక్షల పర్యావరణ హిత వాహనాల విక్రయాలు జరుగుతాయని గతంలో కంపెనీ అంచనా వేసింది. కొత్తగా ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ మోడళ్లను ప్రవేశపెట్టడంతో ఇప్పుడు ఈ అంచనాను 10 లక్షలకు పెంచినట్లు సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ వెల్లడించారు. ఆటో గ్రీన్ మిషన్ కింద స్విఫ్ట్, డిజైర్, బాలెనోల ఆటోమేటిక్ ఎస్-సీఎన్‌జీ వేరియంట్లను శుక్రవారమే సంస్థ విడుదల చేసింది. తాజాగా వాటి ధరలు ప్రకటించింది. డిజైర్ ఆటోమేటిక్ ఎస్-సీఎన్‌జీ పరిచయ ధర రూ.8.53 లక్షలు, స్విఫ్ట్ ఆటోమేటిక్ ఎస్-సీఎన్‌జీ ధర రూ.7.92 లక్షలు, బాలెనో ఆటోమేటిక్ ఎస్-సీఎన్‌జీ ధర రూ.8.32 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించింది.



**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 1,62,254 (22 క్యారెట్లు)
₹ 1,77,008 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000




## గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్ తేదీ ప్రకటించిన అమెజాన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
పండగ ఆఫర్ల కోసం ఎదురు చూస్తున్నారా? అయితే గుడ్‌న్యూస్. ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026' సేల్ తేదీని ప్రకటించింది. అక్టోబర్ 8 నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. మరో ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ కూడా 'బిగ్ బిలియన్ డేస్ 2026' సేల్ తేదీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది అక్టోబర్ 9న రాబోతుంది. పండగ సీజన్‌లో భాగంగా ఫ్లిప్‌కార్ట్ సేల్ కంటే ఒక్కరోజు ముందుగానే అమెజాన్ సేల్ రావడం గమనార్హం. ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ మెంబర్లకు అక్టోబర్ 8నే సేల్ ప్రారంభమవుతుంది.గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందిస్తామని అమెజాన్ తన మైక్రోసైట్‌లో పేర్కొంది. ప్రైమ్ మెంబర్లకు 10 శాతం వరకు అదనపు ఆఫర్లు ఉంటాయని తెలిపింది. సేల్ ఎప్పటివరకు అనేది మాత్రం వెల్లడించలేదు. 8 పీఎం డీల్స్, బ్లాక్ బస్టర్ డీల్స్, టాప్ 100 డీల్స్, మెగా డీల్స్ పేరుతో పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఆఫర్ల వివరాలు సేల్ తేదీ దగ్గర పడే కొద్ది వెల్లడికానున్నాయి.

## పోర్షేలో 4,000 ఉద్యోగాల కోత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పోర్షే కార్ల సంస్థలో మరో 4,000 మంది ఉద్యోగుల తొలగింపునకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఒక జర్మనీ పత్రిక వెల్లడించింది. ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ చేపడుతున్న భారీ పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా పోర్షే బ్రాండ్‌లో సుమారు 4,000 మంది ఉద్యోగులను తగ్గించాలని ప్రతిపాదించింది. సంస్థలో 700 మిలియన్ యూరోల (803.8 మి. డాలర్లు/సుమారు రూ.7,600 కోట్లు) ఓవర్‌హెడ్ లోటును అధిగమించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చైనా విపణిలో అమ్మకాలు పడిపోవడం, విద్యుత్ వాహనాల వ్యూహంలో ఎదురైన ఇబ్బందుల వల్ల కంపెనీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తాజా ఉద్యోగాల కోతలు గతంలో కుదిరిన ఒప్పందాలకు అదనంగా ఉండనున్నాయి. గత జులైలో యాజమాన్యం, కార్మిక ప్రతినిధులు 9,000 ఉద్యోగాల తొలగింపునకు అంగీకరించిన సంగతి తెలిసిందే.

## రూ.7,000-10,000 కోట్లతో పాలీసిలికాన్ పథకం



**న్యూఢిల్లీ(జనంసాక్షి** సౌర విద్యుదుత్పత్తి పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం మరో భారీ పథకానికి రూపకల్పన చేస్తోంది. సౌర పలకల (సోలార్ మాడ్యూళ్లు, సెల్స్) తయారీలో కీలకమైన పాలీసిలికాన్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రూ.7,000- 10,000 కోట్ల వ్యయంతో కొత్త పథకాన్ని తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. కనీసం 10 గిగావాట్ల పాలీసిలికాన్ ఉత్పాదక సామర్థ్యాన్ని దేశీయంగా ఏర్పాటు చేయడమే దీని ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు వెల్లడించాయి. మనదేశం ప్రస్తుతం దాదాపు 228 గిగావాట్ల సోలార్ మాడ్యూల్, 31 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. చైనా దిగుమతులపైనే ఆధారం: సోలార్ సెల్స్, మాడ్యూళ్ల తయారీకి అవసరమైన ఇంగాట్లు, వేఫర్లు తయారు చేయడానికి ఉపయోగించే హై-ప్యూరిటీ పాలీసిలికాన్ దేశీయంగా ఇంకా వాణిజ్యపరంగా ఉత్పత్తి కావడం లేదు. మనదేశం పాలీసిలికాన్ కోసం దాదాపు పూర్తిగా చైనా దిగుమతులపైనే ఆధారపడుతోంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన లక్ష్యంలో భాగంగా సౌర విద్యుత్ సామర్థ్యాన్ని 280 గిగావాట్లకు చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో స్వావలంబన సాధించేందుకు 2030 నాటికి కనీసం 30 గిగావాట్ల దేశీయ పాలీసిలికాన్ సామర్థ్యం అవసరమని అంచనా. ప్రత్యేక పథకం ఎందుకంటే: 2022 సెప్టెంబరులో ప్రకటించిన రూ.24,000 కోట్ల హై-ఎఫిషియెన్సీ సోలార్ పీఎల్ఐ పథకం రెండో విడతలో పాలీసిలికాన్ నుంచి మాడ్యూళ్ల వరకు సమీకృత తయారీకి రూ.7,575.6 కోట్లు కేటాయించారు. ఇందులో పాలీసిలికాన్ వాటా చాలా స్వల్పంగా ఉండటంతో ఆ మూడు ప్రాజెక్టుల నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. పాలీసిలికాన్ ఉత్పత్తికి ప్రతి గిగావాట్‌కు రూ.2,500 కోట్ల పెట్టుబడి అవసరం. ఒక కిలో పాలీసిలికాన్ తయారుచేయడానికి సుమారు 57 కిలోవాట్ అవర్స్ విద్యుత్ (సగటు భారతీయ కుటుంబం 18 రోజుల్లో వాడేంత కరెంట్), 80 లీటర్ల నీరు అవసరం. పాలీసిలికాన్ తయారీ ప్రత్యేక రసాయన ప్రక్రియ. దీంతో డౌన్‌స్ట్రీమ్ కంపెనీల కంటే, బలమైన రసాయన అనుభవం ఉన్న కంపెనీలను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం అవసరమని అధికారులు చెబుతున్నారు. కొత్త, పునరుత్పాదక ఇంధన శాఖ ఇప్పటికే ప్రధాన మంత్రి కార్యాలయం, ఇతర మంత్రిత్వ శాఖల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా ఈ పథకం ముసాయిదాను సరిదిద్దుతోంది. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ ఆమోదం కోసం పంపనుంది.

# పసిడికి నగదు పథకాలు

### రంగంలోకి కార్పొరేట్ సంస్థలు

**ఓ వైపు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీ ఎఫ్‌సీ)లు పాత బంగారంపై రుణాలివ్వడం భారీగా పెరు గుతుండగా.. మరోవైపు సంస్థాగత ఆభరణ తయారీ కంపెనీలు పాత బంగారానికి నగదు ఇవ్వడానికి ముం దుకొస్తున్నాయి. దీనివల్ల వినియోగదార్లకు, ఆభరణ దార్లకు ప్రయోజనమేనా? ఇప్పటిదాకా పాత బంగారాన్ని నగల దుకాణానికి తీసుకెళ్లి, ఆ వచ్చే డబ్బులకు కొత్త బంగారు నగలను కొనడం జరుగుతోంది. అయితే ఊళ్లలో చిన్న స్థాయి ఆభరణ తయారీదార్లు ప్రజల వద్ద నుంచి పాత బంగారాన్ని కొనుగోలు చేయడం సాధారణంగా జరిగేదే. ఇపుడు ఆ ధోరణి సంస్థాగత రిటెయిల్ ఆభరణ తయారీదార్లకూ పాకింది. వీరు సైతం పాత బంగారం తీసుకుని అందుకు తగ్గ నగదును వినియోగదార్ల చేతికి ఇస్తున్నారు.**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
అంతర్జాతీయంగా, దేశీయంగా పసిడి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో ఇటీవలి కాలంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్ద పసిడి రుణాలు భారీగా పెరిగాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, గృహేతర రుణాల విభాగంలో పసిడి రుణాలే అతిపెద్ద విభాగంగా మారింది. మార్చి 2024తో పోలిస్తే ఈ విభాగం 42.4% వృద్ధి చెందింది. మొత్తం గృహేతర రుణాల విభాగంలో వృద్ధి కేవలం 23% నమోదు కాగా, ఇది అంతకు రెట్టింపు కావడం విశేషం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తమ ఇతర రిటెయిల్ రుణాలతో పోలిస్తే 2025-26లో పసిడి రుణాలే అధికంగా ఇచ్చాయి. ఎన్‌బీఎఫ్‌సీల రిటెయిల్ రుణాల్లో ఇవి 17.4 శాతంగా ఉన్నాయంటే వీటి జోరు అర్థం చేసుకోవచ్చు. పాత బంగారమంతా ఇలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు వెళుతుండడానికి తోడు, దిగుమతి సుంకాలు పెరగడంతో ఆభరణ తయారీదార్ల వద్ద బంగారానికి లోటు ఏర్పడిం ది. దీంతో పసిడికి నగదునిచ్చేందుకు తెరదీశారు.

**ఏం ప్రయోజనం..**
పసిడికి నగదునివ్వడం, పాత ఆభరణాల మార్పిడి వంటి వ్యూహంతో కంపెనీలు రీసైకిల్డ్ పసిడిని పొందొచ్చు. అలాగే అధిక ధరల సమయంలోనూ వినియోగదార్లను తమ స్టోర్లకు రప్పించుకోవచ్చు. భారతీయ కుటుంబాల్లో పాత బంగారం అధికంగానే ఉంది. డిజైన్‌లు మారడం వల్ల వాటిని వాడేందుకూ ఆసక్తి చూపడం లేదు. అలాగే వినియోగదార్ల ప్రాధాన్యతలూ మారాయి. ఒక్కసారిగా ధరలు పెరగడమూ పాత బంగారం ఉన్న యజమానులకు తమ వద్ద ఉన్న పసిడి గురించి ఆలోచించేలా చేస్తోంది. ఇలా తీసుకొచ్చే నగలకు తగ్గట్లుగా లెక్కగట్టి డబ్బులు ఇస్తున్నారు. లేదంటే ఆ నగదుకు కొత్త నగలూ తీసుకున్నా ఫర్వాలేదంటున్నారు. ఇలా తీసుకున్న పాత బంగారాన్ని రిఫైనింగ్, రీసైక్లింగ్‌కు పంపుతున్నారు. దీంతో దిగుమతి చేసుకునే బులియన్‌పై పూర్తిగా ఆధారపడకుండా కంపెనీలు తమ దేశీయ రీసైకిల్ సరఫరాను బలోపేతం చేసుకుంటున్నాయి.

**సాంకేతికత తోడుగా.. స్వచ్ఛత పరీక్షలు**
పాత బంగారాన్ని షాపులకు తీసుకొచ్చే వినియోగదార్లలో విశ్వాసం కల్పించడం కీలకం. తమ బంగారానికి తగిన లెక్కగడుతున్నారా లేదా అన్న అనుమానం సహజంగానే ఉంటుంది. అయితే ఆధునిక స్వచ్ఛత సామగ్రి కారణంగా పసిడి పరీక్షలు వేగంగా అందజేయడమే కాకుండా, వినియోగదార్లకు దాని ఆధారంగా లెక్కలు కట్టడమూ సులభంగా మారింది. విశ్వసనీయతకూ ఇబ్బంది ఉండదు.

**ఒక విధంగా పోటీ పెరిగినట్లే..**
పసిడి రుణాలిచ్చే కంపెనీలకు, సంప్రదాయ పసిడి కొనుగోలుదార్లకు ఒక విధంగా ఈ వ్యాపార వ్యూహంతో పోటీ ఎదురైనట్లే. పసిడి రుణ కంపెనీల వద్దకు వచ్చే పాత బంగారాన్ని తనఖా పెట్టుకుని రుణాలు ఇస్తుండగా, పసిడికి నగదు ఇచ్చే వ్యాపారంలో విక్రయం మాత్రమే ఉంటోంది. తాత్కాలికంగా డబ్బులు కావాలా, లేదా పాత బంగారాన్ని శాశ్వతంగా వదిలించుకోవాలా అన్నది వినియోగదారు ఇష్టంతో ముడిపడి ఉన్న అంశం.

**ఆర్థిక వ్యవస్థకూ మంచిదే..**
ఒక అంచనా ప్రకారం భారతీయుల ఇళ్లలో 25, 000-35,000 టన్నుల పసిడి ఉంది. అధిక పసిడి ధరల వల్ల ఇది బయటకు రావడం వల్ల బులియన్ దిగుమతులు తగ్గడానికి ఉపయోగపడుతుంది. అయితే దేశీయ రీసైక్లింగ్ ద్వారా వచ్చే పసిడి, గిరాకీకి ఎంత మేర మద్దతు ఇవ్వగలదో చూడాల్సి ఉంది.

## మన యువత నుంచీ క్వాల్‌కామ్, ఇంటెల్‌లు వస్తాయ్

**మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆశాభావం**

దిల్లీ: దేశంలో అయిదు సెమీ కండక్టర్ యూనిట్‌లు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించడం, ప్రపంచ స్థాయి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతుండటంతో.. చిప్‌ల తయారీ విషయంలో భారత్ ఏర్పర్చుకున్న వ్యూహంపై ప్రారంభంలో నెలకొన్న సందేహాలు తొలగి విశ్వాసం పెరుగుతోందని కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో మన యువత నేతృత్వంలోని అంకుర సంస్థలు తదుపరి క్వాల్‌కామ్, ఇంటెల్‌లను సృష్టిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం పలు దేశాలు భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా భావిస్తున్నాయి. అయితే ప్రపంచ సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలో భారత ఎదుగుదలను అడ్డుకోవాలని చూసే శక్తుల నుంచి ఎదురయ్యే సైబర్‌దాడులు, ముప్పులు, అంతరా యాల విషయంలో సెమీ కండక్టర్ పరిశ్రమ, డీప్‌టెక్ అంకుర సంస్థలు అప్రమత్తంగా ఉండాల'ని ఆయన హెచ్చరించారు.

## సౌదీ, యూఏఈలతో ఈఐఎల్ చర్చలు

**దిల్లీ:** ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న హర్మూజ్ జలసంధిపై గల్ఫ్ ఉత్పత్తిదార్లు ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో, చమురు-గ్యాస్ మౌలిక సదుపాయాల కోసం కన్సల్టెన్సీ, ఇంజినీరింగ్ సేవలను అందించడానికి ప్రభుత్వ రంగ సంస్థ ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) సౌదీ అరేబియా, యూఏఈలతో ప్రాథమిక దశ చర్చలు జరుపుతున్నట్లు ఈఐఎల్ ఛైర్మన్, ఎండీ అతుల్ గుప్తా కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో వెల్లడించారు. ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అందించేందుకు, సౌదీ అరేబియా, యూఏఈ పైప్‌లైన్లు, నిల్వ సౌకర్యాలు, ఆయిల్ టెర్మినళ్లు, సంబంధిత మౌలిక సదుపాయాల్లో బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,500 కోట్ల) పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నాయని తెలిపారు. మేము ఆ ప్రణాళిక దశలోని చర్చల్లో పాలుపంచుకుంటున్నామన్నారు.

# కొలువుల జాతర

### జులై-డిసెంబరులో 2.5 లక్షల ఉద్యోగాలు!

ముంబయి: ప్రస్తుత సంవత్సరం రెండో అర్ధభాగంలో భారత్‌లో 2- 2.5 లక్షల సీజనల్, గిగ్ ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉందని ఓ నివేదిక అంచనా వేసింది. పండగ సీజనులో నియామకాలు 15-20 శాతం పెరగొచ్చని తెలిపింది. డిజిటల్ ట్యాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ ఈ నివేదికను రూపొందించింది. దేశం పండగ సీజనులోకి అడుగుపెడుతున్నందున ఇ-కామర్స్, క్విక్ కామర్స్, రిటెయిల్, లాజిస్టిక్స్, ఆతిథ్యం, పర్యాటకం, వినియోగదారు సేవల రంగాల్లోని కంపెనీలు సంవత్సరంలోనే అత్యంత గిరాకీ ఉండే కాలానికి సిద్ధమవుతున్నాయని నివేదిక తెలిపింది. దీని ప్రకారం..ీ జనుకు దాదాపు 12-14 వారాల ముందే ఉద్యోగుల నియామక ప్రణాళికను రూపొందించుకుంటారు. ముందుగానే తమకు అవ సరమైన ప్రతిభావంతులను ఎంపిక చేసుకునేందుకు, తక్కువ వ్యవధిలో ఎక్కువ నియామకాలు చేపట్టడం వల్ల ఏర్పడే ఒత్తిడిని అధిగమించేందుకు ఇది తోడ్పడుతుంది. అంతేకాకుండా తక్కువ సమయంలో అధిక గిరాకీ అవసరాలను తీర్చాల్సిన పరిస్థితి ఉంటుండటంతో, నియామకాలపై ముందస్తు సన్నద్ధత వల్ల ఇతర సంస్థలతో పోటీపరంగానూ ప్రయోజనం ఉంటుంది.లాస్ట్- మైల్ డెలివరీ, గిడ్డంగులు, ఫుల్‌ఫిల్‌మెంట్, రిటెయిల్ అమ్మకాలు, విని యోగదారు సేవలు, నిల్వల నిర్వహణ, ఫీల్డ్ ఆపరేషన్స్, ఆతిథ్యం లాంటి విభాగాలకు సీజనల్ ఉద్యోగ గిరాకీలో అధిక వాటా ఉంటోంది. కొత్త తరం ఉద్యోగ హోదాల నియామకాల్లోనూ 15-20 శాతం వృద్ధి ఉంటోంది. డార్క్- స్టోర్ ఇన్వెంటరీ కంట్రో లర్‌లు, రిటర్న్లు, రీఫండ్‌ల నిపుణులు, వినియోగదారు సమస్యల పరిష్కారం సిబ్బంది, మార్కెట్ ప్లేస్ ఆపరేషన్స్ ప్రొఫెష నల్స్, కేటలాగ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆర్డర్ మేనేజ్‌మెంట్ నిపు ణులు ఇందులో ఉన్నారు. పండగ సీజన్‌లో జరిగే మొత్తం నియామకాల్లో రెండో, మూడో అంచె నగరాల నుంచే 45 శాతం ఉండే అవకాశం ఉంది. ఈ నగరాల్లో నియామకాలు 25-30 శాతం మేర పెరగొచ్చు. ఇ-కామర్స్, క్విక్‌కామర్స్, రిటెయిల్, ప్రాంతీయ ఫుల్‌ఫిల్‌మెంట్ నెట్‌వర్క్‌ల విస్తరణ వల్ల జయపుర, లఖ్‌నవూ, సూరత్, నాగ్‌పుర్, భువనేశ్వర్, కోయంబత్తూర్, చండీగఢ్, కొచ్చి వంటి నగరాల్లో నియామకాలకు గిరాకీ పెరుగు తోంది.అనుకూల షిఫ్టులు, సమీప ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు, తాత్కాలిక ఉద్యోగాల వల్ల తాజా ఉత్తీర్ణులు (ఫ్రెషర్‌లు), తొలిసారి ఉద్యోగంలో చేరేవాళ్లు, మహిళలకు ఈ నియామకాల్లో గిరాకీ అధికంగా ఉంటోంది. పలు విభాగాల్లో కొత్తగా నియమితులయ్యే మహిళల్లో 30-35 శాతం మంది మెట్రోయేతర ప్రాంతాల నుంచే ఉంటారని అంచనా.



## సాఫ్ట్‌వేర్ ఎగుమతుల జోరు



**హైదరాబాద్:** అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ భారత ఐటీ, సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులు క్రమంగా వృద్ధి చెందుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతుల్లో 8.2 శాతం వార్షిక వృద్ధి రేటుతో రూ.21.24లక్షల కోట్లుగా (221.4 బిలియన్ డాలర్లు) నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఆర్థిక మందగమనం, అనిశ్చిత వాతావరణం నెలకొన్న తరుణంలోనూ భారతీయ కంపెనీలు తమ బలాన్ని నిరూపించుకోవడం గమనార్హం.సాఫ్ట్‌వేర్ ఎగుమతుల మొత్తం పరిమాణం విస్తరిస్తున్నప్పటికీ, ఒకే విదేశీ మార్కెట్‌పై అధిక స్థాయిలో ఆధారపడటం ఐటీ పరిశ్రమకు ప్రతికూల అంశంగా మారుతోంది. మొత్తం సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో ఏకంగా 54.1 శాతం వాటా ఒక్క అమెరికా నుంచే నమోదు అవుతోంది. ఇది విదేశీ మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావానికి దారితీస్తోంది. భౌగోళికంగా ఒకే ప్రాంతంపై తీవ్రంగా ఆధారపడటం వల్ల అక్కడ చోటుచేసుకునే ఆర్థిక మందగమనం, రాజకీయ పరిణామాలు, విధానపరమైన నిర్ణయా లు నేరుగా దేశీయ ఐటీ కంపెనీల ఆర్డర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.విదేశాల్లో అమలవుతున్న కఠిన వీసా నిబంధనలు భారత్ నుంచి వెళ్లే ఆన్-సైట్ ఎగుమతులపై దెబ్బ కొడుతున్నాయి. దేశీయ ఐటీ పరిశ్రమ సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న సంప్రదా య గ్లోబల్ డెలివరీ నమూనాకు ఈ వీసా పరిమితులు తీవ్ర ఇబ్బందిగా మారాయి. విదేశాల్లో ప్రాజెక్టుల వద్ద నేరుగా సిబ్బందిని ఉంచి పని చేయించే ఆన్-సైట్ వ్యయం పెరగడంతో, ప్రాజెక్టులను భారత్ నుంచే పూర్తి చేసి పంపించే సమర్థమైన మార్గాల వైపు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి.అంతర్జాతీయ వ్యాపారాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న రక్షణవాద ధోరణులు భారత ఎగుమతులకు సరికొత్త సవాళ్లు విసురుతు న్నాయి. అమెరికా ప్రతిపాదిస్తున్న పలు సుంకాలు, అదనపు పన్నుల పెంపు హెచ్చరి కలు ఎగుమతుల వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నాయి. విదేశీ మార్కెట్లలో స్థానిక పరిశ్ర మలను కాపాడుకునే దిశగా అమలవుతున్న ఈ రక్షణ విధానాలు భవిష్యత్తులో భారత ఐటీ సేవల విక్రయాలపై ఒత్తిడి పెంచే ప్రమాదం ఉంది.విదేశీ మారక ద్రవ్య ఆర్జనలో సేవా రంగానికి, వస్తు ఎగుమతులకు మధ్య ఉన్న వ్యత్యాసం పెరుగుతోంది. విదేశీ ఆదాయం కోసం భారత్ ప్రధానంగా సేవలపైనే ఆధారపడుతోంది. దీంతో పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులు మందగమనంలో సాగుతున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
21 సెప్టెంబర్ 2026

# ట్రాఫిక్ సమస్యలకు డేటా ఆధారిత పరిష్కారాలు

- 'మొబిలిటీ డేటాజామ్'తో వినూత్న ఆలోచనలు
- 100 మందికి పైగా నిపుణులు, విద్యార్థుల భాగస్వామ్యం
- రద్దీ, ప్రజా రవాణాపై ప్రత్యేక దృష్టి
- పరిష్కారాలను ఆచరణలోకి తెస్తాం: సైబరాబాద్ సీపీ



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి డేటా ఆధారిత విధానాలను రూపొందించేందుకు 'మొబిలిటీ డేటాజామ్' కార్యక్రమాన్ని సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో టెక్కీలు, పట్టణ ప్రణాళిక నిపుణులు, విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రభుత్వ శాఖల ప్రతినిధులు సహా దాదాపు 100 మంది పాల్గొన్నారు.
ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అందించిన ఓపెన్ డేటాను ఉపయోగించి నగర రద్దీ, వార్డు స్థాయి మొబిలిటీ సూచికలు, ప్రజా రవాణా సౌకర్యం, రోడ్డు భద్రత, డేటా విజువలైజేషన్ తదితర అంశాలపై బృందాలు మేధోమథనం చేశాయి. వివిధ నైపుణ్యాలున్న వారు కలిసి నమూనా పరిష్కారాలను రూపొందించి ప్రదర్శించారు. వార్డు స్థాయి సమాచారంతో పాటు నగరాన్ని హెక్సాగన్ ప్రాంతాలుగా విభజించడం, రవాణా మార్గాలను అత్యవసర సేవలతో అనుసంధానించడం వంటి ప్రతిపాదనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.
సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ వాస్తవ డేటా ఆధారంగా పౌరులు, నిపుణులు కలిసి రూపొందించిన పరిష్కారాలు నగర రవాణా వ్యవస్థ మెరుగుదలకు దోహదపడతాయన్నారు. పాఠశాలలకు సురక్షిత ప్రవేశం, రోడ్డు భద్రత, ప్రజా రవాణా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. డేటాజామ్‌లో వచ్చిన ఆలోచనలను ప్రయాణికులకు ప్రయోజనం చేకూరేలా ఆచరణలోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామని తెలిపారు.
ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి విశ్వసనీయమైన షేర్డ్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఈడీ శ్రీధర్ మాట్లాడుతూ డేటాజామ్ ద్వారా లభించిన సమాచారం రద్దీ ప్రాంతాలను గుర్తించి బస్సు సర్వీసులను వ్యూహాత్మకంగా పెంచేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (ఐటీ) ఉదయ్‌కుమార్, ఓపెన్ డేటా తెలంగాణ కమిషనర్ రవికిరణ్, ఎస్‌సీఎస్‌సీ సీఈవో నవీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆరోపణలు హాస్యాస్పదం

### బీఆర్ఎస్ నాయకుడు కరుణాకర్ పటేల్



**తాండూరు:** ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకుడు కరుణాకర్ పటేల్ (34వ వార్డు) మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన వారే సొంత ముఖ్య మంత్రిపై భూముల కొనుగోలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇలాంటి విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు. తాండూరులో రోహిత్ రెడ్డికి ఉన్న ప్రజాదరణను ఓర్వలేక, ప్రజాపాలన చేతకాక వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వ్యక్తిగత ఆస్తుల గురించి మాట్లాడడం సమంజసమా? మీపై ఉన్న ఆరోపణలకు ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు.

## ఎల్లమ్మ చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



**నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఘోర ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సిరికొండ గ్రామానికి చెందిన పారిపల్లి సాయి కుమార్ (32) స్థానిక ఎల్లమ్మ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం సుమారు 06:00 గంటల సమయంలో సాయి కుమార్ ఎల్లమ్మ చెరువులోకి దూకడాన్ని గమనించిన స్థానికులు, గ్రామస్తులు వెంటనే చెరువులోకి దిగి ఆయనను బయటకు తీశారు. అనంతరం హుటాహుటిన ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ, మార్గమధ్యలోనే సాయి కుమార్ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరికొండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి అనే కోణంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. యువకుడి అకాల మరణంతో సిరికొండ గ్రామంలో శోకసంద్రం అలుముకుంది.

## డ్రగ్స్‌కు దూరంగా ఉందాం.. జీవితాన్ని ఎంచుకుందాం

### 'నషా ముక్త్ భారత్' సైక్లింగ్ రైడ్

- యువత ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి
- డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్




**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** సమాజాన్ని మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటంతో పాటు యువత ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిస్తూ 'అక్షర స్ఫూర్తి' సంస్థ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్' సైక్లింగ్ రైడ్ నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో పాటు తెలంగాణ యువత ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సతీష్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ నరుకుడు బిందెల, ఓబీసీ నేషనల్ యాక్టివేషన్ లోకేష్, తెలంగాణ ఈగల్ ఫోర్స్ బృందం సభ్యులు, సైక్లిస్టులు, నిర్వాహకులు పాల్గొన్నారు. 'మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం.. జీవితాన్ని ఎంచుకుందాం', 'డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని వక్తలు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు నిత్య వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. 'డ్రగ్స్ లేని భారతదేశమే ఆరోగ్యకరమైన భారతదేశం' అనే ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సైక్లింగ్ రైడ్ ద్వారా యువతలో శారీరక ఆరోగ్యం, వ్యాయామం, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## పేదోడికి చిన్న ఇల్లు కట్టివ్వలేదు

### కల్వకుంట్ల కుటుంబం,వారి ఎమ్మెల్యేలు ఫామ్‌హౌస్‌లు



**తాండూరు సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లపాటు కల్వకుంట్ల కుటుంబం పాలన సాగిందని,అయితే ఆ పాలనలో నిరుపేదల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో గత బీఆర్ఎస్ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు నిర్మించుకున్న ఫామ్‌హౌస్‌లు, ప్రభుత్వ భూముల అక్రమణకు సంబంధించిన అంశాలను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పేదోడికి కనీసం చిన్న ఇల్లు కూడా కట్టించి ఇవ్వలేదు.కానీ అధికారంలో ఉన్న సమయంలో కల్వకుంట్ల కుటుంబం, వారి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. తెలంగాణ కోసం ప్రజలు చేసిన పోరాటం ఫలాలు సామాన్యులకు అందాల్సి ఉండగా,గత పదేళ్ల పాలనలో ఒకే ఒక్క కుటుంబానికే ప్రయోజనం చేకూరిందనే అన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి సంబంధించిన ఫాం హౌస్ భూమిలో నిర్మాణంకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. అలాగే, ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్ పార్టీలు, ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం వంటి వివాదాస్పద ఘటనలతో ఈ ఫాం హౌస్ లోనే జరిగాయని అన్నారు.యువతకు గత బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.ఈ పర్యటనలో ఎంపీలు మల్లురవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,బల్మూర్ వెంకట్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకర్, నవీన్ యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్న 4వ డివిజన్, దుర్షెడ్ గ్రామంలోని వద్ద ఇరుకుళ్ల వైపు నుండి ఇసుక లోడ్‌తో వస్తున్న మూడు ట్రాక్టర్లు, ట్రైలర్లను పోలీసులు గుర్తించారు.పోలీసులను గమనించిన వెంటనే సదరు వాహనాల డ్రైవర్లు వాహనాలను నిలిపివేసి అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసు సిబ్బంది వారిని కొంత దూరం వెంబడించి పట్టుకున్నారు.గాజుల శివకృష్ణ (35) దుర్షెడ్ గ్రామం. తోట వినయ్, (27) శ్రీరామోజు తిరుపతి, (50) విచారణలో నిందితులు ఇరుకుళ్ల వాగు నుండి ఎటువంటి చెల్లుబాటు అయ్యే అనుమతులు, పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తవ్వి/ తరలిస్తున్నట్లు వెల్లడించారు. అక్రమంగా ఇసుకను తరలించి, తద్వారా ఆర్థిక లాభం పొందుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.ఈ సందర్భంగా ఇద్దరు పంచ సాక్షుల సమక్షంలో నిందితులను విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు, అక్రమంగా ఇసుక తరలించడానికి ఉపయోగించిన 3 ట్రాక్టర్లు, 3 ట్రైలర్లను ఇసుక లోడ్‌తో సహా స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాలను, నిందితులను కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు.

## కరీంనగర్‌లో భారీ వర్షం

### లోతట్టు ప్రాంతాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటన



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** వర్షాల పట్ల నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావులతో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. నగరంలోని 31, 53, 59, 60, 64వ డివిజన్లలో రోడ్ల పై నిలిచిన వర్షపు నీరు, మురుగు నీటి కాలువలు, వరద ప్రభావిత రోడ్లను స్వయంగా పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. వర్షపు నీటి తొలగింపు పై అధికారులు, సిబ్బంది కి పలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది, డిజాస్టర్ సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టి నీటిని తొలగించాలన్నారు. రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో చేరుకున్న వరద నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపాలని, పొంగిపొర్లుతున్న మురుగు కాలువల జలదిగ్బంధాన్ని వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని, అత్యవసర సేవల కోసం మున్సిపల్ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉంటా

### కలిసికట్టుగా ఉంటే సమస్యలు పరిష్కారం




**హుజురాబాద్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, 12వ వార్డు కౌన్సిలర్ వర్ధినేని రవీందర్‌రావు అన్నారు. ఆదివారం హుజురాబాద్ క్లబ్‌లో నిర్వహించిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని సూచించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని రాజయ్య మాట్లాడుతూ పెన్షన్, బకాయిలు, ఈపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నుంచి త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై కూడా సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మార్త రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి పేరాల లక్ష్మణరావు, ట్రెజరర్ ఏబీ రెడ్డి, ముఖ్య సలహాదారు ఎంఆర్ మొగిలి, కమిటీ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

### మండల స్థాయి ప్రతిభా పురస్కారాల ప్రదానం

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** లాల్‌గడి మలక్‌పేట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి–2026 మండల స్థాయి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎస్ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. దేవర యాంజాల్‌కు చెందిన డా. బెజగం ఆనందరావు, చింతల శ్రీనివాస్‌రెడ్డి, బర్రెంకబావి రవీందర్‌రెడ్డిలు తమ తల్లిదండ్రుల పేరిట గత 16 ఏళ్లుగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది 100 శాతం ఫలితాలు సాధించిన లాల్‌గడి మలక్‌పేట్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం విభాగాల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పురస్కారాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఉత్సాహాన్ని పెంచుతాయని తెలిపారు. జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పట్టుదలతో ఉన్నత స్థానాలను సాధించవచ్చన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి సంస్కారాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి, మండల విద్యాధికారి ఆర్.కమలాకర్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలకు రోలింగ్ షీల్డ్, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వప్న రాంప్రసాద్, పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయ కుటుంబాన్ని పరామర్శించిన పౌర హక్కుల సంఘం నేతలు



**ముస్తాబాద్ సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని చింతోజు బాలయ్య సహచరి విజయ అనారోగ్యంతో సెప్టెంబర్ 9న మరణించింది. ఆమె శ్రద్ధాంజలి ముస్తాబాద్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటిలో జరిగింది. బాలయ్య విప్లవోద్యమాలలో, ప్రజాఉద్య మాలలో, తెలంగాణ ఉద్యమంలో అనుభవించిన నిర్బంధం, అక్రమ కేసులన్నింటిలో విజయ బాలయ్య కు వెన్నంటి గా ఉండి,మొత్తం కుటుంబం తో పాటు ఈ సిరిసిల్ల ప్రాంత నాలుగు దశబ్దాల ఉద్యమాలకు,పౌర హక్కుల నిజనిర్ధారణలకు, బాలయ్య విజయాల మద్దతు, కార్యాచరణ ను ఈ సందర్బంగా గుర్తు చేసుకొని, విజయ కు పలు పౌర హక్కుల, ప్రజా సంఘాల, దళిత సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు మార్వాడి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, దళిత లైబరేషన్ ఫ్రంట్, తెలంగాణరాష్ట్రం, మాదనకుమారస్వామి, సహాయ కార్యదర్శి, పౌర హక్కుల సంఘం, తెలంగాణ, మార్వాడి గంగరాజ్, అధ్యక్షుడు,తెలంగాణ రాష్టం, కన్నీకంటి సత్యం, సోమోజు శ్యామ్ ప్రసాద్, నారోజు రాజు,స్వర్ణకారుల సంఘం,తదితరులు నివాళులు అర్పించారు..

## దివ్యాంగ విద్యార్థులకు సహాయక పరికరాల పంపిణీకి నిర్ధారణ శిబిరం

### ఎంఈఓ రామకృష్ణ

**రుద్రంగి, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :** దివ్యాంగ విద్యార్థులకు సహాయక పరికరాల పంపిణీ నిమిత్తం అలింకో ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు రుద్రంగి మండల విద్యాధికారి నల్లపురి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.సిరిసిల్ల పట్టణంలోని స్థానిక భవిత కేంద్రం, సుందరయ్య నగర్ లో గల ఎంఆర్సీ భవనంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ విద్యార్థులు ఈ శిబిరానికి హాజరై వైద్య నిపుణులచే నిర్ధారణ చేయించుకొని తమకు అవసరమైన సహాయక పరికరాల కోసం అర్హత పొందవచ్చని తెలిపారు.

**శిబిరానికి తీసుకురావాల్సిన ధ్రువపత్రాలు**

1.ఆధార్ కార్డు 2.సదరం సర్టిఫికెట్ 3.కుల ధ్రువీకరణ పత్రం 4. ఆదాయ ధ్రువీకరణ పత్రం 5.రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తలకొండపల్లిలో ఉచిత న్యూరో వైద్య శిబిరం

- 350 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు
- నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి
- న్యూరో, స్పైన్ సమస్యలపై పరీక్షలు
- వైద్య బృందానికి ఉప్పల వెంకటేష్ సన్మానం




**తలకొండపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో తలకొండపల్లిలో ఉచిత న్యూరో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో సాయికృష్ణ సూపర్ స్పెషాలిటీ న్యూరో హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఈ శిబిరం జరిగింది. 350 మందికి పైగా ప్రజలు హాజరై ఉచిత వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు పొందారు. న్యూరో సర్జరీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్, స్పైన్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యులు రోగులను పరీక్షించారు. తలనొప్పి, పక్షవాతం, మూర్ఛ, నరాల బలహీనత, వెన్నెముక, మెడ, నడుము సమస్యలపై వైద్య సూచనలు అందించారు. కొందరికి ఉచితంగా మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని స్థానికులు కోరారు. సేవలందించిన వైద్య నిపుణులను ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూకం కోటిశ్వర్, మాజీ జడ్పీటీసీ నర్సింహా, వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, పోతుగంటి కుమార్, గ్రామ పెద్దలు జగదీశ్వర్, దశరథ, విఠల్, శ్రీశైలం, శ్రీను, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## పురుగుల మందు బలవంతంగా తాగించి హత్య

- సంచలనం సృష్టించిన అక్షితరాణి హత్య
- కేసును ఛేదించిన గోదావరిఖని పోలీసులు..
- సాంకేతిక ఆధారాలతో నిందితుల అరెస్ట్
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన పీడీపీఎల్ డీసీపీ రాంరెడ్డి




**గోదావరిఖని, సెప్టెంబర్ 19 (జనంసాక్షి) :** గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో ఈ నెల 12న జరిగిన అక్షితరాణి అనుమా నాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి వివరాలు వెల్లడించారు. ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, కాల్‌డేటా, ఇతర సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించినట్లు తెలిపారు. నిందితుడు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన జెట్టి నవీన్‌కుమార్. సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. మరో నిందితుడు బెల్లంపల్లి మండలం బుద్ధఖుర్ద్‌కు చెందిన బొమ్మకంటి రవికుమార్ సింగరేణిలో ఓవర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. దర్యాప్తు ప్రకారం.. 2022లో అక్షితరాణితో నవీన్‌కుమార్‌కు పరిచయం ఏర్పడింది. శిక్షణ కోసం గోదావరిఖనికి వచ్చిన సమయంలో రవికుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆమె రవికుమార్‌తో సన్నిహితంగా ఉండటాన్ని నవీన్‌కుమార్ తట్టుకోలేక హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 12న ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్స్ వద్ద అక్షితరాణిని కారులో ఎక్కించుకున్న నవీన్‌కుమార్.. వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ వాగ్వాదానికి దిగాడు. పురుగుల మందును బలవంతంగా తాగించి, రవికుమార్ తనపై అత్యాచారం చేశాడంటూ సూసైడ్ నోట్ రాయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం వైద్యసాయం అందించడంలో జాప్యం చేసి, తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్యగా నమ్మించే ప్రయత్నం చేశాడని పోలీసులు తెలిపారు. ఆసుపత్రిలో అక్షితరాణి మృతి చెందింది. నేరం బయటపడుతుందనే భయంతో కారును కడిగి, ఆధారాలను తొలగించినట్లు పోలీసులు తెలిపారు. ఎకోస్పోర్ట్ కారు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాలతో నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. రవికుమార్‌పై వచ్చిన లైంగిక వేధింపులు, మృతురాలు సింగరేణి అధికారులకు ఇచ్చిన దరఖాస్తు, దానిపై తీసుకున్న చర్యలు, అధికారుల నిర్లక్ష్య ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఏసీపీ మడత రమేష్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలొద్దీన్, ఎస్ఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించిన పోలీసులను డీసీపీ రాంరెడ్డి అభినందించారు.

## ఒరిజినల్ పత్రం పోయినది

జగిత్యాల జిల్లా, పెగడపల్లి మండలం, దొమలకుంట గ్రామానికి చెందిన తొట్ల రాధ (భర్త సత్తయ్య)కు చెందిన పత్రం సంఖ్య: 298/ 2023, తేదీ: 15-02-2023 గల ఒరిజినల్ గిఫ్ట్ డీడ్ (ఇంటి నంబరు: 2-111/4/2) గత ఆగస్టు 22న SRO మల్యాల ఇంటిని మార్చే క్రమంలో పోయింది. లభించిన వారు ఈ నంబరులో సంప్రదించగలరు: 9849365409.



# తప్పు ఎవరిది..? శిక్ష ఎవరికి..?

**ఖమ్మం కళాశాల గిరిజన బాలుర వసతి గృహంలో విద్యార్థుల ఘర్షణ**

- వార్డెన్‌పై వేటు.. ఐటీడీఏకు సరెండర్
- గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయంతో అధికారుల్లో తీవ్ర ఆందోళన

*ఎవరైనా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే.. ఇందులో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. కానీ, తప్పు ఒకరు చేస్తే.. శిక్ష మరొకరిపై రుద్దితే ఎలా? ప్రస్తుతం ఖమ్మం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖలో తీసుకున్న ఓ వివాదాస్పద నిర్ణయం ఇలాంటి విమర్శలకే తావిస్తోంది. మెమో ఇవ్వకుండా వార్డెన్‌ను భద్రాచలం ఐటీడీఏకు సరెండర్ చేయడం శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.*

**ఖమ్మం (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలోని ఎన్ఎస్పీ క్యాంపులో ఉన్న గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో గత వారం రాత్రిపూట విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగింది. అర్ధరాత్రి వేళ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్య సద్దుమణిగేలా చూశారు. మరుసటి రోజు శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) హాస్టల్‌కు వెళ్లి విచారణ జరిపారు. అయితే, ఆ విచారణ ముగిసిన వెంటనే వసతి గృహ సంక్షేమాధికారి (హెచ్‌డబ్ల్యూవో) జనార్దన్‌ను భద్రాచలం ఐటీడీఏ కు అటాచ్ చేయడం కలకలం రేపింది.

**డ్యూటీ అయిపోయాక జరిగితే వార్డెన్ బాధ్యుడా?**

నిబంధనల ప్రకారం వసతి గృహ సంక్షేమాధికారి పనివేళలు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే. ఆ తర్వాత ఆయన అక్కడ ఉండరు. కానీ ఈ ఘటన రాత్రి వేళ జరిగింది. అంతేకాకుండా కళాశాల స్థాయి హాస్టళ్లలోని విద్యార్థులంతా మేజర్లు. వారిపై నిరంతర పర్యవేక్షణ సులభం కాదన్నది బహిరంగ వాస్తవం. విధుల్లో లేని సమయంలో విద్యార్థులు తగాదా పడితే.. దానికి వార్డెన్‌నే నేరుగా బాధ్యుడిని చేయడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్నలు మొదలయ్యాయి. సాధారణంగా శాఖాపరమైన లోపాలు కనిపిస్తే సంజాయిషీ కోరుతూ 'మెమో' జారీ చేస్తారు. కానీ అలాంటి ప్రాథమిక ప్రక్రియ ఏదీ లేకుండానే నేరుగా సరెండర్ చేయడంపై సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**గతంలో లేని సంస్కృతి.. భయం గుప్పిట్లో సిబ్బంది**

గతంలోనూ ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరిగాయి. సోదర శాఖలైన ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలోనూ వివాదాలు తలెత్తాయి. గతంలో పనిచేసిన అధికారులు డివిజన్ స్థాయి ఏటీడీవోలతో క్షేత్రస్థాయి విచారణ చేయించి, సమస్యను సరిదిద్దే మార్గాలను అన్వేషించేవారు. తీవ్రమైన నిర్లక్ష్యం రుజువైతే తప్ప ఇలాంటి కఠిన చర్యలు తీసుకునేవారు కాదు. కానీ ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం జిల్లాలోని మిగిలిన వసతి గృహ అధికారులను అభద్రతా భావంలోకి నెట్టింది.

'రేపు మా హాస్టళ్లలో ఏదైనా జరిగితే మమ్మల్ని కూడా ఇలాగే బలిపశువులను చేస్తారా?' అని అధికారులు లోలోపల మదనపడుతున్నారు. విద్యార్థుల మధ్య ఘర్షణకు దారితీసిన అసలు కారణాలను పరిష్కరించకుండా, సమస్యను పక్కదారి పట్టించేందుకే కింది స్థాయి అధికారిపై వేటు వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**హాస్టల్ వ్యవహారాలు చక్కదిద్దలేకపోతున్నారు :**
*ఫిరంగి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ*

వసతి గృహ సంక్షేమ అధికారి జనార్దన్ కళాశాల బాలుర వసతిగృహ వ్యవహారాలను పూర్తిస్థాయిలో చెక్కదిద్దలేకపోతున్నారు. హాస్టల్లో వివాదం జరిగి పోలీస్ స్టేషన్ వరకు విద్యార్థులు వెళ్లారు. అందుకే ఆయనను ఐటీడీఏ పీవో భద్రాచలంకు సరెండర్ చేశాము. విద్యార్థుల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం.

# ఉత్తునూర్‌లో తాగునీటి ఎద్దడి

- రోడ్డుపై ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన
- మిషన్ భగీరథ నీళ్లు వస్తేనే సరి.. లేకుంటే తిప్పలే!
- పట్టించుకునే నాథుడే లేడంటూ ఆగ్రహం



**సదాశివనగర్ సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. రోజువారీ అవసరాలకు సరిపడా నీరు అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆగ్రహించిన మహిళలు, గ్రామస్తులు రోడ్డుపై ఖాళీ బిందెలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తేనే ఊరట లభిస్తుందని సరఫరాలో అంతరాయం ఏర్పడితే మాత్రం నీటి కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు కూడా సక్రమంగా అందించలేని పరిస్థితి నెలకొంటే ఇక గ్రామీణ ప్రజల సమస్యలను ఎవరు పట్టించుకుంటారని వారు ప్రశ్నించారు.

**హామీలు కాదు.. శాశ్వత పరిష్కారం కావాలి**

నీటి సరఫరా విషయంలో ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో సరఫరా నిలిచిన ప్రతిసారీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వేసవి వచ్చినా, పైపులైన్‌లో సమస్య వచ్చినా, మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కనిపించడం లేదన్నారు. ఒకవైపు గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నా.. మరోవైపు ప్రజలకు కనీస తాగునీరు అందక ఖాళీ బిందెలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని గ్రామస్తులు మండిపడ్డారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి**

ఉత్తునూర్‌లో తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నిరంతర తాగునీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా నీటిని అందించాలని కోరారు. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనాలి

- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య
- ఇల్లందు-కోయగూడెం, మందమర్రి-శ్రావణపల్లి బ్లాక్‌లపై దృష్టి
- కార్మికుల ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలి




**గోదావరిఖని, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** సింగరేణి సంస్థ భవిష్యత్, కార్మికుల ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని త్వరలో జరగనున్న 26వ విడత దేశవ్యాప్త బొగ్గు గనుల వేలంలో సంస్థ తప్పనిసరిగా పాల్గొనాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గోదావరిఖని రామగుండం ఏరియా-1లోని బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఇల్లందు-కోయగూడెం, మందమర్రి-శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి యాజమాన్యం చురుగ్గా పాల్గొని వాటిని సంస్థకు దక్కేలా చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతిక సామర్థ్యం, పరిపాలనా అనుమతులు, న్యాయపరమైన అంశాలను సమన్వయం చేసుకుని పోటీ బిడ్డింగ్‌కు సిద్ధం కావాలని సూచించారు.
సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్‌లు లభిస్తే భవిష్యత్ ఉత్పత్తి కొనసాగింపుతో పాటు సంస్థ విస్తరణ, ఆదాయ వృద్ధి, కార్మికుల ఉద్యోగ, సామాజిక భద్రతకు దోహదపడుతుందని సత్తయ్య పేర్కొన్నారు. ఈ అంశంపై బీఎంఎస్ నాయకత్వం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి సింగరేణి వేలంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సంస్థ పాల్గొంటే బ్లాక్‌లు దక్కేలా అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఆ హామీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కేంద్రంతో సమన్వయం చేసుకుని అవసరమైన సహకారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి కర్రావుల మహేష్ అధ్యక్షత వహించగా ఏరియా కార్యదర్శి మేడ రామ్మూర్తి, పల్లె శ్రీనివాస్, గంగిశెట్టి నరసింహులు, నీలం శ్రీనివాస్, మేడ అజయ్‌కుమార్, బొజ్జపల్లి నాగరాజు, ఆర్.ఎల్.వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

### *సుమారు 10 లక్షల వరకు ఆస్తి నష్టం*



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్20 (జనం సాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు గ్రామంలో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన మహమ్మద్ ముబీన్ ఇంట్లో శనివారం రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. శబ్దం విన్న పొరుగున ఉన్న మహిళ బయటకు వచ్చి చూడగా, అప్పటికే ఇంట్లో నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి.
ఆమె వెంటనే అప్రమత్తమై ముబీన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, కొత్తగూడెం నుండి ఫైరింజన్ చేరుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లోని విలువైన సామాగ్రితో పాటు బాధితుల ఆశలు, భవిష్యత్తు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తీవ్ర ప్రాణనష్టం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

**బాధితుడిని కోలుకోలేని దెబ్బతీసిన ప్రమాదం:**

వెల్డింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే ముబీన్‌కు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు వివాహం కోసం ఎంతో శ్రమించి కొనుగోలు చేసిన బట్టలు, పెళ్లి సామాన్లు, వారి జీవనోపాధికి ఆధారమైన వెల్డింగ్ మిషన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుడి భార్య ఇంట్లోనే టైలరింగ్ చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచేది. కాగా కుట్టడానికి తెచ్చిన బట్టలు కూడా మంటల్లో కాలిపోయాయి. అంతేకాకుండా, పిల్లలిద్దరూ ఎంతో కష్టపడి చదువుకుని సాధించిన ఎంబీఏ ఒరిజినల్ సర్టిఫికెట్లు సైతం అగ్నికి ఆహుతయ్యాయి.
ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. జీవితకాల కష్టమంతా కళ్లముందే బూడిదవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం, దాతలు స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన భీమ్ భరత్

**మొయినాబాద్:** మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్‌లోని తన నివాసంలో భీమ్ భరత్ సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ఈ ఆర్థిక సహాయం వరం అని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో వందలాది మందికి వైద్య సేవల కోసం చెక్కులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎండి.ఏజాజ్, శంకర్‌గౌడ్, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారంఈ నెల 20 తేదీన ఆదివారం ఉదయం 11:20 గంటల సమయంలో ముగ్ధంపూర్ గ్రామానికి చెందిన దాడి శారద వయసు (50), కూకట్ల కనుకమ్మ రోడ్డు పక్కన నిల్చొని ఉండగా గోదావరిఖని వైపు నుండి వచ్చిన బ్రీజా కారు డ్రైవర్ అతివేగంగా జాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఇద్దరిని ఢీకొట్టగా వారికి తీవ్ర గాయాలు అయినాయి, వెంటనే వారిని చికిత్స కొరకు ఆస్పత్రికి తరలించగా దాడి శారద చికిత్స పొందుతూ మరణించినది, మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి మృతురాలికి శవపంచనమ, నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినారు, ఇట్టి ప్రమాదానికి కారణమైన కార్ డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఫిర్యాదు స్వీకరించిన కరీంనగర్ రూరల్ పోలీసులు ఘటనపై విచారణ చేపట్టి, ప్రమాదానికి గల కారణాలు, సంబంధిత వాహనాల వివరాలు, బాధ్యుల గురించి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. అని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపినారు.

## టిమ్స్‌లో పగటిపూట చోరీ.. నిఘా వ్యవస్థపై ప్రశ్నలు

**నిందితుడు గుమ్మడి బాజీ అరెస్ట్.. బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు**



**బోరబండ, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** టిమ్స్ ఆసుపత్రిలో పగటిపూట జరిగిన చోరీ ఘటన కలకలం రేపింది. ఆసుపత్రి భద్రత, నిఘా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తిన ఈ ఘటనకు సంబంధించి బోరబండ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. క్రైమ్ నంబర్ 625/2026లో బీఎన్ఎస్ 331(3), 305(ఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. గుమ్మడి బాజీ (36) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నెట్‌వర్క్ కేబుల్ పనులు చేసే బాజీ లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని దూబే కాలనీలో నివసిస్తున్నట్లు తెలిపారు. అతడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మారిపూడిగా పేర్కొన్నారు. పగటిపూటే ఆసుపత్రిలో చోరీ జరగడం, అనంతరం నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయడంతో భద్రతా ఏర్పాట్లపై చర్చ జరుగుతోంది. కేసులో మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## రుద్రంగిలో వినాయక మండపాల్లో ప్రభుత్వ విప్ పూజలు

**రుద్రంగి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** రుద్రంగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ప్రధాన కూడళ్లు, వివిధ కాలనీల్లో ప్రతిష్ఠించిన గణనాథుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు భక్తిభావం, ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# యూపీఐపై చార్జీల భారం?

- ఎండీఆర్ అంశంపై వ్యాపార వర్గాల్లో ఆందోళన
- అదనపు ఖర్చు వస్తే వినియోగదారులపై ప్రభావం
- డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడిన ప్రజలు
- రుసుములపై పునరాలోచించాలని విజ్ఞప్తి



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):**
యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీల అంశం వ్యాపార వర్గాల్లో ఆందోళనకు దారితీస్తోంది. డిజిటల్ చెల్లింపులు విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన నేపథ్యంలో అదనపు రుసుములు విధిస్తే వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఆ భారాన్ని వ్యాపారులు భరించలేకపోతే వస్తువులు, సేవల ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందని చెబుతున్నారు.
యూపీఐ అందుబాటులోకి వచ్చిన తర్వాత టీ దుకాణాలు, కిరాణా షాపుల నుంచి రెస్టారెంట్లు, మాల్స్ వరకు చెల్లింపుల విధానం సులభమైంది. చిల్లర సమస్య లేకపోవడం, నగదు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకపోవడం, మారుమూల ప్రాంతాల్లోనూ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేసే అవకాశం ఉండటంతో వినియోగం భారీగా పెరిగింది. అయితే డిజిటల్ చెల్లింపులపై వ్యాపారులకు అదనపు ఖర్చు పడితే చిన్న, మధ్యతరహా వ్యాపారాలపై ప్రభావం చూపుతుందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే అద్దెలు, విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలు, నిర్వహణ వ్యయాలు పెరిగిన పరిస్థితుల్లో మరో రుసుము భారం లాభాలపై ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు. కొందరు వ్యాపారులు యూపీఐ చెల్లింపులను పరిమితం చేస్తే వినియోగదారులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. యూపీఐ చెల్లింపులపై ఏవైనా అదనపు ఖర్చులు విధించినా వాటి భారం సామాన్య వినియోగదారులపై పడకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముకుందారెడ్డి కోరారు. యూపీఐ వల్ల చిల్లర సమస్య లేకపోవడంతో పాటు దూర ప్రాంతాల్లోనూ సులభంగా నగదు బదిలీ చేసుకునే వెసులుబాటు లభిస్తోందన్నారు. డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అదనపు రుసుముల అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.

## కరీంనగర్‌లో ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

- దుర్శేడ్‌లో గ్యాస్ కట్టర్‌తో రూ.8.85 లక్షల చోరీ
- తిమ్మాపూర్‌లో లేడీ గెటప్‌లో వచ్చి కెమెరాలపై స్ప్రే
- పక్కా ప్రణాళికతో సీసీటీవీల నిర్వీర్యం
- నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలు



**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున దుండగులు రెండు ఎస్బీఐ ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. దుర్శేడ్‌లో గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి నగదు అపహరించగా, తిమ్మాపూర్‌లో సీసీటీవీ కెమెరాలపై స్ప్రే కొట్టి తమ కదలికలు రికార్డు కాకుండా జాగ్రత్తపడ్డారు. రెండు ఘటనల్లోనూ ముందస్తు ప్రణాళిక ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.
కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామ శివారులోని ఎస్బీఐ ఏటీఎంలోకి ముగ్గురు దుండగులు స్కార్పియో వాహనంలో వచ్చి తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ప్రవేశించినట్లు తెలుస్తోంది. ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, గ్యాస్ కట్టర్‌తో క్యాష్ మిషన్‌ను కట్ చేసి సుమారు రూ.8.85 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఏటీఎంలో సుమారు రూ.9.84 లక్షలు ఉండగా మిగిలిన నగదు అక్కడే ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
తిమ్మాపూర్‌లోని మరో ఎస్బీఐ ఏటీఎంలోనూ ఇదే సమయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. లేడీ గెటప్‌లో వచ్చిన వ్యక్తులు సీసీటీవీ కెమెరాలపై స్ప్రే కొట్టి అనంతరం ఏటీఎంలో చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. రెండు ప్రాంతాల్లోనూ సీసీటీవీలను ముందుగానే నిర్వీర్యం చేయడం, వాహనాలను ఉపయోగించడం పోలీసుల దృష్టిని ఆకర్షించింది. ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. దుండగులు ఉపయోగించిన వాహనం, వారి కదలికలు, పరారైన మార్గాలపై ఆరా తీస్తున్నారు. రెండు ఘటనలకు ఒకే ముఠా కారణమా? వేర్వేరు ముఠాలా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను త్వరగా పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు.

# అంబేద్కర్‌ను విమర్శిస్తే దేశద్రోహులే!

### *హమార ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి*

- బోడుప్పల్లో 396వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- హమార ప్రసాద్, అతనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



**బోడుప్పల్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 396వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కించపరిచే విధంగా రచనలు చేసిన హమారా ప్రసాద్ అరెస్టును స్వాగతిస్తూ, హమారా ప్రసాద్ ను, అతనికి సహకరించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత విజ్ఞానవంతుడై, అత్యున్నతమైన భారత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు పై అసత్య ప్రచారాలు చేస్తూ, తన రచనల ద్వారా కించపరుస్తున్న హమారా ప్రసాద్ అరెస్టును ఆశిస్తూ, రచించిన పుస్తకాలని సీజ్ చేయాలని, అతనికి సహకరించిన వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకొని, భవిష్యత్తులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి ఎవరు విమర్శించిన సహించేది లేదని నత్తి మైసయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం బోడుప్పల్ అధ్యక్షుడు గరుగుల యాకయ్య, రాపోలు శ్రీరాములు, సాయి బండారి, మోతే రాజు, మైసగళ్ళశివ, గడ్డంరాజు, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ బల్దియాకు పారిశుధ్య పరికరాలు

### *66 ట్రైసైకిళ్లు, రెండు ఫాగింగ్ యంత్రాలు పంపిణీ*


- రూ.47.83 లక్షలతో పరికరాల కొనుగోలు : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ప్రతి డివిజన్‌లో క్రమం తప్పకుండా ఫాగింగ్
- నగర అభివృద్ధికి రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగాన్ని బలోపేతం చేసేందుకు రూ.47.83 లక్షలతో కొనుగోలు చేసిన 66 ట్రైసైకిళ్లు, రెండు ఫాగింగ్ యంత్రాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం, ఎంజీఎఫ్ నిధులతో ట్రైసైకిళ్లకు రూ.21.30 లక్షలు, ఫాగింగ్ యంత్రాలకు రూ.26.33 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ నగర పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో రెండు డివిజన్లకు ఒక చెత్త ట్రాక్టర్ ఉండగా, ప్రస్తుతం ప్రతి డివిజన్‌కు ఒకటి చొప్పున అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రతి డివిజన్‌లో వారం లేదా పది రోజులకు ఒకసారి ఫాగింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ల్యాడర్లు, వైకుంఠ రథాలు, జేసీబీలను కూడా సమకూర్చుతున్నట్లు పేర్కొన్నారు.
నగర అభివృద్ధికి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.840 కోట్ల నిధులు మంజూరయ్యాయని, యూఐడీ కింద రూ.50 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. మరో రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రూ.15 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. యూసీఎఫ్ కింద డంపింగ్ యార్డుకు మరో రూ.80 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టవర్ సర్కిల్ ప్రాంతంలో రూ.25 కోట్లతో ఐదు అంతస్తుల శాశ్వత పార్కింగ్ నిర్మిస్తామని, నగరంలోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కరీంనగర్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్‌గా జనార్ధన్‌రెడ్డి ఎన్నిక

**రైతుల సంక్షేమమే ధ్యేయం**



**తాండూరు, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** తాండూరు మండలం ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా ఎన్నికైన జనార్ధన్ రెడ్డి, డైరెక్టర్‌గా ఎన్నికైన చాకలి నర్సింహులుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడిపిస్తామని చెప్పారు. రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
21 సెప్టెంబర్ 2026

# జుట్టుపట్టి ఈడ్చుకెళ్లే అధికారం ఎవరిచ్చారు..!?

- ఖాకీ ఖండకావరానికి తగిన శాస్తి
- విధుల నుంచి తొలగిస్తూ పోలీసు శాఖ నిర్ణయం



హైదరాబాద్ (జనంసాక్షి) : హాఫీజ్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ఓ మహిళను హోంగార్డు జుట్టుపట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపింది. సెప్టెంబరు 18 రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. మహిళపై దాడికి పాల్పడిన హోంగార్డు కడిగ ఆనంద్‌ను అరెస్టు చేసి, విధుల నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. హాఫీజ్‌పేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నంబర్--1, ఆదిత్యనగర్ వైపు ఈ ఘటన చోటుచేసుకుంది. స్టేషన్‌లో చిత్తుకాగితాలు, ఇనుప వ్యర్థాలు ఏరుకునే వారిని ప్లాట్‌ఫారం నుంచి పంపించాలని స్టేషన్ మాస్టర్ సూచించిన సమయంలో హోంగార్డు ఆనంద్ అక్కడికి వెళ్లాడు. మహిళను అక్కడి నుంచి పంపించే క్రమంలో వాగ్వాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మహిళ తనను దూషించిందన్న ఆగ్రహంతో ఆనంద్ ఆమెపై దాడి చేసి, జుట్టుపట్టి కిందపడేసి రోడ్డుపై ఈడ్చుకెళ్లినట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనను స్థానికులు మొబైల్ ఫోన్లలో చిత్రీకరించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియోలో మహిళను విడిచిపెట్టాలని ప్రాధేయపడుతున్న స్వరాలు వినిపిస్తుండగా, హోంగార్డు ఆగ్రహంతో మాట్లాడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దూషించిందని ఆరోపణ ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకునే మార్గం ఉన్నప్పటికీ, మహిళపై భౌతిక దాడికి దిగే అధికారం ఎవరిచ్చారు? అనే ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి ముందుకొచ్చాయి. దక్షిణ మధ్య రైల్వే అతను రెగ్యులర్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది కాదని, తెలంగాణ స్టేట్ పోలీస్‌కు చెందిన హోంగార్డు అని స్పష్టం చేసింది. అతడిని తెలంగాణ పోలీస్ శాఖకు తిరిగి పంపించింది. డీజీపీ సీవీ ఆనంద్ ఘటనపై స్పందిస్తూ, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇలాంటి ప్రవర్తనను సమర్థించలేమని పేర్కొని సైబరాబాద్ సీపీకి తక్షణ చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. సైబరాబాద్ కమిషనర్ ఎం. రమేష్ వెల్లడించిన వివరాల ప్రకారం ఆనంద్‌ను అరెస్టు చేసి హోంగార్డు విధుల నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సెప్టెంబరు 19న ఎఫ్ఐఆర్ నంబర్ 1349/2026 నమోదు చేసి, బీఎన్ఎస్ సెక్షన్లు 74, 118(1) కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఖాకీ అంటే అధికారం కాదు.. బాధ్యత. ప్రజలను రక్షించాల్సిన వ్యక్తే చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కోవడం పోలీసు వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పూర్తి దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాఖాపరమైన క్రమశిక్షణ, చట్టపరమైన చర్యలు కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

# ఉరకలేస్తున్న ఉల్లి

- కిలో ధర ఏకంగా రూ.120




నిజామాబాదు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 20 (జనంసాక్షి): సాధారణ మధ్యతరగతి, పేద ప్రజల వంటగదిలో నిత్యం ప్రధాన పాత్ర పోషించే ఉల్లిగడ్డ ఇప్పుడు సామాన్యుడికి చుక్కలు చూపిస్తోంది. మార్కెట్లో కిలో ఉల్లి ధర ఏకంగా రూ. 120 కి చేరుకోవడంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వంటగదిలో ఉల్లిని కోస్తే కంటికి నీరు రావడం సహజమే కానీ, ప్రస్తుత మార్కెట్లో ఈ ధరలను చూస్తుంటే వినియోగదారుల జేబుకు చిల్లులు పడి నిజంగానే కంటతడి వస్తోంది. పూటగడవని సామాన్యులు, రోజువారీ కూలీలు కనీసం కేజీ ఉల్లి కొనేందుకు కూడా వెనుకాడే దుస్థితి ప్రస్తుతం నెలకొంది. ఒకప్పుడు గుప్పెడు వేసుకునే ఉల్లిని ఇప్పుడు లెక్కపెట్టి వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ విధంగా ధరలు విపరీతంగా పెరగడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా అకాల వర్షాలు, వరదలు లేదా తీవ్రమైన ఎండల కారణంగా పంట దెబ్బతినడం దిగుబడి భారీగా తగ్గడానికి దారితీసింది. దీనికి తోడు మార్కెట్లో డిమాండ్‌కు తగినట్లుగా నిల్వలు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునేటప్పుడు పెరిగిన రవాణా ఖర్చులు ధరలను అమాంతం పెంచేశాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతులకు తగిన ధర దక్కకపోయినా, మార్కెట్లోకి వచ్చేసరికి దళారీ వ్యవస్థ మరియు కృత్రిమ కొరత సృష్టించే వారి కారణంగా సామాన్యుడిపై విపరీతమైన భారం పడుతోంది. ఈ భారాన్ని మోయలేక ప్రజలు తమ నిత్య జీవితంలో ఉల్లి వాడకాన్ని వీలైనంతగా తగ్గించుకుంటున్నారు.

ఈ విపత్కర పరిస్థితుల నుంచి సామాన్యులను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతు బజార్లు మరియు ప్రత్యేక సబ్సిడీ కేంద్రాల ద్వారా తక్కువ ధరకు ఉల్లిని అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అలాగే మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వ్యాపారులపై కఠినమైన నిఘా ఉంచి ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. త్వరలోనే ఈ ఉల్లి ఘాటు నుంచి వినియోగదారులకు ఉపశమనం లభిస్తుందని ఆశిద్దాం.

## హక్కుల పరిరక్షణకు బీసీల దేశవ్యాప్త పోరాటం అవసరం

- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో బీసీల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు రాజకీయాలకు అతీతంగా దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం సాగించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌ను చేర్చి, కేంద్ర ప్రభుత్వం వెంటనే దేశవ్యాప్త కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో "ఓబీసీ జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలు-ఓబీసీల తక్షణ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ" అనే అంశంపై జాతీయ ఓబీసీ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా లెక్కించినప్పుడే వారికి న్యాయమైన ప్రాతినిధ్యం, వాటా దక్కుతుందని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో అధికారంలోకి రాగానే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా కులగణన ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. దేశంలో వివిధ వర్గాల జనాభా లెక్కలు తీస్తున్నప్పటికీ, బీసీల జనాభాను లెక్కించడానికి కేంద్రం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, బీసీలకు తగిన న్యాయం జరిగే విషయంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితి అడ్డంకిగా మారకూడదని, దీనిపై కేంద్రం పునరాలోచన చేయాలని కోరారు.

# బీసీ ఉద్యమానికి సాహిత్య రంగం భావజాల పునాది వేయాలి

- బీసీ సాహిత్యం బాధను నమోదు చేసే దశ నుంచి ప్రశ్నించే దశకు ఎదిగింది
- వెంటాడే కలాలు రజతోత్సవ సభలో జూలూరు



హైదరాబాద్ (జనంసాక్షి) : 'వెంటాడే కలాలు' ఒక పుస్తకంగా మొదలై పాతికేళ్ల తర్వాత అనేక గొంతులు కలుసుకునే చారిత్రక సందర్భంగా మారిందని వెంటాడిన కలాలు ఇప్పుడు గొంతులు పెకలిస్తున్నాయని కలిసిన గొంతులు ఒక సామాజిక దృక్పథాన్ని రచించుకునేందుకు బీసీ గొంతుకల రజతోత్సవ కూడలి దగ్గరకు వచ్చాయని, ఆ దృక్పథమే రేపటి బీసీ ఉద్యమానికి సాంస్కృతిక పునాది కావాలని వెంటాడే కలాలు పుస్తక సంపాదకులు, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బీసీల చేతులతోనే సమాజ నిర్మాణం జరిగిందని కానీ వారి జీవితాల చరిత్రలను చాలా కాలం ఇతరులు రాశారన్నారు. బీసీలు ఇక తమ చరిత్రను తామే రాసుకోవాలని బీసీల అనుభవానికి భాషను నిర్మించుకోవాలని చెప్పారు. బీసీ భావజాలాన్ని అందించే కలం యోధులుగా బీసీ కవులు, రచయితలు పదునెక్కాలని ఆకాంక్షించారు. బీసీ ఉద్యమాన్ని నడిపించేందుకు బీసీ సాహిత్య రంగం భావజాల పునాదిని బలంగా నిర్మించాలని కోరారు. ఆదివారం నాడు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'వెంటాడే కలాలు - వెనుకబడిన కులాలు' పుస్తక రజతోత్సవ సభలో జూలూరు గౌరీశంకర్ కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు దక్కాల్సిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు, ప్రాతినిధ్యం వంటి అంశాలపై సాహిత్య సమాజం విస్తృతమైన చర్చను చేపట్టేందుకు సన్నద్ధం కావాలన్నారు. బీసీ సాహిత్యం బాధను నమోదు చేసే దశ నుంచి ప్రశ్నించే దశకు, ప్రశ్నించే దశ నుంచి ప్రత్యామ్నాయ సామాజిక దృక్పథాన్ని ప్రతిపాదించే స్థాయికి ఎదుగుతుందన్నారు. పాతికేళ్ల "వెంటాడే కలాలు" ప్రయాణాన్ని సమీక్షించుకోవడం తోపాటు రాబోయే పాతికేళ్ల బీసీ సాహిత్య సాంస్కృతిక ఉద్యమానికి అవసరమైన దిశను అన్వేషించటమే రజతోత్సవ సభ లక్ష్యమని అదే బీసీ సాహిత్య ప్రకటనకు రూపకల్పన అయ్యిందన్నారు. కళలు, సాహిత్యం సామాజిక వాస్తవికతకు ప్రతిబింబాలని వివరించారు. కుల సమాజంలో కళలు, సాహిత్యానికి కూడా వర్గకుల స్వభావం ఉంటుందని చెప్పారు. ఆధిపత్య సమాజంలో అధికారంలో ఉండే వర్గం, కులం వారి సాహిత్యానికి కళలకు, సామాజిక ఆమోదం, రాజగౌరవం దక్కుతాయని విశ్లేషించారు. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు కింది కులాల వారు పాలితులుగానే మిగుపోవడంతో వారి కళలు, సంస్కృతులు అణచివేయబడ్డాయన్నారు. కుల వ్యవస్థను పాల్కురికి, అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహ్మం మరి కొందరు శతక కవులు ప్రశ్నించారు. ఆధునిక కాలంలో అభ్యుదయ వాదులు సమాజంలోని దుర్మార్గాలను ప్రతిఘటించారు. ఈ నేపథ్యంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, స్త్రీవాద అస్థిత్వ ఉద్యమాలు వచ్చాయని తెలిపారు. బీసీ రచయితలు నిరంతరం బీసీల జీవితాల్ని సాహిత్యంలోకి తీసుకురావడం ఇప్పటికీ వెలుగు చూడని కోణాలను అన్వేషించడం వాటిని ఆవిష్కరిస్తూ సాహిత్యం లో నూతన వరవడి తీసుకురావాల న్నారు. వస్తువుకు రాజకీయ పరిమళం అద్దడం, రాజ్యాధికారమే పరిష్కారమని చెప్పడం చేయాలన్నారు. రాజ్యాధికారం ప్రజా ఉద్యమాల ద్వారానే సాధ్యమనే ఆలోచనను ప్రజల్లో కలిగించడం గ్రామ స్థాయి నుండి సాహిత్య సభల ద్వారా ప్రజలను చైతన్య పరచడం నేటి బీసీ కవి, రచయిత, బుద్ధిజీవి కర్తవ్యం కావాలన్నారు. సమాజంలో సగ భాగానికి పైగా ఉన్న బీసీల జీవితాల బాగుకోసం రచనలు చేస్తే అది కులవాదం, విచ్ఛిన్న వాదం ఎట్లా అవుతుం దని చైతన్యంతో ప్రశ్నించా లన్నారు. దేశ నిర్మాతలైన బీసీలు, సృష్టించే సాహిత్యం తల్లి ఋణం తీర్చుకునే బిడ్డల కర్తవ్యం అవుతుందన్నారు. బీసీవాదమంటే కులవాదం, చీలికవాదం, సమాజాన్ని విభజించే వాదం కాదని అది సమాజంలో అందరికి సమహ క్కులు సాధించాలనే సమర నినాదమని చాటిచెప్పాలన్నారు. బీసీలకు పాలించే లక్షణాలు లేవని బాజాప్తుగా ప్రకటనలు చేసిన నాయకుల అసలు స్వరూపాలను బీసీ రచయితలు తమ రచనల ద్వారా ఎండగట్టాలని చెప్పారు. ఓట్ల కోసం బీసీల మాస్క్ వేసుకుని వస్తున్న ఆదిపత్యవాదుల కుట్రలను సాహిత్య లోకం తిప్పికొట్టాలని చెప్పారు. ఇంకెన్నాళ్లు ఈ కులం జులుం అని బీసీ సాహిత్య లోకం ఉప్పొంగాలన్నారు. కుల ఆదిపత్యాలను నేలమట్టం చేసే బహుజన సాహిత్యానికి పట్టాభిషేకం చేయాలని జూలూరు గౌరీశంకర్ పిలుపునిచ్చారు. సెంటర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ బీసీ కవులు రచయితలు ఇంత మందిగా ఒకే చోట కూడటం ఒక ఆత్మగౌరవ ప్రకటనని తెలిపారు. పీడనకు గురి అవుతున్న వర్గాలకు విముక్తి సందేశాన్ని కవులు కళాకారులుగా అందించవలసిన బాధ్యత ఉందని చెప్పారు. బీసీ రచయితల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు గాజోజు నాగభూషణం మాట్లాడుతూ బీసీ కవులు రచయితలు రాజ్యాధికార దిశగా ముందుకు సాగడానికి భావజాల పాటలు వేయాలన్నారు. ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య మాట్లాడుతూ వెంటాడే కలాలు తెలుగు సాహిత్యంలో నిశ్శబ్ద విప్లవం సృష్టించిందన్నారు వెంటాడే కలాలు చైతన్యం రాబోయే తరాలకు దిక్సూచిగా నిలుస్తుంది అన్నారు ఈ రజితో సభకు ప్రఖ్యాత విమర్శ కులు సంగిశెట్టి శ్రీనివాస్, కాకతీయ విశ్వవి ద్యాలయ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్ లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు దెంచనాల శ్రీనివాస్, పాశం యాదగిరి, అంబటి వెంకన్న, సీతారాం ,బాణాల శ్రీనివాసరావు, ప్రొఫెసర్ రఘు, జి. విజయలక్ష్మి, జుగాస్ విలి, అన్నవరం దేవేందర్, ప్రొఫెసర్ వి .త్రివేణి, ప్రొఫెసర్ పెబ్బేటి, మల్లికార్జున్, మందవరపు హైమా వతి, నాలేశ్వరం శంకరం, ననుమాస స్వామి, ప్రసాదమూర్తి, తగుళ్ళ గోపాల్ , సీతారాం పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు క్రీడలు ఎంతో కీలకం

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త**






హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళా సాధికారతకు క్రీడలు ఎంతో కీలకమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వెలోడ్రోమ్ ఓయూ వేదికగా ఆదివారం నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ స్టేట్ లీగ్ – ట్రాక్ ఈవెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా మహిళల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం, క్రీడల ద్వారా మహిళా సాధికారతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా సైక్లింగ్ క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ముఖ్యంగా మహిళలు క్రీడా రంగంలో ముందుకు రావడం ద్వారా సమాజంలో మరింత ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. సైక్లింగ్ ఒక ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడంతో పాటు పోటీ క్రీడగా కూడా ఎంతో ప్రాధాన్యత కలిగినదని ఆయన అన్నారు. తెలంగాణలో మహిళా సైక్లిస్టులకు మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారిణులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే యువతులు తమలో ఉన్న ప్రతిభను గుర్తించి క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని ఆయన సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులు కష్టపడి సాధన చేయాలని ఆకాంక్షించారు. అస్మిత ఖేలో ఇండియా మహిళల సైక్లింగ్ స్టేట్ లీగ్‌లో పాల్గొన్న ప్రతి క్రీడాకారిణిని ఉప్పల శ్రీనివాస్ గుప్త అభినందించారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మెద్చల్--మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన యువ సైక్లింగ్ క్రీడాకారిణులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించడం అభినందనీయం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, క్రీడా శాఖ అధికారులు, కోచ్‌లు, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారిణులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు. మహిళల ప్రతిభకు ప్రోత్సాహం – క్రీడల ద్వారా సాధికారత – తెలంగాణ క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం అనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామ్‌చందర్, సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ ఎన్. జగన్నాథ్ దాస్, డా. మ్యాక్స్‌వెల్, సంజీవ్ రెడ్డి, పాషా, సైక్లింగ్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## అక్కాచెల్లెళ్ల మృతిపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

- కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శ

ములుగు ప్రతినిధి (జనంసాక్షి) : ములుగు మండలం కాశీందేవిపేటలో నీటికుంటలో పడి మృతి చెందిన అహ్మద్ పాషా కుమార్తెలు సమ్యాన్, ఆసియా కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఫోన్‌లో పరామర్శించారు. ఇద్దరు పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ఆస్పత్రిలో మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# సూర్యాపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన కారు
- ప్రమాదంలో ఖమ్మం మమత హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్ మృతి





సూర్యాపేట (జనంసాక్షి): సూర్యాపేట మండలం పిల్లలమర్రి సమీపంలో ఖమ్మం హైదరాబాద్ జాతీయ రహదారి 366బీబీ పై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు తీవ్రంగా వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఖమ్మం మమత హాస్పిటల్ లో న్యూరో సర్జన్ గా పని చేస్తున్న డాక్టర్ జగదీష్ మృతి చెందారు. సమాచారం అందుకున్న సూర్యాపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సూర్యాపేట రూరల్ ఎస్సై అనిల్‌రెడ్డి సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కసుకుర్తి జగదీష్ (50) వృత్తి రీత్యా న్యూరో సర్జన్. కొత్తపట్నం, ప్రకాశం జిల్లా వాస్తవ్యులు. ఇతను ఖమ్మం మమత హాస్పిటల్‌లో 20 సంవత్సరాలుగా పనిచేయుచున్నాడు. ఇతను ఈరోజు ఉదయం సుమారు 6:30 గంటల ప్రాంతంలో బయలుదేరి హైదరాబాద్ లో ఉండే తన భార్య, ఇద్దరు కూతుర్లను



కలుసుకునేందుకు వెళ్తున్నాడు. సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామం పరిధిలో గల ఎన్ హెచ్ 365 బీబీపై ఆదివారం ఉదయం కారు ఖమ్మం నుండి హైదరాబాద్ వెళ్లే మార్గంలో పిల్లలమర్రి వంతెన దగ్గర కారు వంతెన రైలింగ్ ఢీకొట్టడం వల్ల మంటలు చెలరేగి కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించారని తెలిపారు. మృతుని వివరాలు తెలుసుకోగా ప్రకాశం జిల్లా కసుకుర్తి కొత్తపట్నం చెందిన జగదీష్(50) ఖమ్మం మమత హాస్పిటల్ లోన్యూరో సర్జన్‌గా 20 సంవత్సరాలుగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం బయలుదేరి హైదరాబాద్ లో ఉండే తన భార్య, కూతుర్లను కలుసుకునేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంపై మృతుడు జగదీష్ అన్న కసుకుర్తి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370